- దశాబ్దపు స్త్రీవాద కథా సాహిత్యం - ఒక అవలోకనం
- తెలుగు మౌఖిక వ్యవహార భాష : పరిశోధనావశ్యకత
- పి.వి.సృష్టించిన 'గొల్ల రామవ్వ'
- ఆచార్య భూమయ్యగారి 'భౌమమార్గ విమర్శ'
- తెలుగు సినిమా ప్రయాణంలో జానపద గీతాల పాత్ర
- మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-3
- ప్రక్రియల దండలో 'మణిపూసల' మెరుపు
- ప్రళయ కాలంలో కర్తవ్య గీతం 'ప్రపంచీ కరోనా'

# మూసీ

# MUSI


- Samputi : 27 • Sanchika : 05 • Pages : 64 • Rs. 20
- March 2024

UGC Care List
Approved Journal






వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 27 సంచిక : 5
మార్చి - 2024
'శోభకృత్' మాఘ, ఫాల్గుణ మాసాలు
**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177


Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక'** **(MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

ISSN 2457-0796



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

దశాబ్దపు స్త్రీవాద కథా సాహిత్యం-ఒక అవలోకనం (2001-2010) ... డా. వి. అరుణ్‌కుమార్ 7
తెలుగు మౌఖిక వ్యవహార భాష : పరిశోధనావశ్యకత ... ఆచార్య పమ్మి పవన్ కుమార్ 11
పద్యమనోహరం -50 ... గన్నమరాజు గిరిజామనోహర్ 16
చారిత్రక నేపథ్యం గల ప్రబంధం - కళ్యాణ రాజ చరిత్రము ... వడ్లమూడి యోగీశ్వరరావు 17
కళాతపస్వి కె. విశ్వనాథ్ సినిమాలలోని పాటలు - సామాజికావలోకనం ... డా. తిరునగరి శరత్ చంద్ర 21
పి.వి. సృష్టించిన 'గొల్ల రామవ్వ' ... డా. కసప నరేందర్ 25
ఆచార్య భూమయ్య గారి 'భౌమమార్గ విమర్శ' ... అరుణ ధూళిపాళ 29
తెలుగు సినిమా ప్రయాణంలో జానపద గీతాల పాత్ర ... యడవల్లి సైదులు 33
విమర్శకునిగా దేవులపల్లి రామానుజరావు ... ఇమ్మిడి మహేందర్ 37
మహాభారతం:'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-3 ... డా. అట్టెం దత్తయ్య 41
సంపత్కుమార్ కవిత్వం - మానవీయ దృక్పథం ... బి.వి.ఎస్. గౌతమ 45
ప్రక్రియల దండలో 'మణిపూసల' మెరుపు ... డా. సుభాష్ 51
ప్రళయ కాలంలో కర్తవ్య గీతం 'ప్రపంచీ కరోనా' ... డా. జె. నీరజ 54
పద్యమనోహరం -49 ... గన్నమరాజు గిరిజామనోహర్ 46

### కవితలు

కైవల్య చింతన ... స్తంభంకాడి గంగాధర్ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; బుద్ధ గీతం ... తగుళ్ళ గోపాల్ - 24 ; నానీలు ... పిప్పి శ్రీలత-39; నిరంతరం అభ్యసించు ... డా. మహమ్మద్ హసన్ - 44; జీవితమింతే ... డా. తిరునగరి శ్రీనివాస్ - 49; భస్మలేపన శివా! పార్వతీశ! ... యెల్లికంటి జ్ఞాన ప్రసూనా శర్మ -50; మనసు పయనం ... పుట్టి గిరిధర్ - 62 ; స్వప్నం ?? ... సాహిత్య మణి - 62;

### సమీక్షలు

కవుల ఊహలకు కట్టిన వేదిక ... డా. కాచాపురం దుర్గాదేవి 57
అయాచితం నటేశ్వరా! శతక వైభవం! ... సుప్పని సత్యనారాయణ 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderbad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 5 4 హైదరాబాద్ మార్చి : 2024

సంపాదకీయం






వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి



స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

## కోరిక

కోరికలే అన్ని రకాల సమస్యలకు, బాధలకు మూలం అంటూ ప్రాచ్య పాశ్చాత్యమైన అన్ని రకాల వేదాంత వ్యవహారాలు చెప్తూనే ఉన్నాయి. బౌద్ధం మరీ ప్రత్యేకంగా సామాన్యుని వరకూ ఈ భావాన్ని అందించే ప్రయత్నం చేసింది. కోరికలు లేని మనిషి, వర్గం, వర్ణం ఎవరైనా ఉంటారా? అని ఆలోచనలు కూడా ఉంటున్నాయి. అసలు కోరికలు ఎందుకు ఏర్పడుతున్నాయి? ఎప్పుడు కోరికలు వస్తాయి? ఈ అంశాలను ఒకసారి గమనించాల్సిన అవసరం ఉంది.

లేని వస్తువును, పొందలేని వస్తువును ఆశించడమే కోరికకు మూలం. ఉన్న వస్తువులు, ఉన్న ప్రకృతి, ఉన్న శక్తి, ఉన్న ధనం, కుటుంబం అన్నింటిలోనూ సంతృప్తి పడితే కోరికలే ఉండవు. అయితే కోటిలో ఒక్కరికి కూడా ఇటువంటి గుణాలు ఉన్నాయో లేదో ఈ కాలంలో గమనించాల్సిందే. లోక వ్యవహారంలో ఏ విషయాన్ని చూసినా, ఏ అనుభవాలు తనను ప్రేరేపించినా, వ్యతిరేకంగా గానీ, అనుకూలంగా గానీ స్పందనలు ఏర్పడటమే కోరికలకు మూలం అవుతున్నాయి.

మన దగ్గర లేకపోవడమే కోరికకు కారణం. లేనిది ఏమిటి? ఉన్నదంతా అనుభవించే శక్తి కూడా ఉండదు కదా! వ్యక్తికి పెరాలిసిస్ వచ్చిన సందర్భంలో కోట్లాది రూపాయలు ఉన్నా అనుభవ యోగ్యం ఉంటుందా ! తాము ఏది అనుభవించాలన్నా తమ శక్తి కన్నా తక్కువ శక్తి గల వానిని మాత్రమే అనుభవించగలరు. తమ శక్తికన్నా అధికమైన శక్తి గల కోరికలను తీర్చుకోవడం కోసమే కృషి అధికంగా చేయాల్సి ఉంటుంది. ఉద్యోగాదులు కూడా అంతే, తమ శక్తికన్నా తక్కువ శక్తిగల ఉద్యోగాదులు వెంటవెంటనే వస్తాయి. స్థాయి, శక్తి పెరిగితే పై ఉద్యోగాదులకు మనం పంపించబడతాము. లక్ష రూపాయలు చేతిలో ఉన్నప్పుడు ఎనభైవేల రూపాయల టీవీ కొనుక్కోవడం పెద్ద కష్టం కాదు. యాభై వేల రూపాయలు ఉన్నప్పుడు మాత్రం ఎనభైవేల రూపాయల టీవీ కొనుక్కోవడం కష్టం. అప్పుడు అది కోరికగా మిగిలిపోతుంది. దానికోసం శ్రమ మొదలు అవుతుంది. అక్కడే కష్టం కూడా ప్రారంభమౌతుంది.

లోకంలో ఏ వస్తువైనా కొనాలంటే దాని వెలకన్నా అధికమైన ధనం మన దగ్గర ఉండాలి. దాన్ని సంపాదించగలిగే శక్తి అయినా మన దగ్గర ఉండాలి. శక్తి ఉన్నవాడే లోకంలో ఏదైనా కొనగలడు, అనుభవించగలడు. శక్తి లేనివానికి కొనుగోలు ఉన్నా అనుభవ శక్తి ఉండదు. అందువల్ల శక్తిని పెంచుకునే ప్రయత్నం మొదలు పెడితే కోరికలు తీరుతూ ఉంటాయి. శక్తి తగ్గుతున్నా కొద్దీ మన దగ్గరి వస్తువుల, వ్యవహారాల అనుభవాలను కోల్పోతుంటాం.

కోరికలు రావడానికి మూలం మన దగ్గరి తగిన శక్తి లేకపోవడం. కోరికలు తీరాలంటే శక్తి చుట్టూ మన మనస్సు, శరీరం తిరుగుతూ ఉండాలి. శక్తి హీనమైన లోక వ్యవహారాల చుట్టూ మనస్సు తిరుగుతూ ఉండే వారికి వారిలో ఉన్న కొద్ది శక్తి కూడా డిశ్చార్జ్ అవుతూ ఉంటుంది. మనం నివసిస్తున్న భూమి కూడా అత్యంత శక్తివంతమైన సూర్యుని చుట్టూ తిరుగుతూనే ఉంది కదా! దానివల్లనే భూమికి, మనకు శక్తి సంక్రమిస్తూంది. అందుకే మన మనస్సు కూడా శక్తివంతమైన ఆలోచనల చుట్టూ, శక్తి వ్యవహారాల చుట్టూ ప్రదక్షిణం చేస్తూ ఉండాలి. భారతీయ ధర్మంలో అమ్మవారుగా భావించే ఏ దేవత అయినా శక్తికి సంకేతాలే. ఆ శక్తిని మన శక్తిగా మార్చుకునే ప్రయత్నం మొదలు పెడితే కోరికలనేవి మనకు ఉండనే ఉండవు.

ఈ మాసం మన భూమి ఆవిర్భావానికి ప్రతీక అయిన లింగ ఉద్భవం... శివరాత్రి. ఈ భూమి, భూమిమీద అందరికీ ఆనందం, ఐశ్వర్యం కలగాలని అందరం కోరుకుందాం..

# కైవల్య చింతన



సీ. తనువును గాంచుతు తమము జెందకు నీవు
తగులబడువరకె దానియునికి
ఆస్తిపాస్తులనేవి యవసరానికె గాని
సంపదెప్పటికైన సాగిరాదు
సతులు సుతుల జూసి సంతసించుముగాని
వగచి నీతో వచ్చు వారు గాదు
నశ్వరమైనట్టి నర జీవితము నీది
అంతమే లేనిది యాత్మ యొకటె
ఆ.వె. ఆత్మ యెడల నమిత ననురాగమును జూ
ఆత్మ యెపుడు నిన్ను ననుగమించు
ఆత్మ నీవు, నీవు నాత్మ సత్యమ్ముగ
ఆత్మ యందె నీవు నాశ్రితుడవు

సీ. అంతరంగములోని యరివర్గజాలమున్
ఆమడదూరంబు నదిమి పెట్టు
సోమరితో నీవు సోపతి చేయక
కార్యముల్ జేయంగ కదులుమెపుడు
సమయమ్మునంతయు సంకల్ప దీక్షతో
సంసిద్ధి గావించి సంతసించు
సంకుచితమ్మేది సంపదలీయదు
వికసిత తత్త్వమే విలువలిచ్చు
ఆ. అంతమొందజేయు నత్యాశ నెప్పుడు
పొందబోకు వెతలు పొసగవవియు
దుఃఖమిడు దురాశ దూరమ్ము జేయుము
ఆశ మిగుల జాలు నాప్త మిత్ర!

సీ. కాలమ్ము నెపుడైన కలిసి రాకున్నను
మౌనమొకటి శ్రేష్ఠమౌను నీకు
కోపతాపంబులు కొలువైన గేహాన
శస్త్రమై కాపాడు శాంతగుణము
స్థాన బలము లేక సత్తువంతయు తగ్గ
యధికుడవనకుండ నణగియుండు
వాదోపవాదాలు వాడిగా జరిగితే
ఆవేశ మొక్కటి నదుపు నుంచు
ఆ. దుర్జనులకు నీవు దూరంబు గాకున్న
నడతయంత కూడ నష్టమగును
సజ్జనులకు నీకు సాంగత్యమున్నచో
ఆత్మ యిచ్చును నీకు నతులగుణము.

సీ. ఇహ పరముల యందు యీశ్వర చింతనే
మోక్ష సాధనముగ మోదమిడును
మోహితంబగునట్టి ముక్కంటి వరములె
భక్తాళి కైవల్య భాగ్యమొసగు
నప్రమేయాతీత యణిమాది గుణశోభ
శంకరతత్త్వంబు శక్తులొసగు
సర్వ ప్రాణుల కెప్డు శాశ్వత ముక్తిని
పరమేశు లింగమె ప్రాప్తమిచ్చు.
తే. రాజరాజేశ్వరుండిల పూజ్యుసురుడు
సకల కర్మల సృష్టికి సాక్షియతడు
చంద్రశేఖరు కృపపంచు సాత్వికుండు
నాశ్రయించిన వారికి నాత్మ బంధు!!

**స్తంభంకాడి గంగాధర్**
కరీంనగర్, ఫోన్ : 738 620 0610

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. ఉపోద్ఘాతం : ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. విషయం : పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. ముగింపు : పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
5. ఉపయుక్తగ్రంథసూచి : ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

## తుకారాం అభంగం

పాడవే మనసా హరిగానము
మై మరువగా ఊగదే సంసారము
మధురం నాదం వేణు సుధగానము
మురిపించగా ఆడునే ఆబాలము

సాధు సంతులు యోగి పుంగవులు
కర్మయోగులు, శిష్ట జనులును
ఆదమరిచి హరి జపము చేసినా
అందరాని ఆ ఆపన్న హస్తము
అందునే హరికీర్తి గాత్రునకు

ముక్తిమార్గమున ప్రథమ ద్వారము
శక్తి కలుగ జేయు యుక్తి మంత్రము
పాడి పరవశించు పరమ యోగము
హరి హరి హరి హరి మంత్రరాగము

తుకా పలుకు పదము
పరమ సత్య వచనము
ఆలకించి హరిని భజించి చూడుము
కలుగును వైకుంఠ కృపావర్షము




అనువాదం :
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 5 హైదరాబాద్ మార్చి : 2024


# దశాబ్దపు స్త్రీవాద కథా సాహిత్యం – ఒక అవలోకనం (2001–2010)

**డా. వి. అరుణ్ కుమార్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాల, హైదరాబాద్.
ఫోన్ : 9866892692

తెలుగు సాహిత్య చరిత్రలో దానికంటే ముందు కాలంలో స్త్రీని కేంద్రబిందువుగా చేసి సాహిత్యంలో రచనలు వెలువడినాయి. అయితే అప్పటి సాహిత్యం స్త్రీని భోగ వస్తువుగా, వర్ణించే వస్తువుగా, పురుషుడి కన్న తక్కువ స్థానం కల్గి ఉండే వ్యక్తిగా చిత్రీకరించారు. సమానమైన భాగస్వామ్యాన్ని సాహిత్యంలో కల్పించలేదు. దీనికి ప్రధానకారణం పితృస్వామ్య వ్యవస్థ అమలులో ఉండడం, పురుషుడే యాజమాన్య నిర్ణయాధికారాలు కల్గి ఉండడం ప్రధాన కారణం. అయితే సాహిత్యం ఆధునికతను సంతరించుకుంటున్న కాలంలో స్త్రీ వస్తువులో, సమస్యలలో, భావజాలములో ఆధునికత సంతరించుకుంది. దానితో ఆధునికసాహిత్య రచనలలో వస్తువు పరంగా స్త్రీ మార్పులకు లోనైంది. దాని తరువాత పరిణామ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా అస్తిత్వ భావజాలలు రావడం దానితో స్త్రీకి ప్రత్యేకమైన పరిధి, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, భావుకత ఉండాలనే నేపథ్యం, స్త్రీవాద రచయిత్రులలో వెలువడడం, తమ సమస్యలు, తమ వస్తువు తాము రాస్తే నిజమైన ఇతివృత్త నిర్ధారణ అవుతుందనే సంకల్పం కలగడం... ఇలా ప్రపంచ వ్యాప్తంగా స్త్రీవాద సాహిత్యం బలంగా సాహిత్యంలో దూసుకు రావడంతో సాహిత్యంలో స్త్రీవాద సాహిత్యం ఒక వాదంగా స్థిరీకరించబడింది. దానితో స్త్రీవాద సాహిత్యం కవిత్వపరంగా, కథా పరంగా, నవలా పరంగా ఇలా అనేక ప్రక్రియలలో స్త్రీవాదం వస్తువైనది.

ఈ అత్యాధునిక సాహిత్యంలో, అత్యాధునిక కాలానికి ముందు తరువాత స్త్రీవాద కథాసాహిత్యం, స్త్రీవాద సాహిత్యాన్ని తులనాత్మకంగా పరిశీలిస్తే ఒకప్పటి స్త్రీవాద భావజాలం వేరుగా కనబడుతుంది. స్త్రీవాద సాహిత్యం వెలువడిన సమయంలో స్త్రీవాద రచనలు పదునైన భావజాలంతో, పురుష అహంకారానికి తీవ్ర వ్యతిరేక పదజాలంతో, కొంత విప్లవాత్మక భావజాలం కనబడుతుంది. అయితే 1990 దశకంలో స్త్రీవాద సాహిత్యం తనను గురించి స్పృహ, తన శరీరాన్ని గురించి స్పృహ, అనుభూతి గుర్తించడం, నీరసించడం తమపై జరుగుతున్న అన్ని రకాల హింసను గుర్తించమని, ఆ ధోరణి మానుకోమని సమాజానికి విన్నవించడం ప్రధాన వస్తువుగా స్త్రీవాద సాహిత్యం వెలువడినది. అయితే 2000 దశకం, 1990 దశకం మధ్య తేడా గమనిస్తే వస్తువు పరంగా 1990 దశకం ఎంతో ఉన్నత స్థానానికి చేరుకుందనే చెప్పవచ్చు. అయితే ఈ అత్యాధునిక శతాబ్దపు ఆరంభ దశకంలో స్త్రీవాద రచయిత్రులలో ఆలోచన పరంగా, విశ్లేషణ పరంగా, మారుతున్న కాలపు భావజాలపరంగా స్త్రీవాదులు ఇప్పుడు సమాజంతో పాటు కొత్తరూపు తీసుకుంటున్న సమస్యల గురించి మాట్లాడుతున్నారు.

గ్లోబలైజేషన్ ప్రభావంతో స్త్రీల జీవితాల్లో వస్తున్న మార్పుల్ని సునిశిత పరిశీలనతో చర్చకు పెడుతున్నారు. మారుతున్న పల్లెలు, పట్టణ స్వరూపాలు, మానవ సంబంధాలు, మానవ విలువలు, కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, వివాహ వ్యవస్థలో మార్పులు, వైవాహిక సంబంధాలు, అంతరిస్తున్న కులవృత్తులు, రాజకీయ రంగాల్లో స్త్రీలపై కొనసాగే అణచివేత, స్త్రీలు ఎంచుకుంటున్న కొత్త కెరియర్స్‌లోని మానసిక, శారీరక ఒత్తిడులు, మతవిద్వేషాలు, ప్రవాస జీవితంలోని సంఘర్షణ ఇలా సమాజం విశ్వరూపాన్ని తమ కథల ద్వారా చర్చకు పెడుతున్నారు స్త్రీవాదులు. **"అందుకు మారుతున్న సమాజంతో పాటు స్త్రీలు మారుతున్నారు, స్త్రీల చుట్టూ ఉన్న సమాజం ఆలోచనల్లో కూడా మార్పు వస్తుంది. స్త్రీల పట్ల సమాజం ప్రవర్తన కూడా ఎప్పటికప్పుడు మారుతూనే వుంది. అయితే అన్ని కాలాల్లోనూ, అన్ని సమాజాల్లోనూ స్త్రీల పట్ల ఆంక్షలు మాత్రం వుంటూనే వున్నాయి. కాకపోతే అంశాల స్వభావంలో మార్పు వస్తుంది"**



ఈ దశాబ్దంలో ఓల్గా రాసిన 'సమాగమం' కథ ఒకప్పటి పురాణాల లోని పౌరాణిక పాత్రల ఉదాత్తత ఎదుగుదల, సంపూర్ణత, ఆయా పరిస్థితులల్లో వాళ్ళు పడ్డ సంఘర్షణ ఫలితాలను, చరిత్రను ఈనాటి దృష్టికోణంతో స్త్రీయొక్క మనసులో కల్గే అంతర్గత విశ్లేషణ, పురుష పితృస్వామిక వ్యవస్థలో పైకి కనబడని స్త్రీలపై వున్న అపనమ్మకాన్ని ఈనాటి పరిస్థితులకు అన్వయించి విశ్లేషించడం జరిగింది. రామాయణంలోని ఇద్దరు స్త్రీల మధ్య జరిగిన సంభాషణ రూపంలో కథ సాగుతుంది. ఇందులో సీత, శూర్పణఖ పాత్రల ద్వారా ఎన్నో కోణాలను విశ్లేషించారు. స్త్రీకి స్త్రీ శత్రువు కాదని,


పురుషుల చేత అన్యాయానికి గురైన ఇద్దరు స్త్రీల మధ్య గొప్ప అనుబంధం ఏర్పడుతుందని ఓల్గా ఈ కథ ద్వారా నిరూపించారు. ఓల్గా రాసిన మరికొన్ని కథలు **'మృణ్మయనాదం, సైతకబంధం, విముక్త'.** ఈ ఇతిహాస గాథలను కొత్త ఆలోచనా ధోరణి నుంచి చెప్పిన కథలు. ఈ కథలలో శూర్పణఖ, అహల్య, రేణుక, ఊర్మిళ ఒక్కొక్కరిది ఒక్కొక్క కథ. ఒక్కొక్కరిది ఒక్కొక్క త్రోవ. సీత వారందరి అనుభావాల నుంచి తను నేర్వగలిగిందే నేర్చింది. మొదట అందరి ఎడలా తనకు నిరసన, కోపం, తర్వాత అందరి జీవితాలలోని వ్యథలూ సమానమే నని తెలిసాక సామరస్యం, స్నేహం తనవంటి వారి బాధలు విన్నాక తానొంటరి కాదనే ఒక బలం. స్త్రీ సమూహంలో తానొకతేననే స్పృహ, కథల్లో సీత పాత్ర తన జీవితానుభవాల్లోని వివిధ సందర్భాల్లో అరణ్యవాసంలో తాముండగా రేణుకను, అరణ్యవాసం నుంచి తిరిగొచ్చాక ఊర్మిళను, పిల్లలను పెంచుతూ వాల్మీకి ఆశ్రమంలో శూర్పణఖను, వివాహానంతరం రాముడి ద్వారా అహల్య గురించి విని ఆ తరువాత అరణ్యవాసంలోనే కలుస్తుంది. వారిని కలిసిన ప్రతి సందర్భానికి, సీత జీవితంలో జరిగిన మార్పులు పరిణామాలకు సంబంధం ఉంది. వారి అనుభవాలనుంచి తనను అర్థం చేసుకో గలుగుతుంది. సీత జీవితంలో వచ్చిన మార్పులు, సంఘటనలు, ఎదురైన అనుభవాలు అన్ని కలిసి తానొక దృక్పథాన్ని ఏర్పరచుకు నేందుకు దోహదపడతాయి. ఏ స్త్రీ అయినా తన జీవితానుభవాల ద్వారా తనని తాను అర్థం చేసుకోవటంతో పాటు ఇతర స్త్రీల అనుభవాలను తెలుకోవటం ద్వారా తనకు, ఇతర స్త్రీల మధ్య గల సామ్యాలు అర్థమవుతాయి. ఈ సామ్యాలకు మూలమైన పితృస్వామ్యం అర్థమవుతుందంటారు.

ఓల్గా ఈ నాలుగు కథలతో పాటు **"బంధితుడు"** పేరుతో రాముడికి ఉన్న పరిమితులను కూడా అర్థమయ్యేరీతిలో చెప్పారు. ఆర్య ధర్మాల ప్రకారం **'నా జీవితం రాజ్యాధికారం కింద అణగిపోవలసిందే'** అని రాముడు గుర్తించిన వ్యవస్థ. అలానే రాముడి మనసులో సీతకు ఉన్నత స్థానం వున్న, అయోధ్యకు తీసుకురావడంలో సీత శీల నిరూపణ సమాజం కొరకు చేయవల్సిన పరిస్థితులను అంతర్గతంగా బోధించ బడిన విషయాలు, ఇలా పలు కోణాలను రాముడు రాజ్యబాధితుడు, అధికార బాధితుడు, రాముడికి వున్న 'శృంఖలాబద్ధత'ను స్త్రీవాదం (ఫెమినిజం) గ్రహించ గలుగుతుంది. అందుకే కథలో రాముడిని, మహిళావరణంలో సీతను ఒకే దృక్పథంలో చూపించిన విశిష్ట కథలుగా గుర్తించవచ్చు. ఓల్గా మరో కథ **'అత్తిలు'** స్త్రీవాద ధోణిలో సాగుతుంది. కుటుంబ వ్యవస్థలో పురుషుడి యొక్క ఆధిపత్యం, అధికార ధోరణిలో ఇప్పుడున్న సమాజంలో కూడా కొనసాగుతూ వుంది. సమాజంలో వున్న కుటుంబ వ్యవస్థ, ఆర్థిక స్వావలంబన కోసం వరకట్నంపై ఆధారపడుతున్న సాంఘిక వ్యవస్థ, వివాహ వ్యవస్థ, బంధువ్యవస్థ డబ్బుకు ఇస్తున్న ప్రాధాన్యత మానవ విలువలకు గాని, మానవ సంబంధాలకు గానీ, వ్యక్తిత్వానికి గాని విలువ ఇవ్వని పరిస్థితులు గోచరిస్తున్నాయి.

కుప్పిలి పద్మ రాసిన 'సాలభంజికలు' ఈనాటి స్త్రీ కుటుంబం బయట లోపలా బహుముఖీనమైన దోపిడికి గురవుతూ కూడా అలుపెరుగని పోరాటం చేస్తున్న స్త్రీల విషాద జీవితాన్ని చిత్రించిన కథ. మరో రచన **'వర్షపు జల్లులలో' 'కుబుసం'** కథలో ఆధిపత్యవాద సంస్కృతిపైన మోజుతో తాత్కాలిక ఆనందంతో జీవన మాధుర్యాన్ని కోల్పోతున్న యువతరపు అయోమయ స్థితిని చిత్రీకరించిన కథలు. అలానే **సత్యవతి రాసిన 'మంత్రనగరి' సాలెగూడు(ప్రతిమ) 'కొత్తకోర్సులొస్తున్నాయి జాగ్రత్త' (సుభాషిణీ)** లాంటి కథలు గ్లోబలైజేషన్ వికృత స్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నాయి. కొత్త కెరియర్స్‌లో స్త్రీల మానసిక, శారీరక ఒత్తిడి ఎక్కువవటమే కాకుండా వారి వ్యక్తిత్వాలు ప్రశ్నార్థకమవుతున్న తీరును సునిశితంగా ఎత్తి చూపిస్తాయి.


ఈ దశాబ్దంలో వి. ప్రతిమ **'ఖండిత'** సమాజంలో స్త్రీల మనసులో వున్న కోరికలు, భావాలు, స్వేచ్ఛను ఏవిధంగా హరిస్తున్నయో పితృస్వామిక వ్యవస్థకు వ్యతిరేకంగా స్త్రీ అస్తిత్వం కొరకు రాయబడింది. పి.సత్యవతి **'ఆవిడ'** పితృస్వామిక వ్యవస్థలో జాతి పేరుతోను, ప్రతీకారం పేరుతోను యిబ్బందుల పాలవుతున్న వ్యక్తులు స్త్రీలే తమకు తమను శత్రువుగా మారుస్తున్న వ్యవస్థ కుండే భిన్న పార్శ్వాలను, తలచి చూడవలసిన అవసరాల్ని వివరించిన కథ. అలానే **'ఆత్మవాలిన చెట్టు', 'నేనొస్తున్నాను'** కథలు గ్లోబలైజేషన్ కారణంగా వివిధ వర్గాల ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితులను తెలియజేశారు. అబ్బూరి ఛాయదేవి రచన **'అదొక సంస్కృతి'** మన సమాజంలో ఒకప్పటి అభ్యుదయ భావాలు, స్త్రీ స్వాంగికతకు ఇప్పటి సమాజంలోని వారు గుర్తించలేకపోతున్న స్థితిని వివరించారు. వారసత్వ గుర్తింపుని స్త్రీవాద చైతన్యంతో కొత్తకోణం నుంచి ప్రశ్నించిన కథ. అక్కిరాజు భట్టిప్రోలు **'అంటుకొమ్మ'** తెలుగు ప్రాంతంపై స్త్రీవాదం విస్తరిస్తున్నకొద్దీ సాహిత్యానికి కొత్త కోణాలు వచ్చి చేరుతున్నాయి. వంశవృక్షంలో చోటు దొరకని వైనాన్ని విప్పిచెప్పేవరకు ఆలోచన స్థాయిలోనైనా ఇదొక సమస్యగా అనిపించదు. **'నో మేల్ చైల్డ్'** తండ్రికి మగ పిల్లలు లేనంత మాత్రాన వంశవృక్షం ఆగిపోవద్దు అనే కొత్తకోణం స్త్రీ కూడా ఆ అంటుకొమ్మ నుంచి వచ్చిన ఒక కొమ్మ కాబట్టి ఆ వంశవృక్షంలో ఆమెకు కూడా ఒక శాఖను కేటాయించాల్సిందే. ఆ శాఖ పలుశాఖలుగా అభివృద్ధి చెందాల్సిందే. అందుకే ఆ వంశవృక్షానికి అంటు కొమ్మ కట్టాల్సిన అవసరాన్ని స్త్రీవాద కోణంలో చిత్రించడం జరిగింది.

ఈ దశాబ్దంలోనే చంద్రలత రచన **'ఆవర్జా'** స్త్రీలపై కొనసాగుతున్న వివక్షను తులనాత్మక పరిశీలన ద్వారా మరో కొత్తకోణం నుండి దర్శించిన కథ. స్త్రీకి ఒక సహజధర్మం కలదు. ఇందులో



అవమానంలేదు, అసహ్యం లేదు. సిగ్గు పడాల్సిందే లేదు. చితికి పోవాల్సింది లేదు. ఋతుచక్రం ఆడవారిని అనుక్షణం శాసిస్తూనే ఉంటుంది. రసాయన ప్రక్రియలు అదృశ్యరూపంలో ఆడిస్తూనే ఉంటాయి. నిత్యజీవితంలో చెలరేగే ఈ సంఘర్షణ, ఒత్తిడి, ఆందోళన జీవ రసాయన ప్రక్రియను ప్రభావితం చేస్తూనే ఉంటాయని రచయిత్రి చెప్పుతుంది. కథలో స్త్రీని గురించి తల్లిదండ్రులు పడే ఆందోళన, స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగరీత్యా ఒత్తిడి, సహోద్యోగుల నుంచి విమర్శలు, హేళనకు గురిచేసే మాటలు, ఉద్యోగ బాధ్యతలో సంభవించే స్త్రీ సమస్యల గురించి వివరించడం జరిగింది. అలానే పురుషులకి, స్త్రీలకి మధ్య వున్న సమతుల్య తేడాను పేర్కొనడం జరిగింది. అందుకే జీవితంలో శరీరధర్మాలకు కుటుంబ జీవనానికి / వ్యక్తి స్వతంత్రానికి సంఘ వైఖరికి / వృత్తి గౌరవానికి – సమాజ ధోరణికి / అస్తిత్వ సాధనకు – అనంతవేదనకు / మానవ విలువలకు సృష్టి వైఖరికి నడుమ బ్యాలెన్స్ షీట్ ట్యాలీ కావడంలేదు. ఎక్కడో ఏదో ఎంట్రీ తప్పిపోయింది. కూడికలోనో, తీసివేతలోనో, అంకగణాలలోనో, ఆవర్జాలోనో అంటూ పురుషతత్వానికి, స్త్రీతత్వానికి మధ్య తులనాత్మక భేదం ద్వారా స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలను చిత్రికరించారు. ఇదే కోణంలో కె.యన్.పలమనేరు బాలాజీ **'సంకోచం'** కథలో పేర్కొన్నారు. చంద్రలత మరో రచన **'కోలీగ్స్'** **'అమ్మ పుట్టిల్లు'** కథలు స్త్రీవాద ధోరణిలో కొనసాగుతున్నాయి. స్త్రీ ఎప్పుడూ పురుషుడి ఆధిపత్యానికి లొంగి ఉండాలని స్త్రీకి స్వేచ్ఛను అడిగే హక్కు వుండదని అంటోంది పితృస్వామిక వ్యవస్థ. ప్రేమ, సహజీవనం మధ్య ఏర్పడిన ఖాళీని జయించే ప్రయత్నంలో రూపొందిన కథ కె.ఎన్.మల్లేశ్వరి **'ఖాళీ'** స్త్రీవాదంతో ముడిపడిన కథ. ఈనాటి సమాజంలో టి.వీ యాంకర్లు, సినిమా జీవితాలతో ముడిపడిన స్త్రీ జీవితాలను, తెరమీద కనిపించే స్త్రీని సమాజం ఒక పబ్లిక్ ప్రాపర్టీగా చూసే సమాజాన్ని చిత్రించారు. కథలో నేను బతకడానికి, ఆశల్ని బతికించుకోవడానికి జుట్టుకొసల్నుంచి కాలివేళ్ళ వరకూ ఇంకో నేనుగా కనిపించడానికి! చివరికి యాంకరమ్మ ఎన్ని విలువల్ని ధ్వసం చేస్తే ఈ మార్గం దొరికింది? విలువలు... ఏ విలువలు? మీరు చెప్పేవో, నేను నమ్మేవో కాదు చిన్నతనం నుంచి కుటుంబం సమాజం నా చేత పాటింపజేసిన విలువలు... నిరంతరం రగిలే అసంతృప్తిలోంచి ఖాళీలు ఏర్పడినాయంటారు. ఈ ఖాళీని పెళ్ళితో పూరించే ప్రయత్నం చేసాననుకొని అతను పెట్టిన హింసకు మోయలేని స్థితిలో విడిపోయాను. తర్వాత్తర్వాత ప్రేమలు చాలా పలకరించాయి. దానితో సహజీవనంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తే విడిపోవడంలో సులువు గురించి అతను మురిసిపోయాడు. అందుకే కుటుంబం స్నేహితులు, భర్త, ప్రేమికులు, సహచరుడు నా హృదయాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోయారు. ఇప్పుడు యవ్వనం ఖాళీ చేస్తానని బెదిరిస్తుంది. నా యవ్వనం చుట్టూ నేను బలంగా నిర్మించుకున్న హర్మ్యం కూలిపోతే నేనేం కావాలి? చిన్న మానసిక రుగ్మత. అందుకే ఈ ప్రేమ, సహజీవనం మధ్య ఏర్పడిన ఖాళీని పూరించడానికి స్త్రీవాద జీవితాలనుంచి రూపొందిన కథ.

దగ్గుపాటి పద్మాకర్ **'ఈస్తటిక్ స్పేస్'** సమాజంలో జరుగుతున్న స్త్రీ అత్యాచారాలు, స్త్రీ పురుష సంబంధాల విలువలను అభ్యుదయ దృక్పథంలో చిత్రించిన కథ. ఆరి సీతారామయ్య రచన **'పరివర్తన'** విదేశీ న్యాయవ్యవస్థను, అక్కడి చట్టాలను, అవినీతి రాజకీయాలను ప్రశ్నిస్తూ దీపికారావు అనే స్త్రీకి లైంగికహింసకు గురిచేస్తున్న భర్త హత్య చేసిన నేపథ్యంలో వచ్చిన కథ. భాగ్యరేఖ రచన **'ఇగురం'** కథ స్త్రీలు కూడా చదువుకోవాలని అప్పుడే వాళ్ళు ఆర్థికంగా తమ కాళ్ళమీద తాము నిలబడగల్గుతారని చెబుతుంది. కథలో సుజాత అత్త పెట్టే బాధలను దిగమింగుకుంటూ జీవనం గడుపుతుంటుంది. మహిళా స్వావలంబన అనేది లేకుండా స్వతంత్ర్య, స్వేచ్ఛా జీవితాన్ని గడపకుండా తన సంసార జీవితాన్ని బాధలతో అనుభవిస్తున్న స్త్రీమూర్తుల జీవితాలను వివరించారు. అలానే సుభద్ర రాసిన **'బాత్ రూం బీభత్సం'** కథ ఆడపిల్లలుండే సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో ఆడపిల్లలకు నెలసరి ఋతుక్రమం / అబార్షన్ జరుగుతున్నాయి అనే అనుమానాలతో ఆడపిల్లలను అవమానించడానికి సిద్ధంగా వున్న సమాజాన్ని చిత్రీకరించారు. బలభద్రపాత్రుని రమణి రచన **'విశ్వద'**లో స్త్రీలు ఎదుర్కొనే మరో సమస్య చిత్రించబడింది. ఈమె మరో కథ **'పెంపుడు చిలుక'** స్త్రీవాద దృక్పథంలో ఓ మూగ స్త్రీ వేదనను, ఆమెకు మాటలు వచ్చిన తరువాత భర్త నుంచి ఎదురయ్యే పురుష అహంకారం ఆమెకు విడాకులు ఇప్పిస్తుంది. కె. భాగ్యశ్రీ **'నిన్ను నువ్వు తెలుసుకో'** కథలో ధరణి తన కుటుంబ సభ్యులందర్నీ పోషించే బాధ్యతను తన నెత్తిమీద వేసుకొని, వాళ్ళకోసం తన జీవితాన్నంతా త్యాగం చేశానని, మోదుగా మార్చుకున్నానను కుంటుంది. దాని తరువాత పరిణామంలో తన కోసమే బతకాలని,



ఎవరి బాధ్యతల్ని వాళ్ళు తెలుసుకునేలా చెయ్యడంలో తాను విఫలమయ్యానని తెలుసుకుంటుంది.

కుటుంబ సంబంధాలన్నింటి లోను అత్యంత ప్రధానమైనది వైవాహిక వ్యవస్థ. ఈ భారతీయ వైవాహిక వ్యవస్థను ప్రశ్నిస్తూ చాలా కథలే వెలువడినాయి. ఆధునిక వ్యవస్థ ఆరంభమైన కాలంనుండి వ్యవస్థలో మార్పులు సహజ సిద్ధంగా ఏర్పడినాయి. ఈ ఆధునిక వ్యవస్థ నుంచి వ్యాపార సామ్రాజ్యం మొదలవ్వడంతో ప్రతి అంశం ఆర్థిక విషయంతో ముడిపడడంతో సమాజంలో సంస్కృతి, సంప్రదాయ సంబంధ బాంధవ్యాలు పెను మార్పులకు లోనవ్వడం ఒక ఎత్తు అయితే ఈ రెండు దశాబ్దాల క్రితం మొదలైన ప్రపంచీకరణ సంస్కృతి వలసవాదాన్ని ప్రేరేపించి మనుష్యుల్లో ఉన్న విలువలను ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలోనే సాహితి **'లివింగ్ టుగెదర్'** స్త్రీలకు పెళ్ళి అవసరమా? పెళ్ళి చేసుకోకుండా స్త్రీ బతకలేదా? అన్న ఒక మౌలిక సమస్యను చర్చించింది. పిల్లలు కలిగాక కూడా ఒకప్పటి ప్రేయసిని మర్చిపోలేని ఒక భర్త కథ ఇది. మారుతున్న మానవ సంబంధాల నేపథ్యంలో వివాహ వ్యవస్థ తీరుతెన్నులను నిర్వచించిన కథ. అక్కిరాజు భట్టిప్రోలు **'నందిని'** వివాహ వ్యవస్థపై అసహనం, విదేశీ జీవననేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు కలిసి ఉండటానికి మనసు, వారి మధ్య ఆప్యాయత అవసరం కాని, వివాహ వ్యవస్థ కాదు అనే నేపథ్యంలో భారతీయ వైవాహిక వ్యవస్థను ప్రశ్నించిన కథ. సాయిబ్రహ్మానంద గొర్తి రచన **'అతను'** స్త్రీ పై ఉన్న అహంభావం మనిషి నుంచి తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి తన అనుబంధాన్ని (వివాహ వ్యవస్థలో ఉన్న తాళి బంధం) వదిలేసి బయటకు వచ్చేసిన స్థితిని వివరించారు. దేవేంద్రచారి రచన **'వాయిదా'** కన్న కూతుర్ని ఓ కసాయి వాడికిచ్చి విడాకుల కోసం కోర్టు చుట్టూ తిరిగే ఒక అభాగ్యుడి కథ. ఈ సమాజంలో వివాహ వ్యవస్థలో వస్తున్న మార్పులు, రోజురోజుకు పెరుగుతున్న సమస్యలు, భారతీయ న్యాయవ్యవస్థపై అసహనం వ్యక్త పరిచిన ఉదంతాలు – ఇలా వివాహ వ్యవస్థకు సంబంధించిన సనాతన ఆచారాలు భారతీయ గ్రామీణ సమాజంలో ప్రముఖ పాత్రను వహిస్తున్నాయి.

ఈరంకి ప్రమీలాదేవి రచన **'సంగమం'** భార్యను నిర్లక్ష్యం చేస్తూ స్నేహితుల్ని సర్వస్వంగా బతికే మగవాడిని ఓ స్త్రీ తన అనుభవాన్ని చెప్పి మారుస్తుంది. వేదుల శకుంతల **'ఆదర్శానికి అడుగుదూరం'** కథలో కట్నం అడక్కుండానే తనను పెళ్ళి చేసుకుంటానని వచ్చిన యువకున్ని అతడెంతో ఆదర్శవంతుడనుకొంటుంది. కాని తన శీలాన్ని గురించి వాకబు చేశాడని తెలుసుకున్న వసంత షాకై పోతుంది. వాడ్రేవు వరలక్ష్మిదేవి **'ఇలావున్నాం'** కథలో ధనవంతుల ఇళ్ళలో పనిచేసే ఆడపిల్ల సమస్యలను, ప్రభుత్వ పాఠశాలల్లో లేడి టీచర్స్, వ్యవసాయ కుటుంబాల్లో ఉత్పన్న మయ్యే స్త్రీల సమస్యలను చర్చించారు. స్త్రీవాదులు ఇవాళ రాజకీయ రాజ్యవ్యవస్థల గురించి మాట్లాడుతున్నారు. **రాచపుండు, గంగజాతర (ప్రతిమ), ముందడుగు (కొండవీటి సత్యవతి)** లాంటి కథలు రాజకీయరంగంలో స్త్రీల వైనాన్ని ప్రశ్నిస్తున్నారు. అలానే స్త్రీలు మతపరమైన అణచివేతల్లో కూరకుపోతున్న విధానాన్ని షాజాహానా, గీతాంజలి కథలు ఆగ్రహంతో ప్రశ్నిస్తుండగా, కరువు, ఫ్యాక్షనిజం భూతాల నోట్లో చిక్కుకున్న స్త్రీల బతుకుల్లోని వేదనను చిత్రిస్తాయి. నిర్మలారాణి, రంగనాయకుల కథలు ప్రవాస జీవితంలో స్త్రీలు పడే సంఘర్షణను చిత్రించే కథల్ని స్త్రీవాద కథల్లో ఓ భాగంగా చూడవచ్చు. **'నిడదవోలు మాలతీ (చివురుకొమ్మ, చేవ, నిజానికి ఫెమినిజానికి మధ్య, డాలర్కో గుప్పెడు రూకలు), శేషశర్మ (అన్వేషణ, అగాధం) చినుటాకనుల(అమెరికా ఇల్లాలు)** 21వ శతాబ్దంలో స్త్రీల జీవన విధానాన్ని చిత్రిస్తున్న కథలు.

ఆ దశాబ్దంలో చిత్రించిన స్త్రీవాద నేపథ్యంతో వచ్చిన కథలన్నీ మంచి వస్తు వైవిధ్యంతో, శిల్ప నైపుణ్యంతో వచ్చిన కథలే. ఈ కథలు ఈనాటి వ్యవస్థలో దాగివున్న కనబడని కుల అస్తిత్వ సంస్కృతి, సంప్రదాయంలోని (దళిత, మైనారిటి, గిరిజన వర్గాల) మూలాలను ఈనాటి స్త్రీవాద అస్తిత్వం భావజాలలను, స్త్రీ సమస్యలను, స్త్రీ పై జరుగుతున్న అసాంఘిక దాడులను స్త్రీ అస్తిత్వంతో కూడిన విశ్లేషణాత్మక కథలను ఈ దశాబ్దపు కథా సాహిత్యం వివరించింది. ఈ కథలన్ని ప్రాపంచిక దృక్పథంతో ముడిపడి మంచి రచనలుగా రూపుదిద్దుకున్నాయని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. దశాబ్ది కథా సాహిత్యం – సమగ్ర పరిశీలన – డా.వి.అరుణ్ కుమార్

2. స్త్రీవాద కవిత్వం – భాష, వస్తు, రూప నవనీత – డా. ఎమ్. ఎమ్. వినోదిని

3. కుప్పిలి పద్మ. 'ఇన్స్టంట్ లైఫ్' వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం, 15 అక్టోబర్, 2000.


4. వాణీరంగారావు (వ్యాసం) ఆంధ్రప్రభ దినపత్రిక, తేది: 08.02.1992

5. నూటపదేళ్ళ తెలుగు కథ – విభిన్న ధోరణులు – డా. కాలువ మల్లయ్య.

6. స్త్రీవాద కవిత్వం – ఒక పరిశీలన – అద్దేపల్లి రామ్మోహనరావు.

7. ముద్దెర, (తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద, సాహిత్య విమర్శ వ్యాసాలు), 2005, రోహిణి పబ్లికేషన్, హైదరాబాద్.

8. నల్లపొద్దు– దళిత స్త్రీల సాహిత్యం – గోగు శ్యామల.



# తెలుగు మౌఖిక వ్యవహార భాష : పరిశోధనావశ్యకత

**ఆచార్య పమ్మి పవన్ కుమార్**, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, ఫోన్ : 98664 86934

**సంక్షిప్తి:**

భాష ప్రధానంగా రెండు రూపాలలో ప్రవర్తిల్లుతుంటుంది. మొదటిది మౌఖికవ్యవహారం. రెండవది లిఖిత వ్యవహారం. లిపి లేని భాషలను మాట్లాడే సమాజాలలో భాష మౌఖిక వ్యవహారంలోనూ, లిపి ఉన్న సమాజాలలో మౌఖిక, లిఖిత వ్యవహారాలలో ప్రవర్తిల్లుతుంది.

ఏదైనా భాష యొక్క పరిణామాన్ని నిర్దిష్టంగా వివరించాలంటే లిఖిత భాషపై జరిపే పరిశోధనలు ఎంత ఉపయోగకరమో మౌఖిక భాష మీద జరిపే అధ్యయనాలు కూడా అంతే ఉపయోగకరం. ప్రతి భాషా వ్యవస్థకు మౌఖిక, లిఖిత భాషలకు సంబంధించిన సమగ్ర వ్యాకరణాలు ఉండాలి. అప్పుడే ఆ భాష అభివృద్ధి చెందినట్లు. ప్రతి భాషా వ్యవహార సమాజంలోనూ ప్రాంతీయమైన, సాంఘికమైన భేదాలు ఉంటాయి. వీటిని సేకరించటం, అధ్యయనం చేయటం, అనువర్తిత రంగాలకు విస్తరించటం అనేవి సమాంతరంగా జరగవలసిన కార్యకలాపాలు. ఈ కార్యకలాపం కదులుతూ పోతున్న చిత్రాన్ని వ్యాఖ్యానించడం వంటిది. మౌఖిక, లిఖిత వ్యవహారాల్లో భాష పొందే క్రమ వికాసాన్ని నిరూపించడం అనేది ఒక బృంద కార్యక్రమం. దీనిలో చాలామంది పరిశోధకులు చాలాకాలంపాటు చేయడానికి కావాల్సినంత పని ఉంటుంది. ఇటువంటి కార్యక్రమాలకు ఆరంభాన్ని, కొనసాగింపుని ఊహించగలంగానీ ముగింపుకు కొన్ని దశాబ్దులు పట్టవచ్చు. ఈ లోపు బహు విధాలుగా అందుబాటులోకి వచ్చే ఫలితాంశాలను అనువర్తించుకోవడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఇది భాషా పరిశోధనలో లభించే గొప్ప సౌకర్యం. మేథానందాన్ని కలిగించే విషయం.

**1. కీలక పదాలు :** మౌఖికవ్యవహారం, లిఖిత వ్యవహారం, కావ్యభాష, శాస్త్రభాష, సామాజిక భాషాశాస్త్రం, మాండలిక భేదం, భాషాభివృద్ధి. భాషా విస్తృతి, వర్ణనాత్మక పద్ధతి.

**2. పరిచయం :** మౌఖిక భాషకు, లిఖిత భాషకు గుర్తించదగిన భేద-సదృశాలుంటాయి. మౌఖిక వ్యవహారంలో భాషలో వైవిధ్యం ఎక్కువగా ఉంటుంది. భిన్నమైన ఉచ్చారణ, ఊనిక, స్వరాలలో తేడాలు, మాండలిక భేదాలు మొదలైనవన్నీ మౌఖిక వ్యవహారంలోనే గుర్తించగలం. భాషా వ్యవహార రంగాలు లిఖితభాషకు సంబంధించి కొన్ని వ్యవహార పద్ధతులను ఏర్పరుస్తాయి. ఇందువల్ల ఏ వ్యవహర్త రాసిన రచనలోనైనా అంతర్లీనంగా ఏకసూత్రత కనిపిస్తుంది-రాతలో వైవిధ్యం కోసం ప్రత్యేకించి ప్రయత్నిస్తే తప్ప. సాధారణ రచనల్లో కనిపించని పూర్వ రూపాలు మౌఖిక వ్యవహారంలో వినిపిస్తుంటాయి. ఆధునిక వ్యవహారంలో వాడే అనేకమైన అన్య భాషాపదాలకు, దేశీయమైన సమానార్థ పదాలు, కాస్త ప్రయత్నిస్తే మౌఖిక వ్యవహారంలో దొరుకుతాయి. అందువల్ల కావ్య, శాస్త్ర భాషలను అనుశీలించినట్టే మౌఖిక భాషను కూడా అధ్యయనం చేయవలసి ఉంటుంది. ఈ అధ్యయనాన్ని ఒక్క వ్యక్తి మౌఖిక వ్యవహారానికి పరిమితం చేయవచ్చు లేదా నిర్ణీతమైన భూభాగంలో నివసించే వ్యవహర్తలకు విస్తరింపచేయవచ్చు. భాషాశాస్త్రంలో ఇందుకు తగిన పరిశోధన పద్ధతులు ఉన్నాయి. ఏ పద్ధతిని అనుసరించి పరిశోధన చేయాలన్నది మనం ఉద్దేశించిన ప్రయోజనమూ, లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది.

భాష ఏ యే రంగాలలో వాడుకలో ఉంది, ఆయా రంగాలకు సంబంధించిన వ్యవహర్తల రోజువారి అవసరాలను అది తీర్చగలుగు తోందా, తగినంతగా ఎలా అభివృద్ధి చేసుకోవాలి, ప్రస్తుత స్థితిని అంచనావేసుకోడం ఎలా, తగిన కార్యాచరణ ప్రారంభించడం ఎలా, లక్ష్యాలను ఎలా నిర్దేశించుకోవాలి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ఎలా తయారుచేసుకోవాలి?... మొదలైన విషయాలపై అవగాహన పెరగాలంటే భాషాశాస్త్ర పరిజ్ఞానాన్ని ఇతోధికంగా చేసుకోవలసి ఉంటుంది.

**3. పూర్వపరిశోధనలు :** సామాజిక భాషాపరిశీలనలో భాగంగా జరిపే ఇటువంటి అధ్యయనాలను తొలిసారిగా తెలుగు అకాడమి 1970లలో ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతిజిల్లా లోనూ తిరిగి మౌఖిక వ్యవహార సమాచారాన్ని సేకరించడం, ఆ సమాచారంలోని భాషావిశేషాలను బులెటిన్ల రూపంలో ప్రచురించడం, దీనినుంచి ప్రాంతీయ మాండలిక వ్యాకరణాన్ని రచించడం, ఆపై మౌఖిక వ్యవహార భాషకు సమగ్రమైన వర్ణనాత్మక వ్యాకరణాన్ని రచించడం ఈ కార్యక్రమం ప్రారంభించడంలోని ప్రధానమైన అంశాలు. క్షేత్ర పర్యటన జరిపి సేకరించిన మౌఖిక వ్యవహార సమాచారం ఆధారంగా వృత్తిపదకోశాలు వెలువరించారు. ఏదో ఒక సందర్భంలో ఒక విషయంపై వ్యవహర్తలు మాట్లాడిన సమాచారాన్ని సేకరించి (వ్యవహార ఖండికలు) ఆయా జిల్లాలలో తెలుగు భాషా వ్యవహార భేదాన్ని/మాండలికాలను ప్రకటించారు. ఈ పనులు శిక్షణ పొందిన పండితులు తెలుగు అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించినవి. క్షేత్ర పర్యటనల ఆధారంగా వెలువరించిన ఇటువంటి బృహత్, దీర్ఘకాల ప్రయోజనకరమైన గ్రంథాలు ఇతర భారతీయ భాషలలో వెలువడిన దాఖలాలు అరుదు. A Dictionary of Tamil Agricultural Vocabulary (N.

Rajasekharan Nair and others, eds.) అన్న నిఘంటువు రెండు దశాబ్దుల క్రితం ప్రారంభమై 2022వ సంవత్సరంలో 4,133 ఆరోపాలతో వెలుగుచూసింది. ఇతర భాషలలో ఇటువంటి గ్రంథాలు వెలువడ్డాయా అన్నది పరిశీలించాలి.

**విశ్వవిద్యాలయాలలో జరిగిన తెలుగు పరిశోధనలలో సాహిత్యాధ్యయనాలు ఎక్కువ. భాషపై జరిపిన పరిశోధనలు తక్కువ. ఈ ఎక్కువ-తక్కువలకు సహేతుకమైన కారణాలు కనబడవు, రాగ-విరాగాలు తప్ప. భాష, వ్యాకరణం, భాషాశాస్త్రం... మొదలైన అంశాలు ఉన్నత తరగతులలో 'పరిచయం చేయడం' మన విద్యా వ్యవస్థలో ఉన్న ప్రధానమైన లోపం. ఈ లోప పూరణ ప్రయత్నం ఉన్నత తరగతులలో చేసినా, నిలుపుకోగలిగే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం ఎక్కువ ఆశ్చర్యానికి లోనుచేసే అంశం!** అలవాటు పడిన అధ్యయనాన్ని, అధ్యాపనాన్ని అటు విద్యార్థులు, ఇటు బోధకులు సౌకర్యంగా భావిస్తుండడం దీనికి కారణం కావచ్చు. ఇటువంటి పరిశోధనలు జరపడంవల్ల కలిగే ప్రధానమైన ప్రయోజనాలు కొన్నిటిని ఈ పత్రంలో వివరించే ప్రయత్నం జరిగింది. మరికొన్ని ప్రధానమైన అంశాలు సారాంశంగా కూర్చబడ్డాయి.

మౌఖిక భాష, మాండలికాలపై విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనల సంఖ్య చాలాతక్కువ. మహబూబ్ నగర్ జిల్లా తెలుగు వ్యవహారంపై డాక్టర్ అప్పం పాండయ్యగారి పరిశోధన 1989లో వెలువడింది. తరువాత డాక్టర్ ఎస్. ఎస్. చంద్రయ్య (2017) తిమ్మాజిపేట మండల మౌఖిక భాషకు వర్ణనాత్మక వ్యాకరణం రచించారు. ఇది హైదరాబాదు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖకు సమర్పించిన పిహెచ్.డి. పరిశోధన గ్రంథం, డాక్టర్ మంత్రి మల్లేశ్ (2019) తెలంగాణ మాండలిక నవలలను భాషాశాస్త్ర దృష్టితో అనుశీలించి ఇదే శాఖకు పిహెచ్.డి. పరిశోధన గ్రంథం సమర్పించారు. ఈ రంగంలో జరిగిన కృషిలో ఈ సిద్ధాంత గ్రంథాలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. ఈ రెండు పరిశోధన గ్రంథాలు డా. పమ్మి పవన్ కుమార్ పర్యవేక్షణలో రాసి సమర్పించినవి.

డాక్టర్ ఎస్. ఎస్. చంద్రయ్య పరిశోధన గ్రంథంలో తిమ్మాజిపేట మండల (ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనిది) మౌఖిక వ్యవహారంలో వినిపించే అనేకమైన భాషావిశేషాలు వివరించబడ్డాయి. 'బిడ్డ' అనేమాట (కొన్ని సందర్భాలలో సంబోధన) మహన్మహతీ వాచకాలకు వాడడం ఈ మండలంలో ఉంది.

తెలంగాణ ప్రజల సాధారణ వ్యవహారంలో 'బిడ్డ' అన్నమాటను ఆడపిల్లను సూచించడానికి వాడతారు. బహువచనార్థంలో కొంత ప్రాచీనతను నిలుపుకొన్న కోడండ్లు (కోడళ్ళు), తమ్ముండ్లు (తమ్ముళ్ళు), గొంగండ్లు (గొంగళ్ళు)... వంటి రూపాలు ఈ మండలంలో నేటికీ వినిపిస్తున్నాయి. చేతులు అనే బహువచన రూపానికి, ఏకవచనంలో 'చేతు'/'షేతు' (చేయి) రూపాలు ఈ మండలంలోని ప్రజల వ్యవహారంలో ఉన్నాయి. మాన్యతా వాచకాలలో '-అమ్మ', '-గారు', '-వారు' రూపాలను ఈ మండలంలోని వ్యవహర్తలు వాడుతున్నారు. కాని, '-వారు' ని, ఈ వ్యవహర్తలు బహువచనార్థంలో మాత్రమే వాడుతున్నారు తప్ప మాన్యతా వాచకంగా వ్యవహరించడంలేదు.

రెండు వందలును సూచించే 'ఇన్నూరు', మూడు వందలను సూచించే 'మున్నూరు' వంటి ప్రాచీన రూపాలు ఇప్పటికీ ఈ మండలంలో వ్యవహారంలో నిలిచిఉన్నాయి. అలాగే, సంఖ్యావాచకంగా 'ఒకటి'ని సూచించడంలో మహద్వాచకంలో-వొకడు, వొగడ్, వొగడు, వొక్కడు, వొక్కాయన, వొగాయన... వంటి రూపాలు వినిపిస్తుంటాయి. మహన్మహతీ వాచకంలో- ఒకరు, ఒగరు వంటి రూపాలూ, మహతీ వాచకంలో-వొక్కతె, వొగామె రూపాలూ వినిపిస్తున్నాయి. మహతీతర అమహద్వాచకంగా- వొ, వో, వొక, వొగ, వొకటి, వొక్కటి, వొగటి, వొంటి, వోటి... వంటి రూపాల వాడకం ఈ మండలంలో ఉంది. ఇంతటి ఉచ్చారణ వైవిధ్యం, రూపాంతర ప్రయోగాలు... మొదలైన విశేషాలను గుర్తించడం సుశిక్షితులైన పరిశోధకులకు మాత్రమే సాధ్యపడుతుంది.

డాక్టర్ మంత్రి మల్లేశ్ (2019) తెలంగాణ మాండలిక నవలలపై చేసిన అనుశీలనలో కూడా తెలంగాణ ప్రాంత వ్యవహారంలోని వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. హల్లుల వర్ణాంతరతలో (variation of consonants) 'చాలా' అనే అర్థంలో 'శాన, సాన' అనే రూపాలు, 'మిరప(కాయ)' అనే అర్థంలో 'మిర్ప, నిర్ప' అనే రూపాలు, 'దప్పు' అనే అర్థంలో 'డప్పు, దప్పు' అనే రూపాలు, ముందర-ముందల, ముంగల-ముందల, ఇటువంటి-ఇసొంటి, మీద-మీన... వంటి వర్ణాంతరత పొందిన రూపాల వాడకం కనిపిస్తుంది.

తెలంగాణ ప్రాంత వ్యవహారంలోని హల్సంధిరూపాలలో వైవిధ్యం ఎక్కువ. అజంత లేదా నాద హలంత పూర్వపదాలకు, శ్వాసహల్లు ఆదిగాఉన్న పరపదం చేరినపుడు ఆ పర పదంలోని శ్వాస హల్లు నాదంగా మారినరూపాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఉదా. జూత్తున్నం+కద = జూత్తున్నంగద, మోట+కొడ్తడు=మోటగొడ్తడు, సల్ల+పడ్తున్న = సల్లబడ్తున్న. అలాగే, వర్ణ సమీకరణం పొందిన రూపాలుకూడా ఈ ప్రాంత వ్యవహారంలో ఎక్కువే. ఉదా. అడుగు+కుంట=అడుక్కుంట, పెరుగు+కుంట=పెరుక్కుంట, నాకు+గింత=నాగ్గింత, మీది+ది=మీద్ది మొదలైనవి. తెలంగాణ వ్యవహారంలోనూ, రచనలలోనూ ఉర్దూ, పర్షో-అరబిక్ పదాలు విరివిగా వినిపిస్తాయి, కనిపిస్తాయి. అసలు, ఇనాం, కతం, కానూన్, కిరాయి, కుషి, ఖబర్, గరమ్, గలీజ్, జాగ, తమాషా, తారీకు, దుకానం, పరేశాన్...మొదలైనవి నిత్య వ్యవహారంలో వినిపించే మాటలు. ఇటువంటి అధ్యయనాలు జరపడంవల్ల భాషాగతితార్కికత బాగా అవగాహనలోకి వస్తుంది. భాషాభివృద్ధి-భాషా విస్తృతి రెండు పాయలుగా సాగి, అన్ని వ్యవహార రంగాల భాషావసరాలను తీర్చగలిగేదిగా తెలుగుభాష వృద్ధి చెందుతుంది.

**4. భాషాభివృద్ధి – భాషా విస్తృతి :** భాషాభివృద్ధి వేరు – భాషావిస్తృతి వేరు. ఈ రెండూ ఒకటని సాధారణంగా భ్రమపడుతుంటారు. పరస్పర సంబంధాన్ని కలిగిఉండే ఈ రెండు విషయాలు భాషాభివృద్ధి, విస్తృతిలో ద్విపుటిగా సాగుతూ కీలకమైన పాత్రను పోషిస్తాయి. శాస్త్ర జ్ఞానాన్ని ఆవిష్కరించగలిగేదిగా భాష ఎదగటం భాషాభివృద్ధిలో భాగం. వ్యవహారంలో భాష వాడకం పెరగడం భాషావిస్తృతి. ఉదాహరణకు, తెలుగుభాషా వ్యవహర్తలు ఇంటా–బయటా (ప్రపంచవ్యాప్తంగా) 80 మిలియన్లకు పైగా ఉన్నారు. వీరిలో ఎందరు తమ శాస్త్ర జ్ఞానాన్ని పంచుకోడానికి తెలుగు భాషను వాడుతున్నారన్నది ప్రధానం. ఇది భాషాభివృద్ధిని అంచనాకట్టడానికి ఉపకరించే అంశం. ఎక్కువమందికి సంబంధించిన వ్యవహార రంగాలలోని శాస్త్ర జ్ఞానాన్ని పంచుకోడానికి తెలుగు భాషను వాడుతుంటే అప్పుడు భాషాభివృద్ధి జరిగినట్టు.

వ్యవహారంలో భాష వాడకం పెరగడాన్ని భాషాభివృద్ధిగా చూపడం సౌకర్యవంతమైన ప్లుతి. భాషాభివృద్ధి వ్యూహరచన అన్నది ఒక బృహత్ కార్యక్రమం. ఈ బాటలో సాగడానికి నిరంతర అధ్యయనం, భాషాశాస్త్ర (వ్యాకరణ) జ్ఞానం, పరిశోధనలు... గణనీయంగా సహకరిస్తాయి. రోజువారి కార్యకలాపాలలో తమ భాషను వాడడం, సాంస్కృతిక ఆత్మాభిమానాన్ని కలిగిఉండడం అన్నవి భాషా విస్తృతికి కొంత సహకరిస్తాయి కాని, అభివృద్ధిచెందిన భాషలుగా మన భాషలను నిలబెట్టగలిగేవి కావు. భాషాభివృద్ధి–భాషా విస్తృతులకు సంబంధించిన కార్యకలాపాలు నిరంతరం సమతూకంగా జరిగినపుడు, ఆ భాష అభివృద్ధి చెందిన భాషగా నిలవగలుగుతుంది, మనగలుగుతుంది.

**5. భౌగోళిక హద్దులగుర్తింపు – జాగ్రత్తలు :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ప్రధానంగా తెలుగు వ్యవహార ప్రాంతాలు. ఇతర రాష్ట్రాలలోకూడా తెలుగు భాషావ్యవహర్తలు ఉన్నా, ఆయా రాష్ట్రాలలోని ప్రధాన వ్యవహారభాష మాట్లాడేవారికన్నా తెలుగు భాషావ్యవహర్తల సంఖ్య తక్కువ. మన దేశంలోనే కాక, ప్రపంచవ్యాప్తంగా గణనీయమైన సంఖ్యలో తెలుగువారున్నారు. వీరందరి భాషాభివృద్ధి – భాషావిస్తృతి సూచులు తయారు చేయవచ్చు. కాని, ఇవి వ్యక్తిగతంగా చేయదగిన పరిశోధనలు కావు. వ్యవస్థలు నిరంతరాయంగా, సుదీర్ఘకాలంపాటు నిర్వహించవలసిన బాధ్యతలు. పరిశోధకుడు ఒక వ్యక్తి కేంద్రంగా (వ్యక్తిగత మాండలికం) పరిశోధన చేయదలచుకొన్నా, ఒక సమూహానికి సంబంధించిన భాషాధ్యయనం చేయాలన్నా ముందుగా వీరికి సంబంధించిన భౌగోళిక హద్దులను జాగ్రత్తగా గుర్తించవలసి ఉంటుంది. తెలుగు భాషకు ప్రధాన వ్యవహార ప్రాంతాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు భౌగోళికంగా కొన్ని ప్రత్యేకతలున్నాయి. నదులు, సముద్రం (సముద్రాలు), పర్వతాలు, కొండలు, అటవీప్రాంతాలు, బహుభాషావ్యవహార ప్రాంతాలు, కొత్తగా ఏర్ప(డిన)డే భౌగోళికహద్దులు, అతిగా విస్తరించిన పారిశ్రామిక వాడలు... మొదలైనవన్నీ ఆయా ప్రాంతాలలో నివసించే ప్రజల భాషావ్యవహారాన్ని నియత్రిస్తుంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విడివడిన తరువాత ఏర్పడిన కొత్త జిల్లాలు, మండలాలు... వీటి భౌగోళిక హద్దులలో వస్తున్న మార్పులు, కూర్పులు మొదలైనవన్నీ, పరిశోధన ప్రాంతాల ఎంపికలో కీలకమైన పాత్రను పోషిస్తాయి.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం – ఉత్తరాన, వాయువ్య దిక్కులలో మహారాష్ట్ర తోనూ (మరాఠీ<ఇండో–ఆర్యన్), దక్షిణ దిక్కున తమిళనాడు (తమిళం< ద్రావిడ) రాష్ట్రంతోనూ సరిహద్దులను కలిగి ఉంది. తూర్పున బంగాళాఖాతం ఉంది. పశ్చిమాన కర్ణాటక (కన్నడ<ద్రావిడ) రాష్ట్రంతోనూ, ఈశాన్యంలో మధ్యప్రదేశ్ (హిందీ, బఘేలి,<అవధి ఇండో–ఆర్యన్), ఒడిషా (ఒడియ<ఇండో–ఆర్యన్) రాష్ట్రాలతోనూ భౌగోళిక సరిహద్దులను కలిగి ఉంది.

ఇక, తెలంగాణ రాష్ట్రం – ఉత్తరాన మహారాష్ట్ర (మరాఠి< ఇండో–ఆర్యన్) రాష్ట్రాలతో సరిహద్దులను కలిగి ఉంది. పశ్చిమాన కర్ణాటక (కన్నడ <ద్రావిడ) రాష్ట్రంతోనూ, దక్షిణ, తూర్పు దిక్కులలో ఆంధ్రప్రదేశ్ (తెలుగు<ద్రావిడ) రాష్ట్రంతో సరిహద్దులను కలిగి ఉంది.

తూర్పున సుదీర్ఘమైన సముద్రతీర ప్రాంతంఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తక్కిన భూభాగానికి ఐదు రాష్ట్రాలతో సరిహద్దులు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం మొత్తం నాలుగు రాష్ట్రాలతో పరివేష్టితమై ఉంది. ఇటువంటి భౌగోళికమైన హద్దుల గుర్తింపుతో ఒక చిక్కు ఉంది. ఈ విధమైన విభజన రాజకీయ, ఆర్థిక, (పాక్షికంగా) సాంఘిక కార్యకలాపాలకు ఉపకరించినట్టుగా భాషాధ్యయనానికి ఉపకరించవు. వ్యవహర్తల భాషావ్యవహార గమనం, ఇటువంటి భౌగోళికమైన హద్దులకు భిన్నమైన దారులలో, పద్ధతులలో సాగుతుంది. కాబట్టి, భాషాధ్యయనానికి ఈ విధమైన హద్దులను గుర్తించడంకన్నా, మాండలిక వ్యవహార ప్రాంతాలనే విభాగాన్ని పరిచయం చేసిన పూర్వ పరిశోధకులు అవలంబించిన పద్ధతిని పాటించడంవల్ల కలిగే ప్రయోజనం ఎక్కువ. మాండలిక వ్యవహార ప్రాంతాలలోని ఉపప్రాంత విభజనకు భౌతికమైన హద్దులను గుర్తించే పై పద్ధతిని అనుసరించవచ్చు.

**6. తెలుగు మాండలిక వ్యవహార ప్రాంతాలు :** పై విభాగంలో చర్చించిన భౌగోళికమైన హద్దులను గుర్తించే పద్ధతికి ఇది భిన్నం. తెలుగు వ్యవహార ప్రాంతాన్ని ప్రధానంగా తెలంగాణ, రాయలసీమ, కోస్తా, కళింగాంధ్ర అనే మాండలిక వ్యవహార ప్రాంతాలుగా పూర్వ భాషాశాస్త్రవేత్తలు నిరూపించారు. ఈ విభజనలోని అంతర్విభాగా లను (భాష వాడుక/ వైవిధ్యం ఆధారంగా) వివరించడానికి విస్తృతంగా సామాజిక భాషా పరిశీలన చేయవలసి ఉంటుంది. ఉదాహరణకు కళింగాంధ్ర ప్రాంతంలోని విజయనగరం ప్రాంతంలో 'చీమ' అన్న

పదాన్ని ఇదే ప్రాంతానికి దగ్గరగా ఉన్న నర్సీపట్నం, ఎలమంచిలి ప్రాంతాలలో 'చీవఁ' గాను, చోడవరం ప్రాంతంలో 'ఛీమ' గాను వ్యవహరిస్తారు. అలాగే 'కన్ను' బహువచన రూపంగా 'కల్లు' అనే వ్యవహారం విజయనగరం ప్రాంతంలో వినిపిస్తుంది. ఇదే అర్థంలో 'కండ్లు' అనే వ్యవహారం భీమునిపట్నం ప్రాంతంలో వినిపిస్తుంది. విశాఖపట్నంలోని తక్కిన ప్రాంతంలో 'కళ్ళు' అనే రూపం వినిపిస్తుంది.

ఇదే వ్యవహార ప్రాంతంలో బంధువాచక పదమైన 'వియ్యంకుడు' అనే మాటకు మాడుగుల, చోడవరం, ఎలమంచిలి ప్రాంతాలలో 'ఈరకాడు' అనే మాట వ్యవహారంలో ఉంది. 'వియ్యపురాలు'ను 'యీరకత్తె' అని ఈ ప్రాంతంలో పిలుస్తారు. ఒకే మాండలిక వ్యవహార ప్రాంతంలో కనిపిస్తున్న ఈ రూప వైవిధ్యం క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరిస్తున్నపుడు తీసుకోవలసిన జాగ్రత్తలను భాషాపరిశోధకులకు గుర్తుచేస్తుంది. ఇటువంటి పరిశీలన తెలుగు రాష్ట్రాలలోని ఇతర మాండలిక వ్యవహార ప్రాంతాలలోకూడా చేయడంవల్ల మరిన్ని విశేషాలు తెలుస్తాయి. సామాజిక భాషాశాస్త్ర పద్ధతి ఇటువంటి అధ్యయనాలకు మిక్కిలిగా తోడ్పడుతుంది.

**7. వ్యవహర్తలఎంపిక – సమాచార సేకరణ :** సాంఘిక భాష లేదా సామాజిక భాషా శాస్త్ర పద్ధతిలో జరిపే పరిశీలనలో వ్యవహర్తల ఎంపిక జాగ్రత్తగా చేయవలసి ఉంటుంది. వ్యవహర్తల విద్యా స్థాయి, కులం, వృత్తి లేదా ఉద్యోగం, వయసు, స్త్రీ–పురుష భేదాలు సాంఘిక స్థితి గతులు మొదలైన అంశాలకు ఈ అధ్యయనంలో ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. వీటిలోని ప్రతి అంశంలోనూ మరెన్నో ఉప విభాగాలను సాధించే అవకాశం ఉంది. ఉదాహరణకు వ్యవహర్తల విద్యాస్థాయి అన్న విభాగాన్ని ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, సాంకేతిక, కళా సాహిత్య సంబంధ, సామాజిక శాస్త్ర సంబంధ, వృత్తి విద్యా సంబంధ, వృత్తి ఆధార సంబంధ... మొదలయిన అంతర్విభాగాలను చేసి అనుశీలించే అవకాశం ఉంది. ఇలాగే తక్కిన అంశాలలోనూ ఉప అంశాల విశ్లేషణకు విస్తృతమైన అవకాశం ఉంటుంది.

వ్యవహర్తల నుంచి సమాచారం సేకరించే సందర్భాల్లో ఒక నిర్దిష్టమైన అంశాన్ని సూచించి సమాచారాన్ని సేకరించవలసిన అవసరం లేదు, నిర్దిష్టమైన ప్రయోజనంకోసం సేకరిస్తున్న సమాచారం అయితే తప్ప. వ్యవహర్తకు తోచిన అంశంపై మాట్లాడిన అంశాలను పరిశోధకులు సేకరించి దానిని వివిధ రంగాలకు సంబంధించిన వ్యవహార ఖండికలుగా గ్రహించి అధ్యయనం చేయవచ్చు.

మౌఖిక భాష సేకరించే సందర్భంలో ప్రాంతాలకు సంబంధించిన నైసర్గిక స్వరూపాన్ని, లక్షణాలను విధిగా పేర్కొనాలి (పై ఉప విభాగాలలో పేర్కొన్నట్టుగా). వ్యవహర్తల నుంచి సమాచారాన్ని సేకరించడానికి ప్రశ్నావళిని రూపొందించుకోవడం మంచి పద్ధతి. ఇటువంటి ప్రశ్నావళులు రూపొందించుకోవడంలో పరిశోధకులకు ఒక సౌలభ్యం ఉంది. ఇప్పటికే పరిశోధకులు సిద్ధం చేసి ఉంచిన ప్రశ్నావళిని తమ పరిశోధనల కోసం వినియోగించుకోవచ్చు లేదా వాటిని ప్రాంతీయమైన అవసరాలకు అనుగుణంగా మార్చుకొని వినియోగించుకోవచ్చు. ప్రశ్నావళి అతి సంక్షిప్తమూ, అతి దీర్ఘమూ కాకుండా చూసుకోవాలి. కేవలం ప్రశ్నావళికి మాత్రమే పరిమితమై సమాచారాన్ని సేకరిస్తే సమాచారంలో వైవిధ్యం కుంటుపడుతుంది.

ప్రశ్నావళిలోని ప్రశ్నలు–వ్యవహర్తల మనోభీష్టం మధ్య పరిశోధకులు క్షేత్రస్థాయిలో సమతూకాన్ని సాధించవలసి ఉంటుంది. ప్రశ్నలలో ఉద్దేశించిన విషయానికి వ్యవహర్తలు దూరంగా జరుగుతున్నప్పుడు పరిశోధకులు వారిని నియంత్రించకూడదు. వైవిధ్యభరితమైన అంశాలను, స్థానిక విశేషాలను, దైనందిన జీవిత సంబంధ అంశాలను, వృత్తి వ్యాపకాలను, ఉద్యోగ సంబంధ విషయాలను ముచ్చటించేందుకు వ్యవహర్తలు మక్కువ చూపుతారు. విషయ వైవిధ్యం పెరిగే కొద్దీ సమాచారంలో వైవిధ్యం పెరుగుతుంది. ఇటువంటి సమాచారాన్ని విశ్లేషించేటప్పుడు విశేషాంశాలను గుర్తించడంలో, వాటిని వివరించడంలో పరిశోధకులకు సౌలభ్యం పెరుగుతుంది.

సమాచారం సేకరిస్తున్న భౌగోళిక ప్రాంతం, బహుభాషా వ్యవహార ప్రాంతంతో సంబంధాన్ని కలిగి ఉన్నదైతే అక్కడి భాషలో వైవిధ్యం ఎక్కువగా ఉంటుంది. రెండు మూడు భాషల మేళనం ఇక్కడి వ్యవహారంలో సాధారణ లక్షణం అవుతున్నపుడు ఏది మాతృ భాషా పదం, ఏది అన్యదేశ్యం, ఏది మాండలికం? అనేవి గుర్తించడానికి అవకాశం చిక్కుతుంది. అలాగే విద్యావంతుల, అవిద్యావంతుల భాషా వ్యవహారంలో వినిపించే మార్పులను జాగ్రత్తగా గమనించవలసి ఉంటుంది. తెలుగు వ్యవహార ప్రాంతాలన్నిటా ఇటువంటి అధ్యయనాలు జరిపి వాటి విశేషాలను వర్ణనాత్మక పద్ధతిలో అధ్యయనం చేస్తే తప్ప ఈ విశేషాలు వెలుగులోకి రావు. సమగ్ర నిఘంటువు, సమగ్ర వ్యాకరణం వంటివి... ఎప్పటికీ పూర్తిచేయవలసిన పనులుగానే మిగిలిపోతాయి. ఇటువంటి అధ్యయనాంశాలను గ్రహించి పరిశోధనలు జరపడానికి యువతరానికి పుష్కలమైన వనరులున్నాయి, అవకాశాలున్నాయి, భవిష్యత్తు ఉంది.

క్షేత్ర పర్యటనలు జరిపి, వ్యవహర్తలనుంచి సేకరించే మౌఖిక సమాచారానికి పూర్వ లిఖిత ఆధారాలుండవు. సేకరించిన సమాచారమే పరిశోధనకు ప్రధాన ఆకరం; కాబట్టి, ఇది పరిశోధన గ్రంథంలో తప్పనిసరిగా భాగం చేయవలసి ఉంటుంది. పరిశోధకులు వివరించిన విశేషాంశాలను, సూత్రాలను, సిద్ధాంతాలను పూర్తిగా అవగాహన చేసుకోడానికి, పునస్సమీక్షించడానికీ వ్యవహర్తలనుంచి సేకరించిన సమాచారమే (సమకాలీన) తరువాతి పరిశోధకులకు ప్రధాన ఆకరంగా ఉపయోగపడుతుంది. జానపద,

గిరిజన సాహిత్యాధ్యయనాలలోనూ, సామాజిక భాషాశాస్త్ర, సామాజిక శాస్త్రాల అధ్యయనంలోనూ ఈ పద్ధతి ఆచరణలో ఉన్నదే అయినా, మరోసారి ప్రస్తావించడం- కొత్తతరం పరిశోధకులు తప్పనిసరిగా గుర్తుంచుకోడం కోసం మాత్రమే.

**8. ఇటువంటి పరిశోధనలవల్ల కలిగే ప్రయోజనాలు:**

1. తెలుగు(మౌఖిక)భాషకు వర్ణనాత్మక వ్యాకరణాలను రచించవచ్చు. సమకాలీనులకు, తరువాతి తరాలవారికి ఉపయోగపడే అనేకమైన అనువర్తనలను వీటినుండి సాధించవచ్చు.
2. సేకరించిన సమాచారం ఆధారంగా వివిధ అవసరాలకు తగిన పదపట్టికలను తయారుచేయవచ్చు.
3. తెలుగు భాషకు బృహన్నిఘంటువును కూర్చడంలో సహకరించే నైఘంటిక వనరులను సాధించవచ్చు.
4. తెలుగు మాండలికాలలోని వైవిధ్యాన్ని, ఏకత్వాన్ని నిరూపించవచ్చు.
5. ప్రజల రోజువారి అవసరాలను తీర్చగలిగే సమాచారాన్ని వారి (స్థానిక) భాషలోనే అందించి సమాజాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచవచ్చు.
6. వివిధ స్థాయిల అవసరాలకు తగినవిధంగా విద్యాబోధన సామగ్రిని (వాచకాలు తదితరాలు...) తయారు చేయవచ్చు.
7. వివిధ స్థాయిలకు- (ముఖ్యంగా; ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలకు) తగిన నైఘంటిక వనరులను కూర్చవచ్చు.
8. మాధ్యమరంగాలలో ప్రాంతీయభాష వాడుకను పెంచవచ్చు.
9. ప్రాంతీయభాషలలో సరళమైన అనువాదాలను అందించవచ్చు.
10. అక్షరాస్యత శాతాన్ని పెంచవచ్చు.
11. ప్రపంచవ్యాప్తంగాఉన్న ఒకే భాషా వ్యవహర్తల సమూహా లను గుర్తించి, వీరందరి ఉమ్మడి వృద్ధి సాధనంగా భాషను వినియోగించవచ్చు.
12. భాష వాడుక, వాడుక విధానాల మదింపు, వృద్ధి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.
13. వ్యాకరణం, భాషాశాస్త్రం, సామాజిక భాషాశాస్త్రం... మొదలైన శాస్త్రాల అభివృద్ధికి కావలసిన మౌలికమైన వనరులను పొందవచ్చు.
14. మానవాభివృద్ధి, వికాసంలో భాషవాడుక, దానిపాత్రను నిరూపించవచ్చు.
15. భాష-సంస్కృతుల సంబంధ సమాచారాన్ని అధ్యయనంచేసి విలువైన విషయాలను ప్రకటించవచ్చు. సాంస్కృతిక ప్రసరణ సాధనంగా భాష పొందుతున్న క్రమ వికాసాన్ని అధ్యయనం చేయవచ్చు.
16. వివిధ కళలు-భాషల సహచర సంబంధాన్ని నిరూపించవచ్చు.
17. వివిధ సైగలు, సంజ్ఞలు, బొమ్మలు, గుర్తులు... మొదలైనవాటిని అధ్యయనంచేసి వాటి విశేషాలను ప్రకటించవచ్చు.
18. భాషాసంకేతజ్ఞ ఉపకరణాలను (language technology tools) వాడుతూ, భాష వినియోగానికి సంబంధించిన ఉ పకరణాలను తయారు చేయవచ్చు.

**9. ఉపయుక్త గ్రంథ/ఆకర గ్రంథ సూచి:**

9.1. తెలుగు:

1. ఉషాపన్నాల. 1998. తెలుగు మాండలికాలు-రంగారెడ్డి జిల్లా. హైదరాబాదు : తెలుగు అకాడమి.
2. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2010. తెలుగు భాషాచరిత్ర. హైదరాబాదు : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
3. రాధాకృష్ణ, బూదరాజు. (సంపాదకులు). 2004(reprint) తెలుగు మాండలికాలు - విశాఖపట్టణం జిల్లా. హైదరాబాదు : తెలుగు అకాడమి.
4. రామారావు, చేకూరి. 2003. భాషాపరివేషం. ఖమ్మం: సాహితీస్రవంతి.
5. శ్రీవిద్య, చిరువోలు. 2003. తెలుగు మాండలికాలు- తూర్పుగోదావరి జిల్లా. హైదరాబాదు : తెలుగు అకాడమి.
6. సుబ్రహ్మణ్యం, పి.యస్. 1997. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

**9.2 పరిశోధన గ్రంథాలు :**

7. చంద్రయ్య, ఎస్. 2017. తిమ్మాజిపేట మండల మౌఖిక భాష: వర్ణనాత్మక వ్యాకరణం. పిహెచ్.డి. పట్టం కోసం తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం. పర్యవేక్షకులు డా. పమ్మి పవన్ కుమార్.
8. మల్లేశ్, మంత్రి. 2019. తెలంగాణ మాండలిక నవలలు: భాషాపరిశీలన. పిహెచ్.డి. పట్టం కోసం తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం. పర్యవేక్షకులు డా. పమ్మి పవన్ కుమార్.

**9.3. English :**

9. Crystal, David. 2000. Language Death. Cambridge: Cambridge University Press.
10. Suzanne Romaine. 2000. Language in Society-An Introduction to Sociolinguistics. Oxford: Oxford University Press.

❖ ❖ ❖ ❖ ❖

# పద్యమనోహరం - 50


## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448



**"దాన కళాకలాప సముదంచిత సార వివేక సంపదన్**
**మానిత యాచమానజన మానస వృత్త్యభిపూర్తి బుద్ధి యె**
**వ్వానికి లేదొకింతయును వాడొకరుండు భరంబు ధాత్రికిన్**
**కానలు గావు, శైలములు గావు, పయోధులు గావు భారముల్"**

తెలుగువారి అక్షర సంపదకు మహోన్నత వైభవాన్ని తెచ్చి పెట్టిన కవి సార్వభౌముడు శ్రీనాథ మహాకవి. "చిన్నారి పొన్నారి చిఱుత కూకటి...." నాడే కలంపట్టి అనేక రచనలతో మన సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ఈ మహాకవి కలంనుంచి వెలువడ్డ "శృంగార నైషధము" అపురూపమైన గ్రంథం. "శ్రీహర్షో నిపుణ: కవి:" అని కీర్తి గన్న సంస్కృత మహాకవి శ్రీహర్షుడు సంస్కృత భాషలో రచించిన "నైషధీయ చరితమ్"ను నల దమయంతుల వివాహం వరకు మాత్రమే అనువదించి దానికి తెలుగు మహాకవియైన శ్రీనాథుడు "శృంగార నైషధమ్"గా నామకరణం చేశాడు. అందులోని మూడవ ఆశ్వాసంలోని ఈ పద్యం దానగుణము యొక్క, దాత యొక్క గొప్పదనాన్ని ఘనంగా చాటిన పద్యంగా భావించవచ్చు.

సాధారణంగా అడవులు, పర్వతాలు, సముద్రాలు భూమికి భారాలుగా భావిస్తారు కాని అసలైన భారాలు అవి కావు. ఎవరైతే కొంచెమైనా దాతృత్వ గుణం లేనివారుగా ఉంటారో అటువంటి వారే ఈ భూమికి భారం తప్ప ఇవేవి భారాలు కావని ఈ పద్యం ద్వారా మనకు శ్రీనాథ మహాకవి తెలుపుతున్నాడు.


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**


శ్రీనాథ మహాకవి అసాధారణ శాస్త్ర పాండిత్య శోభితుడు. పలు శాస్త్రాధ్యయనాలు చేసిన మహాకవి. కాబట్టే ఏ కవీ అనువదించడానికి సాహసించని శ్రీహర్షుని నైషధీయ చరితాన్ని తెలుగువారికి అందించే ప్రయత్నం చేసి మనకు ఈ మహాకావ్యామృతాన్ని ప్రసాదించాడు. శ్రీహర్షుడు సామాన్యమైన కవి గాదు. సకల శాస్త్రాలను, వాటిలోని లోతులను కవిత్వంలో చూపించిన మహాకవి. ఆయన "చింతామణీ మంత్ర చింతనాశీలి". శ్రీహర్షుని నైషధాన్ని గురించే "నైషధమ్ విద్వదౌషధమ్" అన్న కీర్తి వచ్చింది. పండితుల పాలిటి మహౌషధంగా పేరెన్నికగన్న ఈ సంస్కృత కృతిని అనువదించగలగాలంటే ఆ అనువాద కవి కూడా అంతటి ప్రతిభాశాలి అయి ఉండాలి. ఆ శక్తి కలిగిన కవి శ్రీనాథమహాకవి.

"ఖండన ఖాద్యము" వంటి శ్రీహర్షుని శాస్త్రగ్రంథాల లోతులన్నీ పరిపూర్ణంగా తెలుసుకున్న కవి గనుకనే హర్షుని నైషధీయ చరితమందలి గ్రంథ గ్రంథులెన్నింటినో తెలుగు కావ్యంలో కూడా ప్రతిభావంతంగా చూపగలిగాడు.

కావ్య ప్రారంభంలో నల చక్రవర్తి గుణగణాలను వర్ణిస్తూ నలునిలోని దాన గుణాన్ని గొప్పగా వర్ణించిన కావ్యం నైషధకావ్యం. అయితే దానగుణమనేది వ్యక్తిలోని ఉన్నత హృదయ వైశాల్యాన్ని బహిర్గతం చేసేది మాత్రమే గాక, లోకోపకారానికి అది మొదటి మెట్టు. హృదయ వైశాల్యాన్ని తెలిపే గొప్ప గుణం. కాళిదాస మహాకవి తమ రఘువంశ మహాకావ్యంలో రఘువంశరాజుల జీవన విధానాన్ని తెలుపుతూ "త్యాగాయ సంభృతార్థానామ్" అన్నారు. రాజులు సంపాదించేది త్యాగం కొరకే. పాలకుల్లో ప్రధానంగా ఉండవలసిన గుణం "త్యాగం". అది దానగుణం ఉంటేనే అలవడే లక్షణం. అందుకే నలమహారాజులోని దాతృత్వ గుణాన్ని కావ్యప్రారంభంలోనే కవి ఘనంగా వర్ణించాడు. అయితే అక్కడి వరకే గాక ఈ మహాగుణాన్ని మూడో ఆశ్వాసంలో మరో సందర్భంలో కూడా కవి ఈవిధంగా వర్ణించాడంటే దీని ప్రాధాన్యం మానవ సమాజానికి ఎంత అవసరమో అర్థమౌతుంది.

దమయంతిని వివాహమాడాలన్న కోరికతో ఆమె స్వయంవరానికి సిద్ధమైపోతున్న నలుడిని ఇంద్రాగ్ని యమ వరుణులు ఒక కోరిక కోరారు. తమ పక్షాన ఆమె తమలో ఎవరినైనా ఒకరిని పరిణయం చేసుకునేవిధంగా రాయబారం చెయ్యాలని కోరడానికి వచ్చినప్పుడు తాము నలుణ్ణి యాచించడానికి వచ్చామన్న మాట వినిన నలుని అంతరంగంలో యాచకుడనగానే స్ఫురించిన భావాన్నే ఈ పద్యంలో కృతికర్త ఆవిష్కరించి దానగుణ ప్రాధాన్యాన్ని, మానవ సమాజానికి ఒక మహత్తర సందేశంగా అందించి పాఠకులను చరితార్థులను చేశాడు. మహాకావ్యాల ప్రయోజనానికి దర్పణం పట్టాడు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 5 (17) UGC Care List Approved Journal
హైదరాబాద్ మార్చి : 2024

# చారిత్రక నేపథ్యం గల ప్రబంధం – కళ్యాణ రాజ చరిత్రము

**వడ్లమూడి యోగీశ్వర రావు,** పరిశోధక విద్యార్థి, ఫోన్ : 9000 721 241

సామాజిక స్పృహతో కూడిన స్పందనకు, నైతికవిలువల రక్షణకు సంస్కృతి యొక్క సమగ్ర చరిత్ర అవసరమని సామాజిక శాస్త్రవేత్తలందరు అంగీకరించిన విషయం. కానీ, అధ్యయనరీతుల్లో అసంపూర్ణత వల్ల ఎన్నో చారిత్రకాంశాలు అస్పష్టంగానే ఉన్నాయి. ఈనాడు లభ్యమవుతున్న ప్రాచీన గ్రంథాలన్నింటిని సమగ్రంగా, చారిత్రకంగా పరిశీలించడం చాలా అవసరం. దాని ద్వారా పురావస్తు అవశేషాలు, శాసనాలు మొదలైన ప్రత్యక్షాధారాలు లేని కాలానికి సంబంధించిన సంస్కృతి వైవిధ్యాన్ని కూడా తెలుసుకోవచ్చు.

వైదిక కాలం నుండి నేటివరకు విలసిల్లిన సాహిత్యం ఒక అనూచాన మతానికి కట్టుబడి ఉండటం విశేషం. అందువల్ల శతసహస్రాధిక గ్రంథాలు కాలగర్భంలో కలిసిపోయినా నేడు లభిస్తున్న ప్రతి పుస్తకం భారతీయ సామాజిక, చారిత్రక, సంస్కృతికి అద్దం పట్టేవే. ఉత్తమ గ్రంథాలు స్వభావ సిద్ధమైనవి. అందువల్లనే వ్యాఖ్యాన రీతులు ఏర్పడి, వ్యాఖ్యాన సాహిత్యంలో ప్రాచీనార్వాచీన గ్రంథాలను ఏకార్థ బోధకాలుగా చూడటం మన సంస్కృతిలో ఉన్న ప్రత్యేకత! వీటిని చారిత్రకంగా కూడ పరిశీలించి సంస్కృతిలో ఏర్పడిన మార్పులను, చేర్పులను నిర్ణయించవచ్చు. అందువల్ల ఇతిహాసాలుగా పేరున్న రామాయణ, మహాభారతాలు శాస్త్రం, స్మృతి, ఆగమం, దర్శనం, అలంకారం ఇలాంటివే కాక చరిత్ర కూడ అవుతాయి.

చారిత్రక కావ్యాలపై పరిశోధన చేసిన బి. అరుణకుమారి మాటలను మనం ఒకసారి గమనిస్తే **"ఆయా కాలములందలి ప్రజా జీవన విధానములను ఎత్తి చెప్పుట యందు చరిత్రకు సాహిత్యమునకు ఉమ్మడి భూమిక ఉంది. చారిత్రక కావ్యములందు గల విశేషమిదియే. తెలుగుల సంస్కృతి మిక్కిలి ఉత్తమమైనదే కాక, కడు ప్రాచీనమైనది. కాలానుసారముగ వెలువడిన సాహిత్యమున్నది గాని చరిత్రలు చెప్పుకొనదగినంతగ లేవు. అందువలన చారిత్రక కావ్యములకొక విశిష్టత అబ్బినది. చారిత్రక కావ్య రచన యొక ప్రక్రియయై భాసించింది. ఆంధ్ర వాఙ్మయమున నేటి వరకు చారిత్రక కావ్యములు లెక్కకు మిక్కిలిగనున్నవి"** అని చారిత్రక కావ్యాల ప్రాధాన్యతను తెలిపారు.

చారిత్రక కావ్యాలు అటు పౌరాణికాలూ కాదు, ఇటు పూర్తిగా కల్పితాలు కాదు, నిజస్థితికి కల్పనలు అద్ది రచింపబడినవే చారిత్రక కావ్యాలు. చరిత్ర రచనకీ, కావ్య రచనకీ తేడా ఉన్నా పరస్పర ఉపయోగాలు, పరస్పర ఆశ్రయాలు చరిత్రకి కావలసిన అత్యవసరమైన ప్రామాణికత కావ్యంలో కనిపించకపోవచ్చు. కానీ, చారిత్రక కావ్యాలకి యథార్థాలు చమత్కారంగా చెప్తాడు కవి. ఎంత కల్పన చేసినా కవి తన కాలంనాటి సంఘాన్ని పూర్తిగా విస్మరింపలేడు. కాబట్టి చరిత్రకీ, కావ్యానికీ అవినాభావ సంబంధం ఉంటుంది. చారిత్రక కావ్యాలంటే ఏమిటి? రాజులు, రాజవంశాలు, రాజులనాటి సాంఘిక రాజకీయ సంఘటనలు, సంస్థానాధీశులు, ప్రముఖ వ్యక్తులు, వారి ఇతివృత్తాలు, యుద్ధాలు మొదలైన సంఘటనలు ఆధారంగా రాయబడిన వాటిని చారిత్రక కావ్యాలు అనవచ్చు. ఇలాంటి కోవకు చెందిన ప్రబంధకావ్యమే **'కల్యాణరాజ చరిత్రము'**. ఈ ప్రబంధంలో ఉన్న చారిత్రక విషయాలను చర్చించడమే నా వ్యాసోద్దేశం.

**కల్యాణరాజ చరిత్రము**

కల్యాణరాజ చరిత్ర నామాంతరం గల దీబగుంట వీరభద్ర చరిత్రను తెలిపే ప్రబంధ కావ్యమిది. మూడాశ్వాసాల ఈ పద్య ప్రబంధాన్ని కృష్టిపాటి వేంకటసుబ్బకవి రాశాడు. ఈ ప్రౌఢ ప్రబంధానికి సంబంధించిన ఏకైక తాళపత్ర ప్రతి (స్టాక్. నెం. 343) తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాలయంలో భద్రపరచబడింది. ఈ తాళపత్రాన్ని ఆ సంస్థలోనే ఆచార్యులుగా పనిచేసిన డా॥ ముదివేడు ప్రభాకరరావు గారు స్వీకరించి, ఎంతో నిశితంగా, పరిశీలనాత్మకంగా పరిష్కరించి, విపులమైన పీఠిక రాశాడు. ఈ పరిష్కరించబడిన గ్రంథాన్ని ప్రాచ్య పరిశోధన సంస్థే 2012లో జరిగిన నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించింది.

**కవి పరిచయం :** 'కల్యాణరాజ చరిత్ర' అనే ప్రబంధకర్త కృష్టిపాటి వేంకటసుబ్బకవి. ఈ కవి కాలం గురించి వేటూరి ప్రభాకరశాస్త్రి గారు 1852 గాను, మద్దులపల్లి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి దీబగుంట వీరభద్ర చరిత్రకు తొలిపలుకు రాస్తూ 1845 ప్రాంతం వాడని చెప్పగా ప్రస్తుత గ్రంథ పరిష్కర్త ముదివేడు ప్రభాకరరావు గారు 1755 నుండి 1845 మధ్యకాలంలో అంటే 90 యేండ్లు కృష్టిపాటి వేంకటసుబ్బకవి జీవించినట్లు చెప్పవచ్చని గ్రంథ పీఠికలో తెలియజేశారు.

ఈ కవి రెండు ప్రబంధాలు, మరికొన్ని రచనలు చేసినట్లు ఈ కవి సమకాలీనుడైన నొసము సంస్థాన ఆస్థాన కవియైన ఓబళాచార్యుల వారి 'కోకోనశ్య' మనే చాటుపద్యంలో **"అనేక గ్రంథ నిబంధ నార్జిత సమున్నిద్ర ప్రతాపప్రథా!"** అనే వాక్యాన్ని బట్టి సుబ్బకవి అనేక గ్రంథాలు రచించినట్లు తెలుస్తుంది. కానీ ప్రస్తుతం మనకిప్పుడు ఐదు మాత్రమే లభ్యమవుతున్నాయి. 1.

కేదారోపాఖ్యానము (ప్రబంధము), 2. కల్యాణరాజ చరిత్రము (దీబగుంట వీరభద్ర చరిత్ర)–ప్రబంధం), 3. శ్రీదత్తప్రభు శతకము (గేయ శతకము), 4. హనుమచ్ఛతకము (సంస్కృతం), 5. నాడీ నక్షత్రమాల (జ్యోతిషగ్రంథం).

కవి ఇంటిపేరు కృష్టిపాడు. ఇది కర్నూలు జిల్లాలోని నేటి దొర్నిపాడు మండలంలో ఉంది. ఈ కవి ప్రప్రథమంగా గద్వాల సంస్థానం వెళ్ళినప్పుడు ఆ సంస్థానాధిపతి మీ స్వగ్రామమేది? అని ప్రశ్నించగా ఈ కవి ఆశువుగా చెప్పిన సీసపద్యం ఇప్పుడు ఎత్తుగీతి లేకుండా లభిస్తుంది.

**సీ॥ఉయ్యాలవాడకు నుత్తరంబున నటు**
**కీర్తింప మాయూరు క్రిష్టిపాడు**
**నంద్యాలకున్ దక్షిణమున రెండామడ**
**కీర్తింప మాయూరు క్రిష్టిపాడు**
**పడకండ్ల కామడ పరువులో బడమట**
**గీర్తింప మాయూరు క్రిష్టిపాడు**
**నౌసము విలాతిలో నుతికెక్క రేనాట**
**గీర్తింప మాయూరు క్రిష్టిపాడు**

ఈ విధంగా కవిగారి స్వగ్రామం కీర్తింపబడటం వల్ల ఈ కవి నొస్సం సంస్థానాధిపతిగా సిపాయిల తిరుగుబాటు (1857)కు పూర్వమే కుంఫిణీ ప్రభుత్వాన్ని ఎదిరించిన ధీరుడు, వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి (క్రీ.శ॥ 1845–47 విప్లవ కాలం) సమకాలికుడు. ఉయ్యాలవాడ కర్నూలు జిల్లా కోయిలకుంట్ల తాలూకాలో ఉంది. ఈ నరసింహారెడ్డి చేత నొస్సం సంస్థానంలో సన్మానం పొందినవాడే కృష్టిపాటి వేంకటసుబ్బకవి.

**కల్యాణరాజ చరిత్ర – అవతారికా విశేషాలు :** దీబగుంట కర్నూలు జిల్లా, ఆళ్లగడ్డ తాలూకా, గోస్పాడు మండలంలో ఉంది. ఇక్కడ ప్రధానంగా వెలసిన దేవుడు వీరభద్రుడైన శివుడు గుమ్మిత మల్లికార్జునుడనే పేరుతో లింగము రూపంగా ఉన్నాడు. దీబగుంట వీరభద్ర చరిత్ర (కల్యాణరాజ చరిత్ర) గుమ్మిత మల్లికార్జున స్తుతితో ప్రారంభం కావడం వల్ల ఈ గుమ్మిత మల్లికార్జునుడెవరు? ఆయన పేరు ఎలా వచ్చింది? అనే సందేహం పాఠకులకు రావడం సహజం. లింగరూపమైన శివునికి ఆపేరెలా వచ్చిందో కవియే తృతీయాశ్వాసం లో సమాధానం చెప్పాడు.

**కం॥ అందఱు నొక గుమ్మితముగ**
**బొందుగ మల్లియల తోడ బూజించిరి యా**
**నందముగ, నందువలననె**
**యందముగా గుమిత మల్లికార్జునుడయ్యెన్ (3–200)**

భక్తులైన రాజులందరు గుంపులు గుంపులుగా మల్లెపూలతో మల్లికార్జున శివలింగాన్ని పూజ చేయడం వల్ల, దీబగుంటలో వెలసిన మల్లికార్జునస్వామికి గుమ్మిత మల్లికార్జునుడనే పేరు వచ్చింది. అవతారికలో రెండవపద్యం కావ్య కథావస్తువు సంబంధి. కైలాసం నుండి భూలోకానికి స్పర్శవేది లింగరూపంగా రావడమే కాదు, మూడు రూపాలతో పొడగట్టినాడు. అది (1) వీరభద్రుడు, (2) బసవేశ్వరుడు, (3) భద్రకాళి.

వీరభద్రుడు శివుని ఆవేశావతారం. వీరభద్రుని దేవేరి భద్రకాళి. కైలాసంలోని బసవనే బసవేశ్వరుడుగా అవతరించాడు. అన్నియుతానే 'ముగురైదీపించి' అనడంలో 'సర్వము తానయైన వాడెవ్వడు?' అనే స్ఫూర్తి కల్గిస్తున్నాడు. 'బౌద్ధాది విద్యల పెల్లారిచి' అనడంచేత బిజ్జలుడు నాస్తిక, అవైదిక మతమైన బౌద్ధమతాన్ని అభిమానించడమే వాని పతనానికి, మరణానికి ప్రధాన కారణంగా ఈ కావ్య కథావస్తువు ప్రతిపాదిస్తుంది. బౌద్ధమత గురువు 'జిన్నేశు' దని చెప్పబడింది. కానీ, బసవేశ్వరుని చరిత్రలో జినేశుడు లేక జిన్నేశుడు జైనమత పరంగా గ్రహించబడటం జరిగింది. బసవేశ్వరుడు కల్యాణపట్టణాన్ని ఏలే బిజ్జలుని ప్రధానమంత్రి. బసవన స్థాపించిన వీరశైవ మతాన్ని, దాన్ని ప్రచారాన్ని బిజ్జలుడు అడ్డుకున్నాడు. పైగా బౌద్ధులతో సంబంధం పెట్టుకున్నాడు. బౌద్ధుల విద్యలు అవైదికములు, నాస్తికమత భూయిష్ఠములు కనుక ఆ మతాన్ని రూపుమాపడానికే శివాజ్ఞచే బసవన బసవేశ్వరుడుగా, తాను బాలకుడై వచ్చి నాస్తికమతమైన బౌద్ధాన్ని రూపుమాపాడు. దానినే 'బౌద్ధాదివిద్యల పెల్లారిచి' అనగా రూపుమాపి అనే అర్థంలో చెప్పడం జరిగింది.

వీరశైవమతాభిమాని, ఉజ్జయినీ పురాధ్యక్షుడే వీరశంకర ధారాధ్యక్షుడు, ఆయనను శివుడు కటాక్షించాడు. అటువంటి గుమ్మిత మల్లికార్జున శివలింగం ఎల్లవేళలా తన కృతిని రక్షించాలని ప్రార్థించాడు. దీబగుంట ప్రధానంగా వీరభద్రక్షేత్రం. ఈ దీబగుంట వీరభద్రునికే కవి తన ప్రబంధాన్ని అంకితమిచ్చాడు. ఇలా అనేక విశేషాలు అవతారికలో కవి తెలియజేశాడు.

**కల్యాణరాజ చరిత్ర – కథా సంగ్రహం :** ప్రథమాశ్వాసంలో – నందికేశ్వరుడు బసవేశ్వరుడుగా అవతరించిన విషయం చెప్పబడింది. ఉజ్జయిని పట్టణాన్ని పాలించే వీరశంకరవిభుడు ఆత్మీయులతో కలిసి బసవేశ్వరున్ని దర్శించడానికి తరలివస్తాడు. ఆ సమయంలోనే వీరశైవాచార్యులలో ప్రప్రథముడైన రేవణసిద్ధుడు స్పర్శవేధిలింగాన్ని వీరశంకర ప్రభువుకు ప్రసాదించి, ఇకమీదట వీరశైవులు ఎవరినీ యాచింపక, స్వతంత్ర జీవనులై తమ కార్యకలాపాలను సాగిస్తూ ఆత్మగౌరవంతో జీవించాలని హితబోధ చేశారు. వీరశంకరుడు బంగారుకోటలు కట్టించి స్పర్శవేదిలింగాన్ని స్థాపించాడు.

ద్వితీయాశ్వాసంలో – కల్యాణపట్టణాన్ని పాలించే బిజ్జలునితో,

ఆయన ప్రధానమంత్రి బసవేశ్వరుడు వీరశైవమతం ప్రచారం చేస్తున్నాడని బౌద్ధులు ఫిర్యాదు చేస్తారు. అంతేకాదు, వీరశైవుల వద్ద ఇనుమును బంగారం చేసే స్పర్శవేదిలింగమున్నదని చెప్పగా, బిజ్జలుడు ఆ స్పర్శవేదిని అపహరించి తెమ్మని తలవరులను పంపిస్తాడు. తలవరులు చాలా తెలివిగా స్పర్శవేదిలింగాన్ని అపహరించి బిజ్జలుని ముందు పెడతారు. కానీ, అప్పుడు రాత్రి కావడం చేత, స్పర్శవేది గల ముల్లెను రాజ మందిరంలో భద్రపరిచి, ఉదయాన్నే లేచి రాజముద్రికలను ఛేదించి రహస్యపు గంటును విప్పగా అందులో ఉన్నదని చెప్పిన స్పర్శవేదిలింగం మాయమైపోయి ఉండటం తెలిసింది.

అంతలో ఇక్కడ బసవేశ్వరుని భక్తులైన వీరశంకరాదులు స్పర్శవేధిలింగం దొంగతనంగా పోయినందుకు దు:ఖిస్తారు. బసవేశ్వరుడు వారిని ఓదార్చి జ్ఞానబోధ చేస్తాడు. స్పర్శవేదిని తిరిగి పొందడానికి కొన్ని సూచనలు చెబుతాడు. జంగములు గాజులవాండ్ర వేషంతో బయలుదేరిపోతారు. ఇంతలో బిజ్జలుని చేత స్వర్శవేదిలింగం మాయం కావడానికి కారణం బిజ్జలుడు బౌద్ధుల అధీనంలో ఉ ఒడటమే. జిన్నేశాదులను చంపడానికి శివుడు బాలుని వేషంతో వస్తాడు. ఆ బాలుని చూసిన సిరియమ్మ తన ఇంట పశువుల కాపరిగా నియమిస్తుంది. ఆ బాలుడే శివుడని తెలియని సిరియమ్మ అతడు పశువుల వెంట అడవికి పోయినప్పుడు కేదారేశ్వర వ్రతం చేస్తుంది. వ్రతావసానంలో వచ్చిన బాలుడు స్పర్శవేది లింగాకృతిని ధరించి సిరియమ్మ ఇంట ఉండిపోతాడు. ఇక అప్పటినుండి గాండ్ల సిరియమ్మ ఇనుము ఇచ్చినవారికే నూనె పోస్తానని చెప్పసాగింది. ఇనుమునంతా బంగారాన్ని చేసి దాచి పెట్టుకోవడం ప్రారంభించింది. ఈ సందర్భంలో బాధితురాలైన బ్రాహ్మణ స్త్రీ బిజ్జలునికి ఫిర్యాదు జేసింది. బిజ్జలుడు స్పర్శవేదిలింగం సిరియమ్మ ఇంటిలో ఉందని పసిగట్టి, జిన్నేశునితో సిరియమ్మ వద్ద గల స్పర్శవేదిని అధికారికంగా స్వాధీన పరచుకోవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు. జిన్నేశుని సిరియమ్మ వద్దనుండి స్పర్శవేదిని స్వాధీనపరచుకొని ఉత్సాహంతో తిరునాళ్ళు జరిపిస్తాడు. ఆ సమయంలో బసవేశ్వరుని గూఢచారులు సిద్ధవరంలోని తిరునాళ్ళ స్పర్శవేదిలింగాన్ని చూసి బసవేశ్వరునికి ఆ విషయంలో విన్నవిస్తారు. వీరశంకరాదులు తాము జిన్నేశునితో యుద్ధంచేసి దాన్ని తెస్తామంటారు. కానీ, బసవేశ్వరుడు ఒక జిన్నేశుడే కాదు, అతనికి తోడు బిజ్జలుడున్నాడు. వారిద్దరూ దుర్మార్గులు, వారితో పోరు వద్దని వారిస్తాడు. ఇంతవరకు ద్వితీయాశ్వాస కథ.

తృతీయాశ్వాసంలో - బసవేశ్వరుని ఒప్పించి, వీరశంకరాదులు జిన్నేశునిపై యుద్ధానికి పోతారు. దారిలో విరూపాక్ష క్షేత్రం, అలంపురం, సంగమేశ్వరం, శ్రీశైలం, మహానంది క్షేత్రాలను, దైవతాలను సందర్శిస్తారు. వీరశంకరాదులు స్పర్శవేదిలింగాన్ని తీసుకొనిపోవడానికి దీబగుంటకు వస్తారు. వీరి దండయాత్ర విషయంగా జిన్నేశుడు తన మంత్రి బంగాళునితో సంప్రదిస్తాడు. ఇరుపక్షాలు యుద్ధానికి సన్నద్ధులై యుద్ధం ప్రారంభిస్తారు. ఆ తరువాత వీరశంకరాదులు జిన్నేశుని వద్దకు భైరవుని దూతగా పంపుతారు. జిన్నేశుడు దూతగా తూలనాడి వానిని బంధింపమని ఆజ్ఞాపిస్తాడు. బేతాళుడు బంగాళునికి యుద్ధసహాయం చేయడానికి వస్తాడు. బంగాళుడు భైరవునితో యుద్ధం చేస్తాడు. భైరవుడు మహాకాళితో జిన్నేశడు మారణ ప్రయోగం చేస్తున్నట్లు తెలుపుతాడు. చివరికి జిన్నేశాదులు యుద్ధంలో మరణిస్తారు. వీరశంకరుడు స్పర్శవేది లింగాన్ని తీసుకొని బయలుదేరుతాడు. దారిలో సంధ్యాదికృత్యాలు నిర్వహించుటకు బావి గట్టుకిరువైపులా కాడిని పెట్టి, సంధ్యాది కృత్యాలు చేసిన తరువాత పోయి చూస్తే స్పర్శవేదిలింగం బావిలో పడిపోయినట్లు నిర్ణయించి, బావిలో దిగి ఎంత శోధించినా ఆ లింగం దొరకలేదు సరికదా, మూడు ముక్కలు లభిస్తాయి. ఆ మూడు ముక్కలను ఒక్కటిగా చేర్చి దీబగుంటలో గుమ్మిత మల్లికార్జునుడనే పేరుతో ఆ లింగప్రతిష్ఠ చేస్తారు.

ఆ తరువాత బవవేశ్వరుడు కప్పడి సంగమేశ్వరునిలో ఐక్యం చెందిన వార్త పురోహితుని ద్వారా విని, గురుని వెంబడి, శిష్యకోటి పోవుట మంచిదని తలచి, మోక్షమార్గాన్ని కోరి, సద్గురుమూర్తి బసవేశ్వరుని భజించి, పంచాక్షరీ మంత్ర స్మరణం చేస్తూ, వీరశంకరుడు ఆతని ఆత్మీయులైన 77 మంది శివభక్తులు దీబగానుబ్బిన బిలంలో ప్రవేశించి సమాధి అవుతారు.

**చారిత్రక పురుషులు :** ఈ ప్రబంధంలో కథ చారిత్రక పురుషులతో సంబంధం గలిగి ఉండడంచేత కావ్యంపేరులో 'చరిత్ర' అని చెప్పబడింది. ఈ కథావస్తువులో ముగ్గురు చారిత్రక పురుషులున్నారు. వారు (1) బసవేశ్వరుడు, (2) బిజ్జలుడు, (3) జిన్నేశుడు.

బసవేశ్వరుడు చారిత్రక పురుషుడు, వీరశైవ మతస్థాపకుడైన బసవేశ్వరుడు కర్ణాటకరాష్ట్రంలోని హింగుళేశ్వరబాగవాటిలో క్రీ.శ॥ 1140 జనవరి 21వ తేదీ జన్మించాడు. క్రీ.శ॥ 1196 జూలై 2వ తేదీ లింగైక్యం చెందాడు. ఈయన జన్మస్థలం ప్రస్తుత కర్ణాటక రాష్ట్రం, బీజాపూర్ జిల్లాలోని బాగెవాడి అనే పేరుగల ఊరుగా గుర్తించ బడింది. బసవేశ్వరుడు 56 సం॥, 5నెలల 11రోజులు జీవించాడని లెక్కగట్టి చెప్పడమే కాదు, వీరశైవ పీఠాధిపతులను సైతము ఒప్పించినవారు ఆచార్య బాదాల రామయ్యగారు (బసవేశ్వర వచనాలు - సమగ్ర సమీక్ష, సిరిగెరె, 1977, పుటలు 15-17)

బసవేశ్వరుని తండ్రి మండెగ మాదిరాజు, తల్లి మాదమాంబిక. వీరు శైవబ్రాహ్మణ దంపతులు, శివాజ్ఞచే బసవన్న బసవేశ్వరుడై జన్మించాడని వీరశైవ సంప్రదాయం.

బిజ్జలుడు బసవేశ్వరుని సమకాలికుడు. ఇతడు పశ్చిమ చాళుక్య రాజధానైన కల్యాణపట్టణ ప్రభువు. ఈ బిజ్జలుని ఆస్థానంలోనే

ప్రధానమంత్రిగా పనిచేసినవాడు బసవేశ్వరుడు. బిజ్జలునికి బసవేశ్వరుని స్వతంత్ర వ్యక్తిత్వం, వీరశైవమత స్థాపన, ప్రచారాలు గిట్టలేదు. అభిప్రాయ భేదాలు ఎక్కువయ్యాయి. బసవేశ్వరుని వీరశైవమత ప్రచారానికి రాజైన బిజ్జలుడు అడ్డుతగిలాడు, ఆంక్షలు విధించాడు. చరిత్రలో బిజ్జలున్ని బసవేశ్వరుడు హత్య చేయించినట్లు చెప్పబడింది. ప్రధాన కారణం రాజు బిజ్జలుడు జైనులతో సంబంధం పెట్టుకొని జైనమతాభిమానియై వీరశైవాన్ని తృణీకరించడం బిజ్జలుని హత్య వెనుక గల గల బలమైన కారణాన్ని ఈ కథావస్తువు ప్రతిబింబించేదిగా ఉండటం విశేషించి గమనింపదగింది. బిజ్జలుని హత్యకు దారితీసిన 'స్పర్శవేదిలింగ మహిమాది విశేషాలు' ఈ ప్రబంధంలో విస్తృతంగా వర్ణించబడి ఉంది.

జిన్నేశుడు జైనుడిగా చరిత్రలో చెప్పబడి ఉండగా, ఈ ప్రబంధంలో బౌద్ధమత పీఠాధిపతిగా చెప్పబడటం పరిశీలించదగ్గ అంశం. కర్ణాటక రాష్ట్రంలో బిజ్జలుని కాలంలో జైనమే ప్రధానంగా వ్యాపించిన మతంగా చరిత్ర చెబుతుంది. జిన శబ్దం జైనులకు, బౌద్ధులకు సమానంగా వాడబడటం ఒకప్పుడు ఉండేది. కాబట్టి, ఈ ప్రబంధకవి జిన్నేశుని బౌద్ధమత పీఠాధిపతిగా చిత్రించాడు అని సరిపెట్టుకోవాలి కానీ, చరిత్రతో పొసగదు. జైన, బౌద్ధమతాలు అవైదికాలు, నాస్తికాలుగా పిలవబడ్డాయి గనుక ఒక నాస్తిక మతంతో బిజ్జలుడు సంబంధం పెట్టుకోవడం జరిగిందని, అదే అతని హత్యకు కారణమైందని చెప్పవలసి వుంది.

కథలో తక్కినవన్నీ బసవేశ్వరుని పురోగతికి బిజ్జలుడు వేసిన అడ్డంకులు, దాని పర్యవసానంగా దీబగుంటలో వీరభద్రస్వామి వచ్చి స్థిరపడడం, గుమ్మిత మల్లికార్జున లింగప్రతిష్ఠతో కథ సమాప్తమౌతుంది. బసవేశ్వరునితో పాటు వీరశంకరాదులు లింగైక్యమవుతారు. ఈ కాలంలో వీరశైవమతాన్ని అనుసరించేవాళ్ళు అనేకమంది ఉన్నారు. బసవన మీద భక్తితో మల్లికార్జున పండితారాధ్యుడు కూడా బసవన బాటలోనే నడిచాడు. ఈ చరిత్రంతా మనకు శివతత్వసారం, పాల్కురికి సోమనాథుని బసవపురాణం, పండితారాధ్య చరిత్రలో కనపడుతుంది.

**ఉపసంహారం :** శ్రీవైష్ణవ సంప్రదాయ పీఠాధిపతులు, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకులునైన శ్రీమద్రామానుజాచార్యులవారి కాలంలో (క్రీ.శ॥ 1017-1137) చెన్నకేశవ దేవాలయాలు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలలో విశేషించి రాయలసీమలో ఎక్కువగా వెలసినట్లుగా, వీరశైవమత స్థాపకుడు సాక్షాత్ బసవన అవతారమైన బసవేశ్వరుని కాలంలో (క్రీ.శ॥ 1140-1196) వీరభద్రుని ఆలయాలు ఆంధ్రదేశంలో అనేకం వెలిశాయి. ఇది చారిత్రక సత్యం.

ప్రస్తుతం ప్రచురించబడిన కల్యాణరాజ చరిత్ర (దీబగుంట వీరభద్ర చరిత్ర) వీరశైవ చారిత్రక నేపథ్యం గల కథ. వీరభద్రస్వామికి ఆలయాలు బసవేశ్వరుని కాలంలోనే కడప, కర్నూలు జిల్లాల్లో ఏర్పడటం జరిగాయి. 'పట్టిస శ్రీ వీరభద్రేశు సేవించి' అంటాడు కవి సార్వభౌముడు శ్రీనాథుడు. కడప జిల్లాలో రాయచోటిలో వీరభద్రేశ్వర ఆలయముంది. కర్ణాటక నుండి వీరశైవులెందరో వచ్చి స్వామిని సేవించుకుంటారు. రాచవీడు అనే పేరే రాయచోటిగా మారింది. కర్నూలు జిల్లా, ఆళ్లగడ్డ తాలూకా, గోస్పాడు మండలంలో దీబగుంటలో గుమ్మిత మల్లికార్జునుడనే పేరుతో వీరభద్రుడు వెలసి ఉన్నాడు. ఆ కథనే కృష్టిపాటి కవి రాసి, ఆ స్వామికే అంకితం చేశాడు.

**దీబగుంటలో వీరభద్రునికి ఉత్సవ విశేషాలు :** దీబగుంటలో ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ విదియతో ప్రారంభించి నాలుగురోజులు గొప్ప తిరునాళ్ళు జరుగుతాయి. 1. విదియ – నంది ఉత్సవం, 2. తదియ – అశ్వవాహనం, 3. చవితి – వ్యాఘ్రవాహనం, 4. పంచమి – రథోత్సవం, ఎద్దులకు పరుగుపందాలు పెట్టబడుతాయి. ప్రతి సోమవారం ఇక్కడ విశేష పూజలుంటాయి. గండదీపాలు మోయడం, పుట్టువెంట్రుకలు తీయడం, వివాహాలు జరపటం, నందికోల ఉత్సవం ఇలా మొదలైన కార్యక్రమాలు ప్రతి సోమవారం ఉంటాయి. ఈ దేవాలయానికి భూవసతి, మణిమాన్యాలు ఉన్నాయి. తిరునాళ్ళకు సుదూర ప్రాంతాల నుండి, ఆంధ్రేతర రాష్ట్రాలనుండి భక్తులు తండోపతండాలుగా వస్తారు.

**ఆధార గ్రంథాలు :**

1. కల్యాణరాజ చరిత్రము – కృష్టిపాటి వేంకటసుబ్బకవి – శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థ (ప్రచురణ) – 2012

2. సమగ్ర ఆంధ్ర సాహిత్యం (మొదటి సంపుటం) – ఆరుద్ర

3. శైవసాహిత్యం – భక్తితత్వం – యం. రామనాథం నాయుడు

❖ ❖ ❖ ❖ ❖

**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్: 934 7971177

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 5 21 UGC Care List Approved Journal
హైదరాబాద్ మార్చి : 2024

# కళాతపస్వి కె. విశ్వనాథ్ సినిమాలలోని పాటలు – సామాజికావలోకనం

డా. తిరునగరి శరత్ చంద్ర, ఫోన్ : 6309873682

తెలుగు సినీరంగంలో అగ్రస్థాయికి చెందిన దర్శకుల్లో కె.విశ్వనాథ్ ఒకరు. సంప్రదాయకత, వినూత్నమైన ఇతివృత్తం, అద్భుతమైన సన్నివేశాల చిత్రీకరణ, మధురాతి మధురమైన సంగీత సాహిత్యాల సమ్మేళనం మొదలైనవి ఆయన సినిమాలకుండే ప్రత్యేక ఆకర్షణలు. మహాకావ్యాలకు, మహా నాటకాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో ఆయన సినిమాలు మనకు కనిపిస్తాయి. అపురూపమైన శిల్పాలుగా సినిమాలను తీర్చిదిద్దడం ఆయన ప్రత్యేకత. సామాన్యమైన కథను తీసుకుని అసామాన్యంగా రూపొందించడం ఆయనకున్న విశిష్టత.

ఇక పాటల విషయానికొస్తే ఆయన చూపించే శ్రద్ధాసక్తులు ఎంతో ప్రశంసనీయమైనవి. కథాంశానికి, సన్నివేశానికి తగినట్లుగా ప్రసిద్ధ సినీ కవులతో పాటలు రాయించుకోవడంలో దిట్ట. యువకవులను, గీతరచయితలను కూడా ప్రోత్సహించి, వారికి పాటలు రాసే అవకాశమిచ్చి, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేవారు. తనకు నచ్చేవరకు, సినిమాకు ఈ పాట బలాన్ని చేకూరుస్తుంది అని అనిపించేవరకు పాటను మళ్ళీ మళ్ళీ రాయించుకునేవారు. ఒక పట్టాన ఒప్పుకునేవారు కాదు. అందుకు కారణం ఆయన ఓ గీతరచయిత కావడమే. సాహిత్యాభినివేశం మెండుగా ఉన్న కవి కావడమే. క్రమశిక్షణ గల దర్శకునిగా కూడా ఆయన శైలి అత్యద్భుతమైంది. ఆయన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అయితే ఈ వ్యాస పరిధి దృష్ట్యా నేను ఆయన సినిమాల్లోని పాటల్లో గల సాహిత్యాన్ని గూర్చి మాత్రమే వివరిస్తాను.

ప్రముఖ సినీ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు దగ్గర సహాయ దర్శకునిగా కొంతకాలం పనిచేసిన విశ్వనాథ్ 1965లో 'ఆత్మగౌరవం' సినిమాతో దర్శకునిగా తన ప్రస్థానం ప్రారంభించాడు. ఆ సినిమా గొప్ప విజయాన్ని సాధించింది. అద్భుతమైన కథ, అక్కినేని నాగేశ్వరరావు, కాంచనల నటనతో పాటు ఆ సినిమాలోని పాటలు కూడా ఆ చిత్ర విజయానికి దోహదపడ్డాయని చెప్పవచ్చు. ఆ సినిమాలోని అన్ని పాటలు గొప్ప కవితాత్మకతను కలిగి ఉన్నవే. అందులో దాశరథి రాసిన, పి.సుశీల పాడిన ఈ పాటను చూద్దాం.

**'అందెను నేడే అందని జాబిల్లి**
**నా అందాలన్నీ ఆతని వెన్నెలలే..**
**ఇన్నేళ్ళకు విరిసే వసంతములు**
**ఇన్నాళ్ళకు నవ్వెను మల్లియలు**
**నిదురించిన ఆశలు చిగురించెలే**
**చెలికాడే నాలో తలపులు రేపెనులే'**



రష్యన్ బాణీకి దాశరథి రాసిన పాట ఇది. తనను ప్రేమగా లాలించే హృదయం, తనకు నీడగా నిలబడే ఒక తోడు దొరికిందన్న ఆనందంతో కథానాయిక మనసులో ప్రేమ చిగురించి పాడుకునే పాట ఇది. అందరాని జాబిల్లి రూపంలో తనకు దొరికిన ఆనందం ఎవరో కాదు ప్రియుడే. ఆ విషయాన్ని రెండవపంక్తిలో తెలియజేస్తుంది నాయిక. ఇక తన అందాలన్నీ ఆ జాబిల్లి చిందే వెన్నెలలుగానే భావిస్తుంది. దానితో భావకాంతి మరింత వింతగా కనిపిస్తుంది. తొలిప్రేమ చిగురించినపుడు నాయిక తనలో ఇది వరకు లేని పులకింతలు ఒక్కసారిగా ఉరకలేసిన సందర్భాన్ని వివరిస్తుంది. వసంతం ఎన్నేళ్ళకో విరిసిందని, మల్లెలు చాలా రోజులకు నవ్వాయని అంటుంది. ఆమె తన యవ్వనమనే తోటలోని వసంతాల్ని, మల్లెల్ని గూర్చి తెలియజేస్తుందని మనం ఇక్కడ గమనించాలి. తనలోని ప్రేమ ఆవిష్కృతమవ్వడం వల్ల వసంతం ఇప్పుడే చిగురించినట్లుగా, మల్లెలు కొత్తగా నవ్వుతున్నట్లుగా భావిస్తుంది. ఆమె కళ్ళముందు అంతా కొత్తగా కనబడుతుందన్నమాట. ప్రేయసి వయసులోని పారవశ్యాన్ని ఈ పాట స్పష్టంగా వివరిస్తుంది.

పిల్లల భవితకు కొత్తబాట వేసేలా ఓ సందేశాత్మక గీతాన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రి రాయగా, పి.సుశీల పాడారు. ఆ పాటను పరిశీలిద్దాం.

**'అడుగడుగున గుడి ఉంది / అందరిలో గుడి ఉంది**
**ఆ గుడిలో దీపముంది / అదియే దైవం.**
**ఇల్లూవాకిలి ఒళ్ళూమనసు / ఈశుని కొలువనిపించాలి**
**ఎల్లవేళలా మంచుకడిగిన / మల్లెపూవులా ఉంచాలి**
**తల్లీతండ్రి గురువు పెద్దలు / పిల్లలు కొలిచే దైవం**
**కల్లాకపటం తెలియని పాపలు / తల్లులు వలచే దైవం**
**ప్రతి మనిషి నడిచే దైవం / ప్రతి పులుగు ఎగిరే దైవం..'**

(ఉండమ్మా బొట్టు పెడతా– 1968)

సినిమాలో కథానాయిక పిల్లలకు ఉత్తమ గుణాలనలవరుచు కోవాలని చెప్పే సందర్భం. అందరికీ పరమాత్ముడే వెలుగునిచ్చే దీపం వంటి వాడని, తరచి చూస్తే ఈ జగమంతటా అడుగడుగున గుడి ఉందని, అందరిలో గుడి ఉందని, అంటే దైవం అందరిలో కొలువై ఉన్నాడని పిల్లల ఉజ్జ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తూ ఈ పాటను కథానాయిక వినిపిస్తుంది. నిర్మలమైన హృదయంతో మెలగాలని, అటువంటి హృదయంలోనే దైవం కొలువుంటాడని చెబుతున్నాడు కృష్ణశాస్త్రి. అంతేకాకుండా మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ అన్న వేదసూక్తిని పిల్లలకు గుర్తు చేస్తూనే...అటు పెద్దలకు కూడా పిల్లలలో ఉండే దైవత్వాన్ని గూర్చి చెప్పి హెచ్చరిస్తాడు. చివరలో.. నడిచే ప్రతి మనిషిలో, ఎగిరే ప్రతి పక్షిలో దైవత్వాన్ని చూపిస్తాడు. అలా మామూలు నేత్రం చూడగలదో, లేదో గాని కృష్ణశాస్త్రి మనోనేత్ర కలం మాత్రం చూడగలవనిపిస్తుంది. ఈ సినిమాలోని అన్ని పాటల్ని కృష్ణశాస్త్రితోనే రాయించాడు కె.విశ్వనాథ్.

మహాకావ్యాల్లో ఉండే సంస్కృత సుదీర్ఘమైన సమాసాలు కూడా ఆయన ఎంతో ఇష్టపడి సినిమాల్లో రాయించుకునేవారు. అందుకు డా.సి.నారాయణరెడ్డి తో రాయించుకున్న ఈ పాటే నిదర్శనం..

**'ఫాలనేత్ర సంప్రభవత్ జ్వాలలు ప్రసవశరుని దహియించగా**
**పతిని కోలుపడి రతీదేవి దు:ఖితమతియై రోదించగా**
**హిమగిరీంద్ర శిఖరాగ్ర తాండవత్ ప్రమథగణము కనిపించగా**
**ప్రమథనాథకర పంకజ బాంకృత ధమరుధ్వని వినిపించగా**
**ప్రళయకాల సంకలిత భయంకర జలధరార్భటుల**
**చలిత దిక్తటుల చకిత దిక్కరుల వికృత ఘీంకృతుల**
**సహస్ర ఫణసంజనిత ఫూత్కృతుల...' (చెల్లెలి కాపురం – 1971)**

కథానాయకుని కవితావేశానికి దీటుగా కథానాయిక నాట్యం చేయడం ఇందులో కనిపిస్తుంది. కవి కవితాశక్తి విజృంభించినపుడు దాని ధాటికి తట్టుకోలేరన్న విషయాన్ని కూడా ఈ పాట స్పష్టం చేస్తుంది. శివుని మూడో కంటి నుంచి పుట్టిన ఆగ్రహ జ్వాలలు మన్మథుని దహించినట్లుగా, ఆ మన్మథుని చూసి రతీదేవి దు:ఖహృదయంతో రోదిస్తున్నట్లుగా, ప్రమథులంతా హిమాలయ శిఖరమంచుల తాండవిస్తున్నట్లుగా, ప్రమథులకు అధిపతియైన శివుని చేతి నుంచి ధమరుధ్వని వినిపిస్తున్నట్లుగా, ప్రళయకాలంలో భయంకరంగా వినిపిస్తున్న మేఘాల గర్జన, దిక్కుల చలనం, దిక్కులనే ఏనుగుల భయంకర శబ్దాలు, వేయి సర్పాలనుంచి వదలబడిన విషవీచికలు....వంటి శబ్ద భావ సమ్మేళనానికి తగిన రీతిలో నటించడమనేది కత్తి మీద సామే. ఈ పాట కవికున్న అనంతమైన కవిత్వ బలాన్ని ప్రస్ఫుటంగా వివరిస్తుంది. ఇలాంటి పాటలను సినిమాల్లో పెట్టి ప్రేక్షకులను, శ్రోతలను మెప్పించడం మామూలు విషయం కాదు.

క్షణికమైన మనిషి జీవితమే ఒక నటన అంటూ వేటూరి సుందరరామ్మూర్తి రాసిన ఈ పాటను పరిశీలిద్దాం.

**'తకిట తధిమి తకిట తధిమి తందాన**
**హృదయ లయల జతుల గతుల థిల్లానా**
**తడబడు అడుగుల తప్పని తాళాన**
**తడిసిన పెదవుల రేగిన రాగాన**
**శ్రుతిని లయని ఒకటి చేసి...' (సాగరసంగమం – 1983)**

తకిట, తధిమి అనేవి సంగీతంలో జతులకి సంకేతాలు. హృదయంలోని లయ, జతులు, గతులు సంగీతంలోని శబ్దాలు. తడబడిన అడుగులతో (తాగినవాడి నడక కుదురుగా ఉండదు కదా) తడిసిన పెదవుల రేగిన రాగంతో (మందుతో తడిసిన) శృతిని, లయని ఒకటి చేసి కథానాయకుడు చెబుతున్న వేదంగా ఈ పాట కనిపిస్తుంది.

మనం చేసే ప్రతి ప్రక్రియ ఆ దేవుడి ఆలోచనలోనుంచి పుట్టుకుని వచ్చిందే. ఆ రెండు ఘుట్టాల మధ్యలో మనకి ఎందుకు ఈ తాపత్రయం? ఇక్కడ తాపత్రయం అనేది అతని మనసులో ఉన్న బాధ గురించి తెలియజేస్తుంది. అతను ప్రేమించిన ప్రియురాలు దక్కలేదు. దానికంటే ఎక్కువగా ప్రేమించిన నాట్యం కూడా అతనికి దక్కలేదు. ఇదంతా ఆ దేవుడు ఆడే ఆటనే కదా అనే చేదు నిజాన్ని ఒక్క మందు తాగేవాడు మాత్రమే ఒక పరిపూర్ణతతో చెప్పగలడు.

ఏటిలోని అలలవి అయోమయమైన కదలికతో కూడిన ప్రయాణం. కంటిలోని కలలు కూడా ఊహకి అందని సన్నివేశాలను మనకి చూపిస్తాయి. ఈ రెండూ ఒకటే కదా! వాటిని కలిపి గుండెలోని అలలను కళ్ళకు వేసుకునే అందెలుగా చేసి పాటను పాడుతున్నానంటాడు కథానాయకుడు. గొప్ప భావుకతతో, లోతైన తాత్త్వికతతో ఈ పాట మనకు కనిపిస్తుంది. సాగర సంగమం సినిమాలోని ప్రతీపాట భావుకత తారాస్థాయిలో ఉంటుంది. సంగీతం, సాహిత్యం, నాట్యం ఈ మూడింటి సమ్మేళనం 'సాగర సంగమం'. విశ్వనాథ్ సినిమాల్లోని ప్రతీ పాట ఇలాగే అద్భుతమైన మంత్రధ్వానాన్ని వినిపిస్తుంటుంది.

సరస సంగీత, సాహిత్య సమ్మేళనమై సాగే మరో పాటను చూద్దాం. సీతారామశాస్త్రి కలం నుండి జాలువారిన ఈ పాట సినిమాకే తలమానికంగా నిలిచింది. గీత రచయితగా ఆయన దశని, దిశని మార్చివేసింది. చివరికి ఆయన ఇంటిపేరును కూడా మార్చివేసింది.

**'విధాత తలపున ప్రభవించినది అనాది జీవనవేదం**
**ప్రాణనాడులకు స్పందన నొసగిన ఆది ప్రణవనాదం**
**కనుల కొలనులో ప్రతిబింబించిన విశ్వరూప విన్యాసం**
**ఎద కనుమలలో ప్రతిధ్వనించిన విరించి విపంచి గానం**

**సరసస్వర సుర ఝరీగమనమగు సామవేద సారమిది..**
**నే పాడిన జీవనగీతం..ఈ గీతం' (సిరివెన్నెల - 1986)**

అప్పటికే వేటూరిలాంటి సమున్నత శిఖరం ఒక వెలుగు వెలుగుతున్న తరుణంలో అందరి దృష్టి సీతారామశాస్త్రి వైపు మళ్ళింది. ఈ పాటతో తెలుగు సినిమాపాటకు కావ్యగౌరవాన్ని కలిగించిన కవుల జాబితాలో సీతారామశాస్త్రి కూడా చేరిపోయాడు. బ్రహ్మ తలపుల్లో పుట్టిన సనాతన జీవనవేదాన్ని, ప్రాణనాడులకు కదలికలిచ్చిన ఓంకారనాదాన్ని, సరసస్వర ప్రవాహ ప్రయాణమై సాగే సంగీతమయమైన సామవేద నాదాన్ని, జీవనగీతాన్ని ఎలుగెత్తి వినిపించాడు సీతారామశాస్త్రి. సంగీతం గొప్పదనాన్ని సాహిత్యంలో వేయిగొంతుకలతో చాటి చెప్పిన తీరు ఇందులో కనిపిస్తుంది. ఈ పాటలో వాడిన 'ప్రాగ్దిశవీణ' (తూరుపు అనే వీణ), 'దినకర మయూఖ తంత్రులు' (సూర్య కిరణాలనే తీగెలు), 'జాగృత విహంగం' (స్వేచ్ఛ అనే పక్షి) వంటి పదబంధాలను పరిశీలించినప్పుడు సీతారామశాస్త్రి కున్న సంస్కృత భాషాపటిమ ప్రస్ఫుటమవుతుంది. ఈ సిరివెన్నెల సినిమాలో మొత్తం 10 పాటలు సీతారామశాస్త్రి రాసినవే. ప్రతీపాట ఓ అద్భుతమే. కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 'జననీ జన్మభూమి' (1984) సినిమాతో పాటల ప్రస్థానం ప్రారంభించిన సీతారామశాస్త్రి సిరివెన్నెల సినిమా పాటలతో ఒక శకాన్ని సృష్టించాడు. ఆ తరువాత విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 'శృతిలయలు', 'ఆపద్బాంధవుడు', 'స్వర్ణకమలం', 'స్వయంకృషి' వంటి చాలా సినిమాలకు పాటలు రాశాడు.

'శ్రుతిలయలు' సినిమాలో 'తెలవారదేమో స్వామి' అనే పాటను అన్నమయ్య కీర్తన అని భ్రమించే రీతిలో రాశాడు. ప్రేయసీ ప్రియుల తీయని ప్రణయాన్ని, వారిద్దరి మధ్య గల అలక సన్నివేశాన్ని ఆరుద్ర అక్షరీకరించిన తీరు చాలా రమణీయంగా ఉంటుంది.

**'రానని రాలేనని ఊరకే అంటావు**
**రావాలనే ఆశ లేనిదే ఎందుకు వస్తావు**
**కొంటె చూపు చూడకు గుండెకోత కోయకు**
**కోపమందు కులుకు చూపి కోర్కె పెంచకు**
**వేషమైనా మోసమైనా అంతా నీకోసం..'(ఆత్మగౌరవం - 1965)**

అలకతో ఉన్న ప్రేయసి తన దగ్గరకు రానని చెప్పి కూడా వచ్చిన సందర్భాన్ని అక్షరీకరించిన తీరు ఇక్కడ కనబడుతుంది. అలతి అలతి పదాలతో ఎంతో అందంగా ఆరుద్ర ఈ పాటను కవిత్వీకరించాడు. కొంటె చూపుతో ప్రేయసి ప్రియుని గుండెను కోయడం, కోపంతో కులుకుచూపి కోరికను పెంచడం ఇక్కడ కనిపిస్తుంది. ప్రియుడు ఎలాంటి వేషం వేసినా, ఎంత మోసం చేసినా ప్రేయసి ప్రేమను పొందడానికేనన్నది స్పష్టంగా తెలుస్తుంది. అంటే నిండైన ప్రేమకోసం ప్రియుడు ఆరాటపడిన వైనం, ప్రేయసి ప్రేమను గెలుచుకోవడం



కోసం ప్రియుడు వేసిన వేషం ఈ పాట నిండా కనబడుతుంది. ఇలాంటి అలక గీతాలు, కులుకు గీతాలు విశ్వనాథ్ సినిమాల్లో కోకొల్లలుగా కనబడుతాయి.

ప్రేయసి నడకలో, నాట్యంలో, అందంలో అపురూప శిల్ప సంపదను, లావణ్యాన్ని దర్శిస్తూ వేటూరి సుందరరామ్మూర్తి రాసిన పాటను పరిశీలిద్దాం.

**'ఝణన ఝణన నాదంలో ఝళిపించిన పాదంలో**
**జగము జలదరిస్తుంది పెదవి పలకరిస్తుంది**
**గజ్జె ఘల్లుమంటుంటె గుండె ఝల్లుమంటుంది**
**గుండె ఝల్లుమంటుంటె కవిత వెల్లువవుతుంది**
**అమరావతి శిల్పంలో అందమైన కళలున్నాయి**
**అవి నీలో మిల మిల మెరిసే అరకన్నుల కలలైనాయి**
**నాగార్జునకొండ కోనలో నాట్యరాణి కృష్ణవేణి**
**నీ విరుపుల మెరుపులలో నీ పదాల పారాణి' (సిరిసిరి మువ్వ - 1978)**

నాట్యం చేసే ప్రేయసి పాదంలో ఈ ప్రపంచమే జలదరిస్తుందని, అది చూసి అతని పెదవి పరవశించి పాడుతుందని, కథానాయకుడు ఆనందంతో, సహృదయంతో పాడే పాట ఇది..

గజ్జె ఘల్లుమన్న శబ్దానికి ప్రతిగా గుండె ఝల్లుమనడం, దానికి ప్రతిగా కవిత వెల్లువెత్తి సాగడం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పదగ్గ విషయాలు. అమరావతి శిల్పాలలోని అందమైన కళలు ప్రేయసిలో మెరిసే మెరుపులకు సరితూగవని, నాగార్జునకొండ కోనల్లో ప్రవహించే కృష్ణానది – ఆమె విరుపుల మెరుపులలో పాదాలకు పారాణి వంటిదని చెబుతాడు. ప్రేయసి రూపసౌందర్యానికి, నాట్యచాతుర్యానికి ప్రపంచంలోని ఏ సౌందర్యం సాటిరాదని చెప్పడం ఈ పాటలో కనబడుతుంది. ఈ సినిమాలోని పాటలన్ని వేటూరి రాసినవే. 'ఝుమ్మంది నాదం సయ్యంది పాదం', 'ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక?' మొ॥న సుప్రసిద్ధమైన పాటలన్నీ ఈ సినిమాలోనివే. జానపదశైలిలో కె.విశ్వనాథ్ స్వయంగా రాసిన ఓ శృంగారగీతాన్ని ఇపుడు చూద్దాం.

**'పట్టుసీర తెస్తనని పడవేసికెళ్ళిందు మావా!**
**గట్టుసేరే దాకా అట్టగే ఉండు పట్టపగలల్లే ఓ సందమామా!**
**తాళిబొట్టు తెస్తనని తాళ్ళరేవు కెళ్ళిందు మావా!**
**ఆలినయ్యే దాకా వెళ్ళిపోమాకా వెన్నెలమ్మా తోడు ఓ సందమామా!'**
**(స్వాతిముత్యం – 1986)**


కె.విశ్వనాథ్ స్వయంగా రాసిన అద్భుతమైన గీతమిది. జానపదశైలిలో పరమ రమణీయంగా రాసిన పాట ఇది. పట్టుసీర తెస్తనని పడవ మీద వెళ్ళిన మావ కోసం మరదలు వేచి ఉన్న తీరు ఈ పాటలో కనబడుతుంది. గట్టు చేరే దాకా తన మావ పడవకి వెలుతురులా ఉండి కాపలా కాయమని చంద్రునికి చెప్పడం ఇక్కడ విశేషం. అలాగే తాళిబొట్టు కోసం తాళ్ళరేవుకి వెళ్ళిన అతనికి ఆలినయ్యేదాకా ఎక్కడికి వెళ్ళిపోమాకని వెన్నెలమ్మ సాక్షిగా ఒట్టు వేసిన సందర్భం కనబడుతుంది. పల్లెటూరిలోని భార్యాభర్తల మధ్య గల ప్రేమానుబంధం, అన్యోన్యత ఈ పాటలో తొంగి చూస్తుంది.

ఇలా చెప్పుకుంటూ పోతే కె.విశ్వనాథ్ సినిమాల్లోని ప్రతీ పాట ఓ ఆణిముత్యమే. ఓ అద్భుతమే. నిండైన సాహిత్యంతో, మధురాతి మధురమైన కవిత్వంతో ప్రతీ పాట తొణికిసలాడుతుంది. 'శృతిలయలు', 'శుభలేఖ' వంటి సినిమాల్లో 'ఇన్ని రాసుల యునికి', 'విన్నపాలు వినవలె', 'నెయ్యములల్లో నేరెళ్ళో' మొ. అన్నమాచార్య కీర్తనలు కనిపిస్తాయి. 'శంకరాభరణం', 'సప్తపది', 'సూత్రధారులు', 'శుభోదయం', 'శుభసంకల్పం', 'శుభప్రదం', 'జీవనజ్యోతి', 'నేరము–శిక్ష', 'స్వాతికిరణం', 'జననీజన్మభూమి' మొ. సినిమాల్లోని పాటలన్నీ మేలిమి రత్నాలే. ఆయన సినిమాల్లోని పాటలు వింటున్నప్పుడు అవి అద్భుతమైన సాహిత్యసంస్కారం నిండి ఉన్న పాటలుగానే కాక, శాస్త్రీయ సంగీతంతో మేళవించుకుని అవి అన్నమయ్య కీర్తనలా?, త్యాగరాజు కృతులా?, క్షేత్రయ్య పదాలా? అని భ్రమించేంత అందంగా, మధురంగా రూపుదిద్దుకోవడం విశేషం. విశ్వనాథ్ భౌతికంగా కీర్తిశేషుడయ్యాడు. అయినా తన సినిమాలతో శాశ్వతంగా కీర్తివిశేషుడయ్యాడు. మరపురాని చిత్రరాజాలను మనకందించిన దర్శక దిగ్గజం, మహామనీషి, కళాతపస్వి కె.విశ్వనాథ్.

## బుద్ధగీతం

**తగుళ్ళ గోపాల్, ఫోన్ : 9505056316**





**గౌతముడా...**
మనిషి దుఃఖానికి కారణం కోరికలే అని చెప్పేసి
ధ్యానముద్రలోకి వెళ్ళిపోయావు
అమ్మ మీద ప్రేముండడం కూడా
కోరికెలా అవుతుంది చెప్పు? 1

**సిద్ధార్థుడా....**
నీవు మహారాజువు
నీవు ఏది చేసినా నడుస్తది
నీలాగ రాత్రికి రాత్రికి ఇల్లు విడిచిపోలేము
మేము సాధారణ మనుషులం
కన్నీళ్ళు తప్ప రక్తం ఉంటదని తెలువని వాళ్ళం 2

తండ్రీ ...కళ్ళు తెరిచి చూడు
ఏడ గింజలున్నయంటే ఆడ వాలే పావురాలం మేము
వేటగాడి వలల సంగతి మాకు తెల్వదు
ఆశ కొట్లాడుతనే ఉంటది
ఎంతసేపు దమ్మపదాలలోంచే జీవితాన్ని నిర్వచిస్తావా ?
ఒకసారి కన్నీటిలోంచి బతుకును వ్యాఖ్యానించు. 3

**బుద్ధుడా...**
ఎంత సేపని కళ్ళు మూసుకుంటావు ?
ఒకసారి చేతులు చాచు...
నీ చేతుల్లో తలవెట్టుకోవాలని అనిపిస్తుంది 4

ISSN 2457-0796 | UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 5 (25) హైదరాబాద్ మార్చి : 2024

# పి.వి. సృష్టించిన 'గొల్ల రామవ్వ'

డా. కసప నరేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, నిజాం కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 94915 48748

పి.వి.నరసింహారావు సాహిత్య పిపాసకుడు, రచయిత, అంతకుమించి బహుభాషావేత్త. పదిహేడు భాషలలో అనర్గళంగా మాట్లాడట వచ్చిన వ్యక్తి. అంతేకాదు కొన్ని భాషల్లో సాహిత్యాన్ని సృష్టించాడు. మాతృ భాషలను మరిచి ఇతర భాషలను నేర్చుకుంటున్నవారికి, పి.వి. ఠీవిగా కనిపిస్తాడు. ఒక భాషను నేర్చుకోవాలంటే మన భాషను మర్చిపోవాలనుకునే వర్తమాన కాలానికి ఆయనను ఉదహరించవచ్చు. ఆసక్తి, అంకితభావం ఉన్నవారు ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు. ఇది మనకు నేర్పిన వ్యక్తి పి.వి. తన ప్రేమను తనమాతృమూర్తి ఎంతగా చూపించాడో తన ప్రేమను తన మాతృభాషపై అంతే చూపించాడు.

ఆయన ఒక నాణెం వంటివాడు. నాణెంకు ఒకవైపు బొరుసు మరోవైపు బొమ్మ ఉన్నట్టు ఆయన ఒకవైపు అపార రాజకీయ ప్రాజ్ఞుడు. మరోవైపు సాహిత్యకారుడు.

విశ్వనాథ సత్యనారాయణ రాసిన **'వేయిపడగలు'** నవలను **'సహస్రఫణ్'** పేరుతో హిందీలోకి అనువదించారు. దీనిని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది. 'పన్ లక్షత్ కోన్ ఘతో' అనే మరాఠీ రచనను **'అబల జీవితం'** గా అనువాదం చేసారు. **'ఇన్‌సైడర్'** ఆయన రచించిన ఆయన ఆత్మకథా నవల. ఇది తెలుగులో **'లోపలిమనిషి'** అనువాదం అయ్యింది. స్త్రీవాదరచయిత్రి జయప్రభకవితాన్ని ఆంగ్లంలోకి అనువాదం చేసాడు. అనేక సాహిత్య వ్యాసాలు రాసాడు.

ఆనాటి తెలంగాణ స్థితిగతులను తెలియజేసే రచన **'గొల్ల రామవ్వ'** అనేది కథ. విజయకలంపేరుతో 1949 15 ఆగస్టున కాకతీయ పత్రికలో ముద్రించబడింది. ఈ కథ 'గొల్లరామవ్వ' అనే వృద్ధురాలు ప్రదర్శించిన తీరు అసాధారణ ప్రతిభను తెలంగాణ మాండలికంలో పి.వి.నరసింహారావు రచించాడు.

తెలంగాణ కథారచయితలకు తీసిపోని విధంగా వర్ణనలతో... చక్కని సన్నివేశాలతో కథను రక్తికట్టించాడు. ఒక మనిషిలో వచ్చే వివిధ హావభావాలను Variations గాను రామవ్వలో చూపిస్తాడు. కథా రచయితగా తన కథాకథన పద్ధతిని సంపూర్ణంగా వ్యక్తీకరించాడు పి.వి. ఇక కథలోకి వెళ్తే...

గొల్ల రామవ్వకథ నైజాం కాలం నాటి స్థితి గతులను వివరిస్తుంది. ఖాసీం రజ్వీ ఆధ్వర్యంలో నడుస్తున్న 'రజాకార్లు' హైదరాబాద్ రాష్ట్రంలోని గ్రామాలలో విరుచుకుపడి వారికి ఎదురుతిరిగిన... కమ్యూనిస్టు కార్యకర్తలను, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, పౌరులను హింసించేవారు, ప్రాణాలు తీసేవారు.




తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధానమంత్రి శ్రీ పి.వి.నరసింహారావు గారికి భారత అత్యున్నత పురస్కారం 'భారత రత్న' వచ్చిన సందర్భంగా ... ఈ వ్యాసం

పటేళ్లు, పట్వారీలు, దేశముఖ్‌లు, దొరలు నిజాం ప్రభుత్వానికి విధేయులుగా ఉండి... ప్రజల జీవితాలతో చెలగాటాలు ఆడేవారు....

కులాల పరంగా, వృత్తుల ఆధారంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసేవారిని, అలాగే వారికి వ్యతిరేకంగా, లేదా వారిని ఎదురించిన వారిని ప్రభుత్వ వ్యతిరేకులుగా భావించి... ప్రభుత్వం దృష్టిలో వారిని నిషేధిత వ్యక్తులుగా ప్రకటించినంతపనిచేసేది... రజాకార్లకు అలాంటివారిని చంపండం శిక్షించడం సులువయ్యేది...

పౌరులు ఒకవైపు రజాకార్లను, మరోవైపు పోలీసులను ఎదుర్కోవాల్సి వచ్చేది...ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ మతాహంకారాన్ని, అతని మతపక్షపాతాన్ని ఎదుర్కొని హైదరాబాద్ రాష్ట్రంలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాన్ని నిర్మించడానికి అన్ని రకాల వర్గాలవారు పోరాటం చేస్తున్నారు.

ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజారాజ్యాన్ని నిర్మించాలన్న కార్యకర్తల సంకల్పం ఎంత బలంగా ఉందో.. వారిని అనడానికి రజాకార్లు, పోలీసులు అంతే స్థాయిలో పనిచేస్తున్నారు.

గ్రామ గ్రామాన్ని జల్లెడపడుతూ కార్యకర్తలను తుపాకీ గుళ్లకు బలిచేస్తున్నారు. కార్యకర్తలు వారిని ఎదుర్కొంటూ వీరమరణం చెందుతున్నారు.

మాతృభూమి స్వేచ్ఛకోసం పోరాటం చేస్తున్న ఒక కార్యకర్తకు ఆశ్రయం ఇచ్చి పోలీసులనుంచి అతన్ని రక్షించిన ఒక వృద్ధురాలి వీరోచిత ప్రదర్శననే 'గొల్ల రామవ్వకథ'.

రామవ్వ గొల్లకులస్తురాలు. అందుకే 'గొల్ల రామవ్వ' అన్నారు రచయిత. ఆమెకు ఒక పూరి గుడిసె అది కొంచెం ఇల్లులా ఉంటుంది. దానికి ఒక కిటికీలా ఉండే చిన్న తలుపుల ద్వారం ఉంటుంది. అలాగే రెండు తలుపుల ద్వారం ఉంటుంది.

ఇంతకుముందు చెప్పినట్టు రజాకార్లు, పోలీసులు ఒకవైపు. కార్యకర్తలు ఒకవైపు మొత్తం యుద్ధవాతావరణంలో తెలంగాణా పల్లెలు మునిగి ఉన్నాయి. అలాంటి ఒక గ్రామంలో గొల్ల రామవ్వ తన మనుమరాలు మల్లవ్వతో కలిసి ఉంటుంది.

మనుమరాలు పదిహేను సంవత్సరాల యువతి రామవ్వకు భయం. ఏ రజాకారో, పోలీసో వచ్చి మల్లవ్వను చూస్తే పాడు చేస్తాడేమో ననీ ప్రాణం తీస్తారేమోనని కూడా ఉంటుంది... భయం గుప్పెట్లో రామవ్వ... మనుమరాలు మల్లవ్వను తలదాచుకుని నిద్రిస్తుంటుంది... బయట తుపాకుల శబ్దం...కాంగ్రెస్ కార్యకర్తలకోసం, పౌరుల కోసం గాలింపు జరుగుతుంది... ప్రతి ఇంటిని కూడా గాలిస్తుంటారు పోలీసులు... సరిగ్గా దాదాపు మధ్యరాత్రి రామవ్వగుడిసె కిటికీలోంచి అతికష్టంగా ఒక మనిషి గుడిసెలోకి వచ్చి కూర్చుంటాడు.

రామవ్వకు అర్థం అయ్యింది ఎవరో గుడిసెలోకి వచ్చారని.... అప్పుడు ఆమె చీకటిలోనే లోపలి తలుపు గొళ్లెం తీస్తూ ఎవర్రా అంటుంది.

ఆమెకు భయం ప్రారంభమైంది. ఇంకేముంది తనకు చావు తప్పదు – తానల్లారుముద్దుగా పెంచి పెండ్లి చేసిన తన మనుమరాలికి మానభంగం తప్పదు... అనుకుంటుంది. వచ్చినవాళ్లు... ఇంట్లో మాత్రం పడుచు పిల్లలు లేరా? అంత పెద్ద కరణం కూతురిని బలత్కారం చేసి ఎత్తుకుపోయినపుడు ఎవరు ఏం చేయగలిగారు? ఎవరడ్డం వచ్చారు? ఇప్పుడు తనకుమాత్రం ఎవరు దిక్కవుతారు? ...అనుకుంటూ బలహీనురాలవుతుంది రామవ్వ.

కిటికీలోపటినుంచి వచ్చినతడు ఇంట్లోకి అడుగులేస్తాడు. రామవ్వకు ఏదో జరగబోతుందన్న వ్యాకులత కలిగింది. ఆ నిశ్శబ్దం నుంచి చప్పుడు చేయకు నేను దొంగను కాను, రజాకారున్ని కాను, పోలీసును కాను. మిమ్మల్నేమీ అనను. లొల్లి మాత్రం చేయకండి.... అనే మాటలు వినబడతాయి. కానీ ఆ మాటలు రామవ్వకు నమ్మకాన్ని కలిగించవు. పైగా ఆమె ఇలా అనుకుంటుంది. **"అబ్బా! ఏమిటి టక్కరీ నమ్మించి గొంతుకోయడానికి చూస్తున్నట్టున్నాడు తీయని మాటలతోనే సంతోష పెట్టి పాపం మల్లిని"** అనుకుంటుంది.

ఇద్దరు ఆడవాళ్లే ఇంట్లో ఉండటం వల్లే– ఆమెలో మరింత బలహీనమైన ఆలోచనలు కలుగుతాయి. ఆమెలో ఆలోచనలు రావడానికి తనకళ్ళముందు ఎంతమంది ఆడపిల్లల మానప్రాణాలు ఆ రజాకార్ల, పోలీసుల చేతిలో పోయాయి. వాటి స్ఫురణలు...తన మనమరాలు మల్లవ్వకు జరిగేలా ఉన్నాయన్నది ఆమె మస్తిష్కంలో వెలుగడానికి కారణం...అంటే గతం వర్తమాన ప్రమాదానికి సంకేతంగా ఆమె భావిస్తుంది.

కాలప్రవాహంలో జరిగిన ఆ దమనకాండలు ఆమెను భయం వైపు నెట్టుతున్నాయి. అంతేకాదు, ఆమె ఆ సమయంలో ఎవరినీ నమ్మేలా కూడా ఉండదు. చీకటిలోనే ఆ వ్యక్తి రెండు కాళ్ళు దొరికించుకొని **"నీ బాంచెన్! చెప్పులు యెత్తి నా తలకాయైనా తీసుకో, పోరిని మాత్రం ముట్టకు. అది నీ చెల్లెలనుకో...నీ కాళ్లు మొక్కుత"** అనే మాటలు కూడా అనేస్తుంది... బలహీనులు తెలంగాణలో మాట్లాడే మాటలు ఆమె కూడా మాట్లాడుతుంది.

ఇంట్లోకి ప్రవేసించినవాడు రజాకారు కాదు, పోలీసు కాదు, అతకు అంటాడు. **"లేదవ్వా! నమ్మవేం చెప్పుతుంటే! నేను దుష్టున్నిగాను, నేను మీ అందరి వంటి తెలుగోణ్ణే!"**

రామవ్వలో ధైర్యం నిండింది. ఎందుకంటే ఆగంతకుడు మాట్లాడింది అచ్చ తెలుగు భాష కనుక. భయంలేదు. రజాకార్లు, తురకలు, పోలీసులు తలారులు ఇలా తెలుగు మాట్లాడరు... భాషతో పోల్చుకొని ..... ఆత్మవిశ్వాసాన్ని నింపుకుంది. చావు, మానభంగం తప్పినవి అనుకుంది.

కూర్చున్న ముసలవ్వ ఇంతకు ముందే అతని కాళ్లు పట్టుకుంది. కనుక ఆమె తన చేతులతో అతని శరీరాన్ని స్పృశించింది. శరీరం నిండా మురికి పల్లెర్ల గడ్డిపోచలు గాయాలు రక్తముద్దలు, రేగిముండ్లు ఉన్నాయి. క్షణాల ముందు భయంగా వణికిపోయిన రామవ్వ... అతన్ని పోల్చుకోగానే తనకు కావలసినవాడిలాగే ఇదేం గతిరా నీకు? గిట్లెందుకయినవు కొడుక? అని ప్రశ్నిస్తుంది....

వచ్చినవాన్ని పోల్చుకోకపోవడానికి కారణం చీకటి ఒకటైతే రెండవది, రజాకార్లు, పోలీసులు గాలింపు... అతనెవరో తెలిసాక తనమనిషిలాగే భావించడం రామవ్వలో ఉన్న మానవత్వాన్ని తెలియజేస్తుంది.... బహుశా అప్పుడే ఆమె అనుకుంటుంది అతన్ని కాపాడాలని. అతను కాంగ్రెస్ పార్టీ కార్యకర్త. కేవలం నిక్కరులో ఉన్నాడు శరీరంపై అంగీలేదు. పోలిసులనుంచి, రజాకార్ల నుంచి తప్పించుకుని రామవ్వ గుడిసెలోకి వచ్చాడు.

కొద్దిసేపు తల దాచనివ్వు తర్వాత నాదారిన నేను పోతాలే? అంటాడతను.

కానీ పరిస్థితినంతా అర్థం చేసుకున్నామె అతని దీనతను చూసి ఆ! మా పోతా మా పోతా, ఒకటే పోకడ ! చక్కంగ స్వర్గమే పోతా. మంచి బుద్ధిమంతుడైషా! హు! పోతాడట యాడికో! అతడిని రక్షించాలన్న ప్రయత్నంతోనే ఆ మాటలు అన్నది రామవ్వ. అతనికి నోట మాటరాలేదు. పైగా భయం పోయింది. రక్షణలో ఉన్నట్టుగానే అతడు భావించాడు.

మల్లవ్వను దీపం ముట్టించమనగానే అతడు వద్దంటాడు. ఎందుకంటే వెలుతురుకు ఇంట్లో ఉన్నవారు కనిపిస్తారు. కనుక వద్దంటాడు. కాని రామవ్వ అతనికి ధైర్యం చెబుతుంది.. మల్లవ్వ దీపం వెలిగిస్తుంది. ఆ దీపం వెలుతురులో ఆ కార్యకర్త ఆకృతిని చూసిన రామవ్వ రాజోలిగె ఉన్నవు కొడుకా! నీకెందు కొచ్చెరా ఈ

కట్టం? .... అనుకుంటూ గొంగట్ల పడుకోమంటుంది. మల్లవ్వ అతని శరీరంపై ఉన్న ముల్లును తీసేయమంటుంది. ఆ పదిహేను సంవత్సరాల మల్లవ్వ పెళ్లైనయువతి... సహజంగానే పరాయి వ్యక్తి గనుక వెనకాముందాడుతుంది.

**నీ సిగ్గు అగ్గిలబడ! వాని పానం దీత్తవాయేం సిగ్గనుకుంట? ఊ! చెయ్యి చెప్పిన పని! పాపం పీనుగోలె పడున్నడ గాదె! వాన్ని జూత్తె జాలి పుడుతలేదె నీకు దొమ్మర ముండా? ఆ! గట్ల ! నొప్పిచ్చుకు పాపం!...**

సొంత మనుమరాలిని దూషిస్తూ అతనిపై ఎంత ప్రేమను చూపిస్తుందో రామవ్వ ఒకరకంగా అతని విషయంలో అభిమానం చూపిస్తు అతనికి సహాయం చేయడానికి సిగ్గుపడుతున్న మనుమరాలు మల్లవ్వను కఠినంగా దూషించింది. నిజానికి మల్లవ్వ అతని ప్రాణం తీస్తుందా! లేదు కాని అతనికి సహాయం చేయాలన్న రామవ్వ తపన వ్యక్తం అవుతుంది... కోపంగా మాట్లాడటం, హాస్యాన్ని ఒలికించడం గొల్ల రామవ్వ మూర్తిమత్వాన్ని దృశ్యమానం చేస్తుంది.

ఆ యువకుడి శరీరాన్ని వేడినీళ్లతో శుభ్రం చేసి, అతనికి తినడానికి గటుక పెట్టింది. తల్లిలా అతని శరీరాన్ని నిమురు తున్నప్పుడు అతని జేబులో తపాకి కనిపిస్తుంది...


ఎందుక్కొడుకో ! మమ్ముల గట్ల చంపుదామనుకున్నావాయేంది? అంటుంది రామవ్వ...లేదవ్వా మిమ్మల్ని చంపేవాళ్లను చంపే అందుకని అంటాడు. మూడు రోజులక్రితం గ్రామంలో నలుగురు నిర్దోషులను పోలీసులు చంపినందుకు ప్రతీకారంగా ఇద్దరు పోలీసులను చంపాడు ఆ కార్యకర్త. ఆ మాటలు విన్న రామవ్వలో తెలియని ఆనందోత్సాహం, విజయోత్సాహం కల్గింది.

కళ్ల ముందు జరుగుతున్న అకృత్యాలకు చరమగీతం పాడాలన్న ఈ లాంటి యువ కార్యకర్తలు కావాలన్న ఆశ ఆమెలో చేరి ఉంటుంది. అతన్ని చూస్తూ... ఆమె ఇద్దర్నా?...కాని ఇంకిద్దరు మిగిలిన్రు కొడుకా! సగం పనే చేసినవు... అంటుంది.

ఆ మాటలో వ్యంగం ఉంది. కసి ఉంది. ఆ మాటలకు ఆశ్చర్యపోతూ ఆ కార్యకర్త తక్కినవాళ్లను కూడా చూచుకొస్తాలే అవ్వా! అనేశాడు. కానీ రామవ్వ వారిస్తుంది. పోలీసోళ్ళతో వైరం ఎందుకు?...పేదోళ్లు కొట్లాడితేమైతది? అంటుంది... అలా మాటల్లోనే అమె తల్లిప్రేమను చూపించింది... తల నిమురుతూ దీర్ఘాలోచనలోకి వెళ్లింది.

అబ్బ! ఏం పోరడు! ఇసోంటోల్లెంతమంది చావాలో ఇంక! అనుకుంటూ కండ్లల్ల వత్తులు పెట్టుకుని కూర్చుంది.

గ్రామం అంతా గాఢ నిద్రలో ఉంది... ఆ కార్యకర్త మల్లవ్వ దగ్గరే పడుకున్నాడు. బయట పోలీసుల చేతికి ఎవరో చిక్కారు. అతన్ని వారు చితక్కొడుతున్నరు. అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి.




రామవ్వకు కంగారు మొదలయ్యింది. ఆ కార్యకర్త లేచి కూర్చున్నాడు. తుపాకీ తీసుకుని తూటాలు నింపుకున్నడు. కార్యసిద్ధుడైనాడు. రామవ్వ చేయిపట్టుకుని వారించింది.

నా వల్ల మీకు ప్రమాదం... సోదా చేస్తారు. నేను వెళ్తాను అంటాడు. బూట్ల చప్పుడు వినిపిస్తుంది. గుడిసె ముందు నిల్చున్నారు పోలీసులు. ఆ కార్య కర్త తలుపులు తీయబోయాడు. వెంటనే రామవ్వ అతన్ని వెనకకి నెట్టింది. తుపాకి తీసుకుంది. దీపాన్ని ఆర్పేసింది.

క్షణాల్లో రామవ్వ తెలివికి బీజం పడింది. ఆ కార్యకర్తను గొల్లోల్ల పిల్లవానిలా వేషం మార్చింది.. అతని నిక్కరు తీసి దాచింది. అచ్చం ఎర్ర గొల్లోని లాగే ఉన్నవు అని మురిసిపోయింది.

బయట నుంచి రామీ! ఓ గొల్ల రామీ ! తల్పుకీ కోల్.. అనే మాటలు. వెంటనే అతన్ని మంచంమీద పడుకోమంది. ఆ మంచం మీద మల్లవ్వ కూడా ఉంది.

అపుడే నిద్రనుంచి లేచినట్టుగా 'ఎవ్వరా పెద్ద దొంగనాత్తిరొచ్చి తలుపు కొడ్తాన్రు? దొంగముండ కొడుకులున్నట్లున్నరు ! మీ ఇల్లు పాడుబడ! పెద్దగా అరుస్తూనే ఉంది.... నన్నేం దోచుకుంటర్రా ? ముసలి ముండ దగ్గరేముంటది? అంటూ అరుస్తూనే మనుమరాలు మల్లవ్వను కార్యకర్త దగ్గర పడుకోమంటుంది. ఇక్కడ రామవ్వ తన చతురతను ఉపయోగించింది. పైన చెయ్యేసి పడుకో ఎవ్వరికి అనుమానం రాదు అంటుంది. మల్లవ్వ చెప్పినట్లు చేసింది. రామవ్వ అరుపులు ఎక్కువ చేసింది. ఈ పోర్ని నా నెత్తిన పడేశిన్రు! దెబ్బగొడితె రద్దీ! కొట్టకుంటె బుద్ధి రాదు. ఎక్కడి పీడ తెచ్చిపెడితివిరా నా పానానికి! యాడున్నవో కొడుకా! నా కొడకా! ముసలి ముండను అంటూ బయటవాళ్ళకు వినబడేలా పెద్దపెద్ద రాగం దీసుకుంటూ ఏడువసాగింది...

అరుపులు బయటకు వినిపిస్తున్నయి. వారిలో కొందరు ముసల్ది నాటకం ఆడుతుందని, మరికొందరు జాలిపడటం చేసారు. బయట పోలీసులు 'తోడ్ దేవోరే దర్వాజా' అంటుండగానే రామవ్వ తలుపు తీసింది....

పోలీసులు ఒకరి మీద ఒకరు తోసుకుంటూ గుడిసెలోకి ప్రవేశించారు. రామవ్వ పెద్ద కేకలు వేస్తూ అరిచింది. చంపితిర్రా నీ

దౌడలు బడ ముసల్దాన్ని పానం తీత్తిర్రా! అంటూ ఏడుస్తూనే ఉంది... ఏం జరుగుతుందో వచ్చిన పోలీసులకు మాత్రం అర్థం కాలేదు. ఈడనేనున్న గురుగులంటన్నయి. తల్లె ముంతలున్నయి. పోరియెడల గంటె పుర్రెలున్నయి. పోరగానికి రెండు దండ కడియాలున్నయి. ఇంకేగావాల్నో తీసుకోండి. చంపాలంటే చంపుండి.... పోరన్ని చంపండి. పోరి ముండ యనక ముందు దాన్ని గూడ తుపాకి నెయ్యండి. ఇద్దర్నోసారి చంపుండి.

అంటుండగానే మల్లవ్వ కండ్లు తుడుచుకుంటా మంచం దిగింది. కార్యకర్త ఆవలిస్తూ మంచం మీదనే కూర్చున్నాడు. అక్కడేం జరుగుతుందో పోలీసులకు ఏమీ అర్థం కాలేదు. ఒకరి ముఖాలు ఒకరు చూస్తు కూర్చున్నారు. రామవ్వ మాత్రం తను చేయాల్సిన పని చేస్తూనే ఉంది... అలాగే ఏడుస్తూ అరుస్తూనే ఉంది.

అంతలో పోలీసు కార్యకర్తవైపు చూస్తూ వాడు యెవడున్నడు చెప్పు కాంగ్రెసోడా యేం?

రామవ్వ మాత్రం గట్టిగా అరుస్తూనే ఉంది. ఆ అరుపుల నుండి వాడెవ్వాడా? ఎవ్వడు పడితె వాడు మా పక్కల్ల పండుకోవడానికి మేమేం బోగమోళ్ళ మనుకున్నావా? నిన్నెవ్వడన్న గట్లనే అడుగుతే ఎట్లుంటది?

మాటల్తోని మానం దీసుడెందుకు? పానం తియ్యరాదుండి?... అంటూ నోటికొచ్చిన మాటలు అంటునే ఉంది రామవ్వ....

బైటోడు గొల్లరామి గుడిసెలకొచ్చి ఎట్ల తప్పించుకుంటాడు? పానంతో పట్టుకొచ్చి అప్పచెప్పనయ్య గొల్లరామెసోంటిదో ఊరోళ్ళ నడుగండి.....

ఆమె మాటలకు బిత్తరపోయిన పోలీసులకు ఏం జేయాలో తోచలేదు. కొద్దిసేపు ఆలోచించి 'అచ్చ నేను పంచనామ చేసుకొని వస్తా' అంటూ పోలీసు జమదారు ఇతరులు వెళ్లారు.

ఆమె ప్రదర్శించినతీరు, ఆ సాహసం దానికి మించిన తెలివి, అంతా కలగలసి ఓ కార్యకర్త ప్రాణాన్ని కాపాడింది.... గొల్ల రామవ్వ బాధ్యతతో చేసిన పనిలా కనిపిస్తుంది.

ఆ కార్యకర్త రామవ్వ చతురతను చూసి **"అవ్వా నీవు సామాన్యురాలు కావు. సాక్షాత్ భారత మాతవే"** అన్నాడు. రామవ్వ నవ్వుతూ కొంటె పోరడా! నాకే పేర్లు పెడుతున్నవా... నా పేరు గొల్ల రామవ్వ అంతే....ఇగనువ్వెల్లు... మల్లిని అత్తారింటికి తోల్కపోత... పొద్దెక్కుతుంది.... అంటుంది. ఆమె భావన అర్థం చేసుకున్న కార్యకర్త వెళ్లిపోతాడు.


రాత్రంతా నిద్ర లేకుండా ఆ కార్యకర్తకు సేవజేస్తూ ... భయం గుప్పెట్లో సాహసంగా రామవ్వ తెలివితేటలు ప్రదర్శించడం చాలా గొప్ప విషయం. ఆమె ఆ సమయంలో ప్రదర్శించింది అసాధారణ ప్రతిభనే...

**ఆధార గ్రంథాలు :**

1. తెలంగాణ కథలు – సంపా. కాలువ మల్లయ్య, సదానంద్ శారత, చంద్ర : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, జులై, 2005.
2. అస్తిత్వ – ప్రాతినిధ్య తెలంగాణ కథలు. ప్రధాన సంపా. నందిని సిధారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ, హైదరాబాద్ 2019
3. తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం – సంపా. జె. చెన్నయ్య, ఆంధ్ర సారస్వత పరిషత్తు, 2013.
4. తెలంగాణం – వ్యాసాలు : సంకలనం : వట్టికోట ఆళ్వారుస్వామి. తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ రచయితల వేదిక, హైదరాబాద్ – 2009.

❖ ❖ ❖ ❖ ❖

**శిలాక్షరం**
**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**
ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.
సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-




సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

**మూసీ**
సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

# ఆచార్య భూమయ్య గారి 'భౌమ మార్గ విమర్శ'

**అరుణ ధూళిపాళ,** ఫోన్ : 87123 42323



(గత సంచిక తరువాతి భాగం)

**7. శివానంద లహరి :**

సౌందర్యలహరిలో అమ్మవారి మాహాత్మ్యాన్ని కొనియాడిన శ్రీ శంకరులు శివానందలహరిలో జగత్పిత అయిన పరమేశ్వరుని స్తుతిస్తున్నారు. మూడు దశాబ్దాలు మాత్రమే జీవించిన శంకరులు సూర్యుని వలె విజ్ఞాన కాంతులను వెదజల్లి మూడు శతాబ్దాల జ్ఞానాన్ని ప్రపంచానికి వెలువరించారు. సాక్షాత్తు శివుని అవతారంగా చెప్పబడుతున్నవారు.

**"కలాభ్యాం చూడాలంకృత శశి కలాభ్యాం నిజ తపః ఫలాభ్యాం .... నతి రియం"** పార్వతీ పరమేశ్వరులు ఒకరి కోసం ఒకరు తపము చేసి ఒక్కటైనారు. నిజ తపః ఫలాభ్యాం అనే ఒక్కమాట ఎంతో లోతైన అర్థాన్ని స్ఫురింప చేస్తుంది. ఆ ఇద్దరినీ అర్ధనారీశ్వరతత్వంగా కాక ఒకే రూపంగా శంకరులు దర్శించారు. ఎంతటి మహద్భాగ్యమో వారిది. అట్టి కవి హృదయ దర్శనానికి కైమోడ్పులర్పిస్తారు భూమయ్యగారు.

ఈ శ్లోకంలో శంకరాచార్యులు విషయాన్ని కవిత్వంగా, ఛందోబద్ధంగా వివరిస్తున్నారు. పాద పాదంలో సౌందర్యాన్ని ఇనుమడింపచేశారు. దంపతుల గురించి చెప్తున్నారు కాబట్టి జంటపద ప్రయోగం చేయడంలో కవిత్వ ఔచిత్యం కనబడుతుంది. దీనివల్ల పద్యాన్ని పాడినప్పుడు నాదం మనసును తాకుతుంది. ఈ భావాన్ని భూమయ్యగారు కవితాదృష్టితో కవిదృష్టిని వ్యక్తం చేశారు.

ఇలాంటిదే మరో శ్లోకం...

**"త్రయీ వేద్యం హృదయం త్రిపురహర మాద్యం**

**త్రినయనం......... హృది భజే"** ఇందులో పదాలన్నీ బిందుపూర్వకంగా ముగియడం వల్ల చదువుతున్నప్పుడు ఆ బిందువు ప్రణవనాదంగా భాసించి హృదయాన్ని స్పృశించి తరంగాలై దేహమంతటా నిండిపోతుందని శంకరుల శబ్ద సౌందర్యాన్ని ఆరాధిస్తూ అక్కడే ఉండిపోతారు ఆచార్యుల వారు.

**"గభీరే కాసారే విశతి......న జానాతి కి మహో"** శివుని ఆరాధించాలనే తపనతో భక్తుడు దట్టమైన అరణ్యాలలోకి వెళ్తున్నాడు. కానీ తన హృదయంలోనే శివుదున్నాడన్న అంతరార్థాన్ని గ్రహించలేకున్నాడు. అజ్ఞానం ఆవరించి మూఢుడై, చిత్త చాంచల్యంతో ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు. కాబట్టి ఈ తిరగాల్సిన పని ఏదో హృదయం వైపు ప్రయాణించుమంటారు. దీనికి భూమయ్యగారు ముండకోపనిషత్ లోని **"బృహచ్చ తద్ దివ్య మంచిత్య రూపం...."** మంత్రాన్ని ఉదాహరణగా చూపుతూ అచింత్యమైన బ్రహ్మము సూక్ష్మాతి సూక్ష్మంగా హృదయంలోనే ఉందని, దానిలోకే వెళ్ళమని శంకరులు చెప్పిన విషయాన్ని ఋజువు చేస్తారు.

**"దురాశా భూయిష్ఠే దురధిప గృహద్వార...... ఖలు వయమ్"** ఇక్కడ శంకరులు అనేక కష్టాలతో కూడిన ఈ సంసారం నుండి నన్నెందుకు రక్షించవు? అని శివుని ప్రశ్నిస్తూనే **"ఒకవేళ నేను ఇలా కష్టాల్లో ఉండడం నీకు ఆనందమైతే అంతకంటే కావలసింది ఏముంది? నిన్ను ఆనందింప చేశానంటే నా జన్మ సార్థకమే కదా"** అని అనడంలో చమత్కారం, గడుసుదనం, వినయం, భక్తి వెల్లడవుతాయి. ఇందులో ప్రయోగించిన పదాలన్నీ **'దుః'** తో మొదలవుతున్నాయి. ఇవన్నీ దుఃఖ సంకేతాలే. వినడానికే కష్టమయ్యే పదాలు. మరి అనుభవించడం ఎంతకష్టం? అందుకే వాటినుండి తరింపచేయమని శంకరులు శివుని వేడారని వివరిస్తారు కవిగారు.

**"సదా మోహాటవ్యాం చరతి....... మే హృదయకపి మత్యంత చపలం............"** ఇక్కడ హృదయానికి కోతికి ఎలాంటి భేదం లేదంటారు శంకరులు. కపి స్వభావం చపలం. ఎటు ఎందుకు దూకుతుందో దానికే తెలియని స్థితి. గమ్యం లేని, నిష్ప్రయోజన మైన దుముకులాట. అలాగే మనిషి హృదయం చపలం. ఆలోచనలు అవిరామంగా, నిలకడ లేకుండా సంచరిస్తూనే ఉంటాయి. అదే "మోహాటవి" మోహమనే అరణ్యంలో గతి తప్పి తిరిగే మనిషి కుదురుగా ఉండాలంటే భక్తి ఏకైక మార్గం. దీన్ని కవితాత్మకంగా, మనసును హత్తుకునేలా చెప్తారు ఆది శంకరులు.

ఈ సందర్భంలో భూమయ్యగారు భారత కథను గుర్తు చేసుకుంటారు. అర్జునుడాదిగా కొంతమంది కృష్ణుణ్ణి వెతకడానికి అడవికి పోయి దారి తప్పి రోజుల తరబడి అక్కడే ఉండిపోతారు. పన్నెండు సంవత్సరాలు అడవిలోనే కాపురమున్న అర్జునునికి అడవి లోని దారి తెలియకపోతే మన గతి ఎలా ఉంటుందో ఊహించమంటారు. అజ్ఞానంలో పడి హృదయానికి వశ్యమైతే గమ్యం తెలియని

అగాథంలోకి పడిపోతామని హెచ్చరిస్తారు.

ఈ శ్లోకంలో హృదయకపి,మోహాటవి, కుచగిరులు, ఆశాశాఖలు మొదలైన పదాలు అలంకారాలై పద్యాన్ని అలంకృతం చేస్తాయి. అందుకే శంకరులు ఎంత తాత్వికులో అంత గొప్పకవి అంటారు భూమయ్య గారు.

**"నిత్యం స్వోదర పోషణాయ......... రక్షణీయోస్మ్యహమ్"** నిత్యం ఉదరపోషణార్థం డబ్బు సంపాదనమీదే దృష్టి నిలిపాను. ఇదంతా వృధా ప్రయాస. కానీ ఏదో పూర్వజన్మ పుణ్యమువలన **"మజ్జన్మాంతర పుణ్య పాక బలతః"** నీ చేత రక్షింపబడి ఉన్నాను. అందుకే ... **"భవత్సేవాం న జానే విభో"** నీ సేవను ఎరుంగని స్థితి కలుగనీయకు మంటారు.

ఇతరుల ధనాన్ని ఆశించవద్దని ఈశావ్యాసోపనిషత్తులో చెప్పబడిన **"మా గృధః కస్య స్విద్ధనమ్"** మంత్రం తాత్పర్యాన్ని శిష్యునికి వివరిస్తూ ధనాపేక్ష విడిచిపెట్టాలంటారు భూమయ్యగారు.

**"బహువిధపరితోష బాష్ప పూర**
**స్ఫుట పులకాంకితచారుభోగభూమిమ్**
**చిరపదఫల కాంక్షి సేవ్యమానాం**
**పరమసదాశివభావనాం ప్రపద్యే"** ముక్తి ప్రదాత అయిన శివుణ్ణి శరణు వేడుతున్నారు శంకరులు. దానికోసం శివ భావము, శివధ్యానమే నాకు శరణ్యం. పరమపదము చేరడానికి ఆయనొక్కడే సాధనం అందుకే అన్నీ చెబుతూ చివరగా **"పరమ సదాశివ భావనాం ప్రపద్యే"** అంటారు. **'ప్రపద్యే'** అన్న ఒక్క పదంలో మొత్తం శివరహస్యాన్ని చెప్పారు. ఆచార్యులవారు దాన్ని **"అమృతతుల్యమైన పదం"**గా పోల్చారు. అదే మోక్షానికి హేతువవుతుంది.

**"సర్వాలంకారాయుక్తాం సరళ పద యుతాం......**
**గౌరీ ప్రియ! మమ కవితాకన్యకాం త్వం గృహాణ"**

శ్రీ శంకరులు తమ కవితా కన్యక "శివానందలహరి"ని శివునికి సమర్పిస్తున్నారు. కన్యకకు వర్తించే లక్షణాలన్నీ ఇందులో ప్రతిక్షేపించారు శంకరులు. సర్వాలంకార యుక్తాం, సరళ పదయుతాం, సాధువృత్తాం, సువర్ణాం, సద్భిః సంస్తూయమానాం, సరస గుణయుతాం మొదలైన కవితాంశాలన్నీ కూడి సర్వగుణ శోభిత అయిన కావ్య కన్యకను గౌరీ ప్రియునికి సమర్పించారు శంకరులు. తండ్రి తన కూతురు గుణగుణాలను వరునికి తెలియచేస్తూ అట్టి కన్యకను స్వీకరించుమని మనవి చేసే ధోరణిని గ్రహించారు కవిగారు.

సౌందర్యలహరి వలె శివానందలహరిని కూడా నాటకీయంగా శిష్యునితో సంభాషిస్తున్నట్టు పది రోజుల్లో, రోజుకు పది పద్యాలను వివరిస్తూ భక్తి, కవిత్వాలను ఒక్కచోట పేర్చి రసానందాన్ని కలిగించారు భూమయ్యగారు.

**8. అప్పాజోస్యుల వారి పద్యావలోకనం :**

"కవి అంటే 'అంతశ్చరయోగి' కవితారూపంలో ఉన్నవాడు". అని చెప్పిన కవియోగి అప్పాజోస్యులవారు. **"నా నృషిః కురుతే కావ్యమ్"** అన్న దానికి వివరణాత్మకంగా వారు రాసిన **"నిశ్చిత సంయమీంద్రులు వినీతులు గాంచు ననూన సిద్ధినే...."** అనే పద్యంలో ఋషికి, కవికి భేదం లేదని, **"తపస్సు చేసి అంత కష్టపడి ఋషి కావడం కంటే నిత్య కవితాసాధన చేస్తూ కవి అనిపించుకోవడం మేలు"** అని కవిత్వాభిలాషను వ్యక్తం చేసిన కవి ఆయన. అటువంటి కవితారూప తపస్సు చేస్తున్న ఆ యోగి మీద అభిమానంతో ఇటీవల వారి జయంతిని పురస్కరించుకుని వారికి ఆత్మీయ కానుకగా భూమయ్యగారు రచించిన పుస్తకమిది. ఇది భూమయ్యగారి భౌమమార్గ విమర్శ మాలికలో వికసించిన మరోపుష్పం.

**"శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్ లోక**
**రక్షైకారంభకు భక్తపాలనకళా సంరంభకున్......."**

అని పోతన భాగవతపద్యాన్ని అప్పాజోస్యుల సత్యనారాయణ గారు పాడుతున్నప్పుడు అందులో "భక్తపాలన కళాసంరంభకున్" అనే పదాన్ని ఒకింత ఒత్తి పాడుతుండడంతో తన మనస్సు దాని మీద పడి "భాగవత భక్తపాలన కళ" అనే పేరుతో విమర్శ పుస్తకం రాశానని భూమయ్యగారు చెప్పుకున్నారు. అప్పా జోస్యులవారు ఇతరులను ఎంతగా ప్రభావితం చేస్తారో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

శాస్త్రజ్ఞులైన అప్పాజోస్యులవారు శాస్త్ర పరిశోధనారంగంలో ఆనాడు చేసిన ప్రతిపాదనలు ఇప్పటికీ తిరుగులేనివిగా ఉండడం వారి మేధాసంపత్తికి తార్కాణం. అంత గొప్ప శాస్త్రవేత్త అయిన వీరికి దానితో ఏమాత్రం సంబంధం లేని ఇంతటి కవితాపాండిత్యం కలగడం ఆశ్చర్యం. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న సమయంలో పేరు పొందిన కవి పండితులను, అవధానులను సతీసమేతంగా ఆహ్వానించి, వారికి వసతి కల్పించి, వారి కావ్యగానాలు విని సాహితీ చర్చలు చేసేవారంటే వారి సాహితీ పిపాసను అర్థంచేసుకోవచ్చు. కవుల పద్యరచన, పద్యం ఎత్తుగడ, సమాసరచన, భావం, అభివ్యక్తి, పాత్రలను తీర్చడంలో ప్రత్యేకతలను గమనించి పద్య పరిమళాలను ఆఘ్రాణించడం వారి సునిశిత పరిశీలనా దృక్పథాన్ని తెలుపుతుంది. పద్యం బాగుండకపోతే కవి ఎదురుగుండానే నిర్మొహమాటంగా ఆ విషయం చెప్పడం వారి ప్రత్యేకత.

అప్పాజోస్యులవారు రచించిన 'సుగుణాఢ్య శతకం' లోని మొదటి పద్యం..

**"శ్రీ విధి సూత్రమై, సకల చేతనాకారమై, సదా తన**
**స్థావర జంగమ స్థితికి తావలమై......తాదృశముల్ సుగుణాఢ్య వర్తనల్"** అంటూ సకల శుభములనిచ్చేది అయిన 'శ్రీ' తో ప్రారంభమైంది. లోకాతీత శక్తి ఏదైతే ఉంటుందో అదే నిరంతర దివ్యశక్తి.

ఆ దివ్యశక్తి సంబంధ గుణాలను అలవర్చుకోవాలి అనడంలో ఒక ఆదర్శం గోచరమవుతుంది. ఈ పద్యాన్ని కాస్త హెచ్చుతగ్గుల స్థాయిలో పాడినట్లయితే ఇందులోని సమాస రచనార్థం, అందం హృదయానికి అందేలాగా ఉన్నాయంటారు భూమయ్యగారు.

**'సుగుణాఢ్య శతకం'** లో కవి, తన **"మనవి మాటలు"** లో దీని అంతరంగాన్ని తెలుపుతూ **"నా మనసుకు హత్తుకున్న కొన్ని భావాలను ముక్తకాలుగా అందించే ప్రయత్నమే ఈ శతకం"** అంటారు. దీనికి అనుసరణగా మరో వాక్యంలో **"ఈ శతకంలో ప్రసక్తమైన భావాలు స్వీయ సృజనలు కావని ముందుగా మనవి చేస్తున్నాను"** అంటారు. ఈ విషయాన్ని ప్రాస్తావికంగా వివరిస్తూ భూమయ్యగారు **"ఇతిహాసాలు చదివినప్పుడు అప్పాజోస్యులవారికి నచ్చిన కొన్ని గుణసంబంధమైన అంశాలను ఆయన 'ముక్తకాలు' గా రాశార"**న్న విషయాన్ని స్పష్టం చేస్తారు. అంతేకాదు. **"భావాలు తనవి కానప్పుడు ఇందులో ఉన్నదేమిటా?"** అనే శంక పాఠకులకు కలుగకుండా పద్య రచనా విన్యాసం, పద, సమాసాల సృష్టి, పద్యం ఎత్తుగడ, ముగింపు అభివ్యక్తి ఇత్యాదులు ప్రధానాంశాలుగా రచన సాగిందంటారు. పద్యరచనను కవిగారు 'పద్యవిద్య' అని పేర్కొనడం వల్ల ఆయన పద్య రచనా సొగసును ఇందులో చూడమంటారు భూమయ్యగారు. స్వీయ రచనలు కావన్నంత మాత్రాన కవి ప్రతిభావంతుడు కాదని, స్వీయ సృజనలు లేవని చెప్పడం కాదంటూ, పాశ్చాత్య సాహిత్య విమర్శ గ్రంథాలను, సంస్కృతా లంకారికులు రాసిన గ్రంథాలను, కావ్య శాస్త్రాలను ఒంట పట్టించుకున్న 'కవివరులు' అప్పాజోస్యులవారని వారి ప్రతిభావ్యుత్పత్తులను శ్లాఘించారు భూమయ్యగారు.

**"అమృతంచైవ, మృత్యుశ్చ ...సత్యేనాపద్యతే మృతమ్"** అమృతము, మృత్యువు దేహంలోనే ఉంటాయని, మోహం వల్ల మృత్యువు, సత్యం వల్ల అమృతం కలుగుతుందని ఈ శ్లోక భావము. ఈ భావం నచ్చి 'సుగుణాఢ్య శతకం' లో ఆచరించవలసిన సుగుణాలను చెబుతూ..

**"అమృతము మృత్యువున్ యుగళమై మన దేహము నందె నిష్ఠమై, యమరి నివాసముందు......"** అని చిన్న శ్లోకాన్ని వృత్తపద్యంలో వివరిస్తారు. ఇది సామాన్య విషయం కాదు. సంస్కృతంలో పద విచ్ఛిత్తి తప్ప తెలుగులో వలె యతి ప్రాసలు ఉండవు. మరి అలాంటి పద్య లక్షణాలతో, ఛందోబద్ధమైన పద్యం రాయడం కష్టం. దీన్ని వివరిస్తూ పద్యం రాయడంలో కష్టాలను గురించి పద్యం రాసిన జాషువా గారిని, యతి ప్రాసల వల్ల తెలుగు పద్యానికి ఒనగూరే అందచందాలను ఒక పాత్ర ద్వారా చెప్పించిన కొరవి గోపరాజు గారిని, **"కవి ప్రతిభ లోన నుండును కావ్య గత శతాంశముల యందు తొంబదియైన పాళ్లు"** అన్న విశ్వనాథవారిని ఈ సందర్భంగా తలచుకుంటారు భూమయ్యగారు.

**"శతమును మించి సూర్యులును చంద్రులునంతకు మించి.....యిసుమంతలో నిరుల ద్రోలదు.. సూరి వచో మరీచి, హృద్గతమయి పూన్చు లో వెలుగు...."** అనే పద్యంలో 'ఇసుమంత' అనే పద ప్రయోగం చేశారు అప్పాజోస్యులవారు. సూర్యుని వెలుగు లోకాన్ని ప్రకాశింపచేస్తుంది కానీ హృదయగతమైన చీకట్లను 'ఇసుమంత' కూడా తొలగించలేదు. అని చెబుతూ 'సూరి' అయిన వాడే అంటే, ఎరిగిన కవి పండితుడు మాత్రమే హృదయ తిమిరాలను ఛేదిస్తాడని చెప్పడం కవి భావనా నైపుణ్యానికి, కవితా శిల్పానికి గొప్పదనాన్ని ఆపాదించేలాగా ఉన్నాయి. ఈ 'ఇసుమంత' ప్రయోగం, 'పద్యవిద్య' ఎరిగిన అప్పాజోస్యులవారి పద్య నిర్మాణ కౌశలమని భూమయ్యగారు అభిప్రాయపడ్డారు.




**"అమృత ఫలాభమైన కృతులందలి యద్భుత వాగ్రసాను భా/ వము రుచి జూతు రందరు సభావళులందు....."**

కావ్యాలు అద్భుత రసాత్మకమైనవిగా ఉన్నప్పుడే సాహితీ ప్రియులు ఆస్వాదించ గలుగుతారు. అందుకే ఈ పద్యంలో **"రస సాంద్రతా గుణోద్యమిత మహార్థం"** 'ప్రాజ్ఞ మతి' కి మాత్రమే తెలుసని అప్పాజోస్యులవారు పాఠకుల స్థాయిని పెంచారని చెబుతూ భూమయ్య గారు వారి భావుకతను, రసజ్ఞతను విశ్లేషిస్తూ, దీన్నిబట్టే **''వారు ఎంతటి ప్రాజ్ఞమతియో తెలుస్తుందం"**టారు.

**''మరణ వ్యవస్థ నైన గుణిమాన సమున్నతమై వెలింగెడున్ ........ధర్మ బోధన, లశేషముగా వినిపించె భీష్ముదుత్తర శరతల్ప నిష్ఠదయి....."** అన్న పద్యంలో...

జనన మరణాలు మనిషికి సహజమే అయినప్పటికీ మరణావస్థలో మనిషి ఇంకా బతుకలేక పోతిననే అసంతృప్తిని, పరితాపాన్ని పొందుతాడు. కాలం విలువ తెలిసి తృప్తిగా బతకాలంటారు కవిగారు. అందుకే భీష్ముడు అంపశయ్య మీద ఉండి కూడా ధర్మజునికి ఆదర్శవంతమైన రాజనీతిని బోధించిన విషయాన్ని చెబుతారు.. అలా భీష్ముని ఆదర్శాలను తెలియచేయడం ద్వారా భీష్ముని బోధన

లన్నీ తెలుసుకోవాలనే ఆసక్తిని కలుగజేస్తూ మన మనసును భారతకథ వైపు నడిపించి పఠనోన్ముఖులను చేస్తారంటారు భూమయ్యగారు.

అప్పాజోస్యులవారు మహాదేవి మత్తేభ తారావళి, దివాకర వృత్త తారావళి, పావకవృత తారావళి, సుజల వృత్త తారావళి, వసుంధరా వృత్త తారావళి అనే అయిదు తారావళులను రచించారు. పంచభూతాలకు సంబంధించి అయిదు తారావళులు రాయాలనే ఆయన సంకల్పంలో ఇంకా రెండు రావాల్సి ఉన్నాయి.

మహాదేవి వృత్త తారావళిలో,

**"తలపన్ జీవన వాహినిన్ తడిసి ముద్దౌచున్.......గౌరవించ తగదే దేవీ! కృపామూర్తియై"** ఇందులో అమ్మవారి ఎదురుగా కూర్చొని తన మనసును విప్పి చెప్పినట్లు మాట్లాడుతున్నట్లుగా భావించి ఆత్మీయతను కనబరుస్తున్నారు కవిగారు. ఎత్తుగడ నుంచి చివరివరకు తీర్చిన నడకను కొనియాడుతూ భూమయ్యగారు దీన్ని ఇరవై ఏడు రేకుల కమలంగా, ఆ రేకులన్నీ సౌగంధికా రేఖలని వర్ణిస్తారు.

దివాకర వృత్త తారావళిలో,

**"సకలార్థ ప్రదమైన వెల్గుల కథిష్ఠానంబు....సృష్టికి మూలాంకుర మైన భాస్కరుడు సంక్షేమంబు మాకిచ్చుతన్"**

అగ్నిమీళే పురోహితమ్మని ఋగ్వేదం కొనియాడిన అగ్నిదేవుని గూర్చి పావకా వృత్త తారావళిలో....

**''ఋగ్వేద ప్రథమోక్త సూక్త మహితున్, వృథ్వీ జగద్బాంధవున్........సన్నుతింతు నెడదన్ త్రేతాగ్ని రూపాన్వితున్"**

సుజల వృత్త తారావళిలో,

**"ఆకాశంబుదరాశియై .......త్రిమార్గన్ గొల్తు మందాకినిన్"**

వసుంధరా వృత్త తారావళిలో,

**"స్థిరమై తొల్లి యధర్వ వేదమున పృథ్వీ సూక్త సంప్రాప్తమై...భక్తిని సన్నుతింత్రు మది 'పుత్రోహం పృథివ్యా' స్సదా"**

ఇలా తారావళులన్నీ అప్పాజోస్యులవారి కవిత్వ పటుత్వాలుగా అభివర్ణిస్తారు భూమయ్యగారు.

ఇంకా అప్పాజోస్యులవారు ఆదిగురువు శంకరాచార్యులు గారు రచించిన **'అపరోక్షానుభూతి'** ని యథాతథంగా తేటగీతి పద్యాలుగా అనువదించారు. పూర్వకవులు రాసిన కొన్ని చాటుపద్యాలను గురించి వివరణాత్మకంగా విశ్లేషిస్తూ **"మన చాటు పద్య సంపద"** అనే వచన గ్రంథంలో పద్యాల్లోని సామాజిక అంశాలను, కవితావిశేషాలను విశదీకరించారు.

**"పద్యావలోకనం"** ద్వారా అప్పాజోస్యులవారి పట్ల గౌరవాన్ని , ఆత్మీయతాభిమానాలను వ్యక్తపరుస్తూ ఈ పుస్తకానికి అనుబంధాన్ని కూడా చేర్చి వారి సమగ్ర వ్యక్తిత్వరూపాన్ని చిత్రించారు. కవితా తపస్వి అయిన **"అప్పాజోస్యులవారి హృదయం కవితాకళకు గీటురాయి"** అని వారిని ప్రశంసిస్తూ రాసిన ఈ పుస్తకం, భూమయ్య గారి సునిశిత కావ్యపరిశీలనలోని మరో ఆణిముత్యంగా భాసిల్లగలదు.

❖ ❖ ❖ ❖ ❖


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# తెలుగు సినిమా ప్రయాణంలో జానపద గీతాల పాత్ర

**యడవల్లి సైదులు,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఫోన్ : 7032188578

తెలుగు భాష ఎంతో ప్రభావ వంతమైంది. తెలుగు సినిమా తెలుగువారి సంస్కృతిలో భాగమైంది. ఏ ఇద్దరు కలుసుకున్నా, ఏ సోషల్ మీడియా గ్రూపుల్లో చూసిన తెలుగు వారు సినిమా గురించి మాట్లాడుకోకుండా ఉండలేరు. అందుకే తెలుగు వారికి ఇతర సైటుల కన్నా సినిమా సైటులే అంతర్జాలంలో ఎక్కువగా ఉన్నాయి. మొత్తం భారతీయ సినిమాను చూసుకుంటే సంఖ్యాపరంగానూ, వాణిజ్య పరంగానూ తెలుగు సినిమానే అగ్రస్థానంలో ఉంది. ఇది వరకు వాణిజ్య పరంగా బాలివుడ్, ఆ తరువాత తమిళ సినిమాలు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఇటీవల కాలంలో తెలుగులో వచ్చిన బాహుబలి1 , బాహబలి కన్‌క్లూజన్, ఆర్.ఆర్.ఆర్., అఖండ, పుష్ప సినిమాలు మొత్తం భారతదేశంలో అనూహ్య కలెక్షన్లను సాధించి తెలుగు సినిమా సత్తను చాటాయి. ఇప్పుడు తెలుగు సినిమా భారతీయ సినిమాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇందులో జానపద గీతాల పాత్ర అమోఘమైంది. జానపదంలోని సొగసు, పద సహజత్వం ప్రేక్షకులను మధురానుభూతిలో ఓలలాడిస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు.

తెలుగు సినిమా సాహిత్యానికి, తెలుగు సినిమా చరిత్రకి పెద్ద ఆంతర్యం లేదు. సినిమా ఎప్పుడు మొదలైందో దాదాపు సినీ సాహిత్యం సినిమా పాటల ద్వారా అప్పుడే మొదలైంది. 1921లో రఘుపతి వెంకయ్య నాయుడు తీసిన 'భీష్మ ప్రతిజ్ఞ' మూకి సినిమా, 1931లో విడుదలైన భక్త ప్రహ్లాద తొలి తెలుగు టాకీ సినిమా. అది మొదలు నేటి వరకు తెలుగు సినిమా ప్రయాణం దినదిన వృద్ధి చెందుతూ సాగుతూనే ఉంది. సినిమా రంగంలో 24 శాఖలుంటాయి. అందులో పాటల రచయితలు ఒక ప్రత్యేక శాఖ. వీరు ప్రజాజీవనాన్ని సాహిత్యంలోకి పాటలుగా కూర్చినారు. అలా సినిమాని జనాన్ని కలిపిన సృజనాత్మక వారధులు సినీ కవులు. నాటి నుండి నేటికి గల కొందరు ప్రముఖ సినీ కవులు సముద్రాల పింగళి నాగేంద్రరావు, ఆత్రేయ, ఆరుద్ర, కొసరాజు, రసరాజు, శ్రీశ్రీ, వేటూరి సుందర రామ్మూర్తి, డా. సి. నారాయణ రెడ్డి, సిరివెన్నెల సీతారామ శాస్త్రి, సామవేదం షణ్ముఖశర్మ, భువనచంద్ర, చంద్రబోస్, సుద్దాల అశోక్ తేజ, దాసరి నారాయణరావు, అనిసెట్టి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మల్లాది రామకృష్ణ, రాజశ్రీ, దాశరథి, మల్లెమాల, వెన్నెల కంటి, వనమాలి, భాస్కరభట్ల, కులశేఖర్, అనంత శ్రీరామ్, బండి సత్యం, కందికొండ, బోలేషావళి, కాసర్ల శ్యామ్ మొదలైన కవులెందరో తెలుగు సినిమాల్లో జానపద గీతాలు రాసి తెలుగు సినీ జనాన్ని ఉర్రూత లూగించారు. ఇంకా ఊగిస్తూనే ఉన్నారు.

ఆధునిక కాలంలో మానవుడిపై అత్యంత ప్రభావాన్ని చూపుతున్న అద్భుతశక్తి "సినిమా". శ్రీమంతుడి నుండి అతి సామాన్యుడి దాకా అందరికీ అందుబాటులో ఉన్న వినోద సాధనం సినిమా ఒక్కటే. సినిమా అనే పదం 'కినెమా' అనే గ్రీకు భాషా పదం నుండి పుట్టింది. కినెమా అంటే 'పురోగమించడం' అని అర్థం. తెలుగు సినిమాల్లో భక్తి, ప్రబోధం, వినోదం, ప్రణయం మొ॥ అంశాల దృష్ట్యా ఎన్నో పాటలు వచ్చినా జానపద గీతాలకున్న బలమైన ముద్ర మరే ఇతర ప్రక్రియకూ లేదనే చెప్పాలి. అలాగే యథాతథంగానో, పాక్షికంగానో సినిమాల్లో జానపదులంత విరివిగా ఉపయోగించిన ఇతర ప్రక్రియలు లేవు. కీర్తి ప్రతిష్ఠల కోసం ఆశించని జానపదకవుల గీతాలు కొన్ని సినిమాల్లో కవుల సొంతమైతే కొన్నింటిలో మాత్రం నిజాయితీగా "పాత జానపదగీతాలు" అని స్పష్టంగా పేర్కొన్నారు.

సినిమాపాట సంగీత, సాహిత్య సమ్మేళనం. కొన్ని సందర్భాల్లో సన్నివేశం కూడా ప్రాణం పోస్తుంది. మనిషి జీవన నడవడిలో, అతడు దిద్దుకున్న సంస్కృతి సంప్రదాయాల ఒరవడిలో సమాజ హితాన్ని ఆశిస్తూ మనకు సినిమా పాటలు కన్పిస్తాయి. సినిమా పాటల్లో భక్తి, ప్రణయం, ప్రబోధం, వినోదం, విషాద గీతాలెన్నో ఉన్నప్పటికీ జానపద గీతాలనగానే మనసెందుకో ఆనందంతో పరవళ్ళు తొక్కుతుంది. అందులోని పద సౌందర్యం. పోహళింపే బహుశా అందుకు కారణమై ఉండవచ్చు. అయితే సందర్భాన్ని బట్టి భక్తి ప్రబోధం, విషాదం, ప్రణయం, వ్యంగ్యం వంటి అంశాల దృష్ట్యా రచించబడిన జానపద గీతాలను కూడా మనం వింటూ ఉంటాం. అంశం ఏదైనా జానపద గీతమనగానే పల్లె సౌందర్యం, యాస, నుడి మనల్ని ఇట్టే ఆకట్టుకుంటుంది. అలాంటి గీతాలెన్నో మన వెండితెరపై గజ్జెకట్టి నాట్యమాడాయి. జనుల హృదయవేదికలపై చిందులేశాయి. ఇంచుమించుగా సినిమాపాటల్లో ఎక్కువ గీతాల పైన జానపద ముద్ర ఉంది. ఈ వ్యాసంలోని వస్తువు ఎంతో విస్తృతమైనది. కానీ వ్యాస పరిమితి దృష్ట్యా కొన్ని జానపదగీతాల్ని గూర్చి ఇక్కడ వివరణ చేస్తున్నాను.

తెలుగు సినిమాల్లో టాకీ సినిమాలు 1931లో ప్రారంభమైనప్పటి నుండి వెండితెర మీద జానపదగీతాలు పరిమళాలు వెదజల్లుతూనే ఉన్నాయి. ఇలాంటి పాటలు రాసిన కవుల్లో తొలిదశకం నుంచి 1980 దశకం వరకు ఎక్కువగా జానపదగీతాలు రాసిన సినీగేయ రచయితగా కొసరాజు రాఘవయ్య చౌదరి పేరు చెప్పకోవచ్చు, సినీకవుల్లో "జానపద కవి సార్వభౌముడు" అన్న బిరుదును సార్థకం చేసుకున్నాడు ఆయన.

1939 సం॥లో "రైతుబిడ్డ" సినిమా కోసం కొసరాజు రాసిన **"సై సై చెన్నాపరెడ్డి నీ పేరే బంగారపు కడ్డీ"** లాంటి వీరరసాన్ని ప్రబోధించిన జానపద గేయాలునప్పటికీ అవి జానపదముద్ర నుంచి పూర్తిగా మారి వచ్చినవిగా చెప్పుకోవచ్చు. 'చిల్లరదేవుళ్లు' (1977) సినిమాలో తెలంగాణ ప్రాంతానికి చెందిన **"శ్రీ లక్ష్మీ నీ మహిమలూ గౌరమ్మా చిత్రమై తోచునమ్మా"** అనే భక్తిగీతం జానపదుల నోట నాట్యమాడినదే. నాటి నుండి నేటిదాకా స్త్రీలు పాడుకునే ప్రత్యేకమైన గీతంగా దీనిని గమనించవచ్చు. లక్ష్మీ పార్వతి సరస్వతులకభేదం చెప్పడం ఈ పాటలోని విశేషం.

ఇంకా ఈ చిత్రంలోనే **"ఏటికేతాంబట్టి ఎయిపుట్లు పండించి ఎన్నడూ మెతుకెరగనన్నా!"** అనే శ్రామికగేయం ఏడాది పొడవునా ఏటికేతమేసి నీరు తోడి పండించిన పంట తనదాకా రాకుండా భూస్వామి పట్టుకుపోతే నిలువెల్ల కుంగిపోయి. నీరసించి నిస్సహాయుడై ఈ బ్రతుకు గట్టుకోవడం మొ॥వన్ని ఏరువాక సాగుతున్న రైతును కళ్లముందుంచుతున్నాయి. జానపద స్పర్శ సుమనోహరంగా ప్రతిఫలిస్తున్న గీతంగా దీన్ని చెప్పుకోవచ్చు. సినీ జానపద గీతాల్లో ఈ పాట పదిలంగా చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇంకా "అమ్మమాట" (1970) సినిమాలో సి.నారాయణరెడ్డి రాసిన జానపద గీతాన్ని కూడా విశేషంగా చెప్పుకోవచ్చు.

బ్రతకడం కంటే పుట్టినప్పుడు చస్తే బాగుండునని కుమిలిపోతున్న రైతు కూలీని .... అనే పాట మన కళ్లముందుంచుతుంది. శ్రామికగేయాల జాబితాలోను, ముఖ్యంగా జానపద గీతాల వరుసలోను అగ్రేసర స్థానంలో నిలిచిన పాట ఇది. ఈ జానపద గీతాలన్ని యథాతథంగా సినిమాల్లోకి వచ్చినవే. ఇవి అత్యంత ప్రజాదరణ పొందిన జానపదగేయాలు కావడంతో యథాతథంగా వీటిని సినిమాల్లో వాడుకోవడం జరిగింది.

ఆ తరువాతి దశకంలో స్వల్ప మార్పులతో రాసిన జానపద గీతాలెన్నో సినిమాల్లో చోటు చేసుకున్నాయి. మచ్చుకు "దొంగ రాముడు" సినిమా కోసం కొసరాజు రాసిన "రావోయి మా ఇంటికి మామా మాటున్నది మంచి మాటున్నది" అనే పాట స్వల్పమార్పులతో ప్రయోగించిన జానపదగీతంగా చెప్పుకోవచ్చు, జానపదగేయాల్లోని పల్లవులందుకుని ప్రాణం పోసుకున్న సినిమా పాటలనేకం ఉన్నాయి. అందులో ముఖ్యంగా సి. నారాయణ రెడ్డి రాసిన ముత్యాలముగ్గు (1975) సినిమాలోని **"గోగులుపూచే గోగులుపూచె ఓ లచ్చగుమ్మడి గోగులు దులిపే వారెవరమ్మా ఓ లచ్చగుమ్మడి"** పల్లవితో ప్రారంభించి **"పొద్దుపొడిచే పొద్దుపొడిచే ఓ లచ్చగుమ్మడి పుత్తడి వెలుగులు కొత్తగ మెరిసే ఓ లచ్చగుమ్మడి"** అనే తన స్వతంత్ర పదబంధాల్ని జానపద పల్లవికి అద్ది పద సౌందర్యం పెంచాడు.

"రోజులు మారాయి" (1955) సినిమాలో కొసరాజు రాసిన జానపదగీతం నేటికీ ఏనాటికీ అజరామరమై అలరారుతుంది. **"ఏరువాక సాగారో రన్నో చిన్నన్న నీ కష్టమంత తీరునోరో రన్నో చిన్నన్న... నవధాన్యాలను గంపకెత్తుకొని చద్దియన్నమును మూటగట్టుకొని..."**

**"మాయాదారి సిన్నోడు - నా మనసేలాగేసిండు నా మనసేలాగేసిండు.. లగ్గమెప్పుడురా మావా అంటే మాగమాసం యెల్లేదాకా మంచిరోజు లేదన్నాదే"** తెలంగాణ మాండలికంలో రాయబడిన ఈ పాట తెలుగుదేశమంతటా మారుమ్రోగింది. భాష, భావం, సంగీతం మూడింటితో అల్లుకుపోయి, మన హృదయాలను పెనువేసుకుందీ పాట. లగ్గం, పానాలు వంటి తెలంగాణ మాండలిక పదసౌందర్యం ఈ పాటల్లో ప్రధానమైనవిగా చెప్పుకోచ్చు.

ఇంకా నారాయణరెడ్డి రాసిన "జీవితం" చిత్రంలోని **"మామిడి తోపుల్లోనా మాపటేల మాటేసి సిక్కుడు పాదుకాడ సీకటేల పట్టేసి సెప్పలేని రుచులెన్నో చిటికెలోన చూపించి మాయచేసి పోతివిరో నాగులు"** అనే పాట కూడా ప్రత్యేకమైన జానపద గీతంగా చెప్పుకోవచ్చు. ఇందులో కూడా తెలంగాణ భాషా సౌందర్యం గుబాళిస్తుంది. జానపద ముద్ర ప్రత్యేకంగా దర్శనమిస్తుంది.

గుండమ్మకథ (1962) చిత్రంలోని పింగళి నాగేంద్రరావు రాసిన **"కోలో కోలోయన్న కోలో నా సామీ కొమ్మలిద్దరు మంచి జోడు"** అనే గీతాన్ని కూడా ప్రత్యేకమైనదిగా పేర్కొనవచ్చు. ఇది జానపద ముద్రతో పింగళి నాగేంద్రరావు రాసిన గీతాల్లో అణిముత్యం. ఇంకా దసరా బుల్లోడు (1971) సినిమాలో ఆచార్య ఆత్రేయ రాసిన **"పచ్చగడ్డి కోసేటి పడుచుపిల్లో నీ పైట కొంగు జారిందే గడుసుపిల్ల"** అనే పాట శృంగార గీతమైనా జానపద సౌందర్యం ధ్వనించి, ఎక్కడా అశ్లీలతకు తావివ్వని తీరు కన్పిస్తుంది.

అలాగే 'ప్రేమనగర్' (1971) సినిమాలోని **"కడవెత్తుకొచ్చింది కన్నెపిల్లా అది కనబడితే చాలు నా గుండెగుల్లా"** అనే పాట కూడా నిర్మలమైన జానపదత్వాన్ని ప్రకాశింపజేసే ప్రణయగీతంగా వినుతికెక్కింది. అలానే మేలుకొలుపు గీతాల్లో కూడా జానపద ముద్ర ప్రత్యేకంగా కన్పించినవెన్నో ఉన్నాయి. కాని, సినిమాపాట కోసం కొన్ని మార్పులు కూడా ఇందులో చోటు చేసుకోవడం ఇక్కడ విశేషాంశంగా చెప్పుకోవచ్చు. జానపదమాతృకనూ సినిమా పాటను ఒకేసారి పాడుకుంటే పోలికలు స్పష్టమవుతాయి.

"మంగమ్మగారి మనవడు" (1984) సినిమాకోసం సి.నారాయణ రెడ్డి రాసిన.. **"శ్రీ సూర్యనారాయణా మేలుకో ... మా చిలకమ్మ బులపాటమూ చూసిపో"** అనే పాటకు జానపద మాతృక.... **"శ్రీ సూర్య నారాయణా మేలుకో హరి సూర్యనారాయణా మేలుకో"** అనే పాట. ఇంకా **"తెల్లవారవచ్చె తెలియక నా సామి"** (చిరంజీవులు),

**"ఎల్లమంద కోటయ్య ఏలుకో ఏలుకో"** (కన్నెవయసు) మొ॥ గీతాలను మేలుకొలుపు గీతాలుగా పేర్కొనవచ్చు.

తాత్త్విక స్పర్శ కల్గిన జానపదగీతాలు కూడా తెలుగు సినిమాల్లో చోటు చేసుకున్నాయి. **"ఇల్లు ఇల్లనియేవు ఇల్లు నాదనియేవు నా ఇల్లు యెక్కడే చిలుకా"** అనే గీతాన్ని "కన్యాశుల్కం" చిత్రంలో ప్రయోగించారు. విశేషమేమిటంటే ఇది గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం నాటకంలోని తత్త్వమే. ఇలాంటి తాత్త్విక స్పర్శ కల్గిన జానపదగేయాలెన్నో మన తెలుగు సినిమాపాటల్లో కన్పిస్తాయి. అది ఏ స్పర్శ కల్గిన అందులో జానపదముద్ర మాతృకంగా పదిలంగా కన్పించడం విశేషంగా చెప్పు కోవచ్చు.

అదే విధంగా సంవాదాలు కూడా జానపదగీతాల్లో దర్శన మిస్తాయి. "మానవుడు దానవుడు" (1972) సినిమాలో ఉషశ్రీ రాసిన **"కొప్పుచూడు కొప్పందం చూడు"** గీతాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ఇంకా **"కోడలా కోడలా కొడుకు పెళ్లామా" "ఒకరికి చేతులిచ్చావ్ ఒకరికి కాళ్లానిచ్చావ్"** మొ॥ సంవాదయోగ్యంగా రాసిన జానపద గీతాలుగా చెప్పుకోవచ్చు.

అలానే "అత్తా ఒకింటి కోడలే" చిత్రం కోసం ఆరుద్ర రాసిన **"మాయదారి కీచులాట మా మధ్య వచ్చింది రాయబారం సెయ్యవే తడికో తడికా".** ఇది జానపద గేయాల్లో ప్రసిద్ధి పొందిన "తడిక రాయబారం"కు సంబంధించినది. భార్యా భర్తల మధ్య చిన్న కీచులాట వస్తుంది ఇంట్లో ఇంకెవ్వరూ లేకపోవడంతో వారి మధ్యనున్న తడికే వాళ్లకు రాయబారి అయింది. ఆ గేయాన్ని కొంత మార్పులతో ఆరుద్ర సినిమాలో ప్రయోగించాడు. ఇలా భార్యాభర్తల సంవాదాలు, బావా మరదళ్ల సంవాదాలు, ఆడపడచుల సంవాదాలు మొ॥వి మనకు జానపద గీతాల్లో కన్పిస్తాయి.

ఇంకా **"కాశీకి పోయాను రామా హరే గంగ తీర్థంబు తెచ్చాను రామా హరే"** అనే "అప్పుచేసి పప్పుకూడు" సినిమాలోని పింగళి నాగేంద్రరావు రాసిన హాస్యస్ఫోరకమైన గీతం, బాబూ (1969) సినిమాలో ఆరుద్ర రాసిన **"చింత చెట్టు చిగురు చూడు, చిన్నదాని పొగరుచూడు"** అనే గీతం, జీవన జ్యోతి సినిమాలో సినారె రాసిన "సిన్ని ఓ సిన్నీ" అనే గీతం, వెలుగునీడలు (1961) సినిమాలో శ్రీశ్రీ రాసిన **"ఓ రంగయో పూలరంగయో"** అనే గీతం, దేవుడు చేసిన పెళ్లి (1975) సినిమాలో దాశరథి రాసిన 'సూదిలో దారం సందులో బేరం' అనే గీతం, శుభోదయం (1980) సినిమాలో వేటూరి సుందరరామ్మూర్తి రాసిన **"కంచికి పోతావ కృష్ణమ్మా"** మొ॥ పాటలన్ని జానపద సౌందర్యాన్ని పొదుగుకుని పరిమళించినవే అని చెప్పవచ్చు. సాధారణంగానే జానపద గీతమనగానే గాన యోగ్యమైనది. అది సినీ జానపద గేయమనగానే అందలి గాన సౌందర్యం మిన్నులందుకుంటుందని చెప్పవచ్చు.




ముత్యాలముగ్గు (1975) సినిమాలో ఆరుద్ర రాసిన **"ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ"** అనే సుప్రసిద్ధ గీతం, ఉయ్యాల జంపాల (1960) సినిమాలోని **"కొండ గాలి తిరిగింది గుండె ఊసులాడింది"** అనే పాటలకు మూలాలు జానపదంలోనే ఉన్నవని ఆరుద్ర స్వయంగా ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. గోరింటాకు (1979) సినిమాలో దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన **"గోరింట పూచింది కొమ్మా లేకుండా మురిపాల అర చేతా మొగ్గా తొడిగింది"** అనే పాటలోని **"మామిడి చిగురెరుపు మంకెన పువ్వెరుపు మణులన్నింటి లోన మాణిక్యం ఎరుపు"** అనే పదబంధాలు, జానపద గీతంలోని **"చిక్కుడు పువ్వెరుపు చిలక ముక్కెరుపు చిగురెరుపు చింతల్లి దోర పండెరుపు"** అనే పంక్తులకు దగ్గర పోలికగా ఉండడం విశేషం. మన మహాకవులెందరి మీదో జానపద ముద్ర ప్రత్యేకంగా ఉందని చెప్పడానికి ఇదొక చిన్న ఉదాహరణ. ఇంకా **"ఆనంద మానంద మాయెనే మా అన్నయ్య పెండ్లి కొడుకాయెనే** (పంతులమ్మ సముద్రాల) వంటి పెళ్లి పాటల్లో 'కాళ్ల గజ్జె కంకాళ్లమ్మ" (ఆదర్శ కుటుంబం – ఆత్రేయ)

"దాగుడుమూతా దండాకోర్" (బందరాముడు– ఆత్రేయ) **"తప్పెట్లోయ్ తాళాలోయ్ దేవునిగుళ్లో బాజాలోయ్** (వాగ్దానం–నార్ల చిరంజీవి) వంటి పిల్లల పాటల్లో జానపద స్పర్శ కన్పిస్తుంది. మన పల్లెల సౌందర్యం, వృత్తులు, వినోదాలూ, వేడుకలూ, తిరునాళ్లు, తీర్థాలు. ఆటపాటలు, గారడీలు మొ॥వి అన్ని కూడా మన సినీ జానపదగీతాల్లో కనిపిస్తాయి. ఇవేకాక హరికథలు, బుర్రకథలు, ఒగ్గుకథలు, యక్షగానాలు, జంగంకథలు, వీధి భాగోతాలు మొ॥ జానపద కళారూపాల దృష్ట్యా కూడా ఎన్నో సినిమా పాటలు కన్పిస్తాయి.

నేటి తరం జానపదగీతాల విషయానికొస్తే 'కుబుసం' సినిమా కోసం గోరేటివెంకన్న రాసిన **"పల్లే కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల"** అనే పాటలో పల్లెల్లో మరుగున పడిపోతున్న వృత్తులగూర్చి,పల్లె ప్రజల దీనావస్థను గూర్చి చెప్పబడింది. ఇంకా సుద్దాల అశోక్ తేజ రాసిన భద్రాచలం సినిమాలోని **"ఇదే నా పల్లెటూరు ఇదే నా తల్లిగారు"** అనే పాటలో పల్లెని తల్లిగా భావించి సాగిలపడి మొక్కిన తీరు కనిపిస్తుంది. పల్లె సౌందర్యం భాసిస్తుంది. ఇంకా "మొండి మొగుడు పెంకి పెళ్లాం" సినిమాలో సాహితి రాసిన

**"లాలు దర్వాజ లష్కర్ బోనాల్ పండగ కొత్తనని రాకపోతివి"** అనే పాట ప్రతి హృదయాన్ని కూడా హుషారెత్తించి చిందులేయిస్తుంది. ఇలాంటి జానపదగీతాలెన్నో మన తెలుగు సినిమాల్లో సందర్భోచితంగా పలికించబడి మన హృదయాల్లో చెరగని ముద్రవేశాయి. విశేషమైన పద సౌందర్యంతో మనల్ని ఆకట్టుకున్నాయి.

ఇలా జానపదగీతాలు తెలుగు కావ్యసాహిత్యంలోనే కాకుండా సిహిత్యంలో కూడా విశేషమైన ముద్ర వేశాయని చెప్పవచ్చు. తెలుగు సినిమాల్లో దర్శనమిచ్చిన మరికొన్ని జానపద గీతాలు ఇక్కడ పరిశీలిద్దాం... 1. కలిసి ఉంటే కలదు సుఖం – కొసరాజు – **ముద్దబంతి పూలు పెట్టి మొగలిరేకుల జడను చుట్టి, జడను చుట్టి హంసలా నడచి వచ్చే చిట్టెమ్మా.. చిట్టెమ్మా.. మా ఇంటికేమి తెచ్చావమ్మా చెప్పమ్మా..**

2.ఏరువాక సాగారో – కొసరాజు రాఘవయ్య – **కల్లా కపటం కానని వాడ లోకం పోకడ తెలియని వాడ, ఏరువాక సాగారో రన్నో చిన్నన్న నీ కష్టమంత తీరునురో రన్నో చిన్నన్న, నవ ధ్యానాలను గంపకెత్తుకొని చద్ది అన్నము మూట గట్టుకొని ముళ్లు గర్రను చేతబట్టుకొని ఇల్లాలునీ వెంటబెట్టుకొని**

3.ఆరుద్ర ..భీష్మ – **హైలో హైలేసా హంస కదా నా పడవ, ఉయ్యాలలూగినది ఊగీస లాడినది హైలో హైలేసా హంస కదా నా పడవ**

4. సి.నారాయణ రెడ్డి.. మంగమ్మ గారి మనవడు – **దంచవే మేనత్త కూతురా.. వడ్లు దంచవే నా గుండెలదరా.. దంచు దంచు బాగా దంచు.. అ...దంచు దంచు బాగా దంచు../ దంచవే మేనత్త కూతురా.. వడ్లు దంచవే నా గుండెలదరా..**

5. సి నా రె.. సూత్ర దారులు – **జోలాజోలమ్మ జేజెల జోల జేజెల జోల, నీలాల కన్నులకు నిత్య మల్లె పూల జోల, నిత్యామల్లె పూల, జోల ల్లోలాలళలల హాయి హాయే, ల్లోలాలాళ్లలల హాయి హాయే, రేపల్లె గోపన్నా రేపు మరచి నిదరొయె, రేపు మరచి నిదరొయె, యాదగిరి నరసన్న ఆదమరచి నిదరొయె, ఆదమరచి నిదరొయె**

6. శ్రీకాంత్ మేక ...కాలేజ్ – **మాయాదారీ మైసమ్మో మైసమ్మా మనం మైసారం పోదామే మైసమ్మా, మాయాదారీ మైసమ్మో మైసమ్మా మనం మైసారం పోదామే మైసమ్మా ఓ మైసమ్మా మైసమ్మా మైసమ్మో మైసమ్మా గాబర బెట్టి**

7.సుద్దాల అశోక్ తేజ.. శ్రావణ మాసం – **సైదులా సైదులా నీ కంచెర జుంపాలు చూసి సైదులా కాపోదనుకున్నా సైదులా, కాపోదనుకున్నా సైదులా, ప్రేమను కాపు కాయలేకున్నావ్ సైదులా.**

8.మహాత్మా ... సిరి వెన్నెల – **నీలపురి గాజుల ఓ నీలవేణి నిల్చుంటే కృష్ణవేణి నువ్వు లంగా వోణి వేసుకొని నడుస్తువుంటే నిలవలేనే బాలామణి నడుము చూస్తే కందిరీగ నడక చూస్తే హంస నడక నిన్ను చూడలేనే బాలికా నీ కళ్ళు చూసి నీ పళ్ళు చూసి కలిగేనమ్మా ఎదో**

9. సర్కస్ సత్తి పండు ..సుద్దాల అశోక్ – **సంక్రాంతి పండుగ వచ్చే..సంబరాలు ముందుకొచ్చే వస్తావా జానకి**

10.పలాస ...ఉత్తరాంధ్ర జానపదం – **నీ పక్కన పద్దాదొలేదో చూడవె, పిల్లో నాది నక్కిలీసు గొలుసు, నీ పక్కన పద్దాదొలేదో చూడవె, పిల్లో నాది నక్కిలీసు గొలుసు, పక్కన పద్దాదొలేదో చూడవె, పిల్లో నాది నక్కిలీసు గొలుసు నీ పక్కన పద్దాదొలేదో చూడవె, పిల్లో నాది నక్కిలీసు గొలుసు**

11.పి రఘు ...కోట బొమ్మాళి – **తరినాన తరినాన తాని తందన నానా తరినాన తరినాన తాని తందన నానా, ఆ లింగ్ లింగ్ లింగ్ లింగిడి లింగ్డి కింద జంగిడి జంగ్డి కింద కుసుమిది కుసుమిది పూరి ఆనంద మల్లెపూలు జల్లంగా శ్రీకాకుళం దండలు హిరమండలం గుర్తులు**

12. ఆర్ ఆర్ ఆర్.. చంద్రబోస్ – **పొలం గట్టు దుమ్ములోన పోట్ల గిత్త దూకినట్టు, పోలేరమ్మ జాతరలో పోతరాజు ఊగినట్టు, కిర్రు సెప్పులేసుకుని కర్రసాము సేసినట్టు, మర్రిసెట్టు నీడలోన కుర్రగుంపు కూడినట్టు, ఎర్రజొన్న రొట్టెలోన మిరప తొక్కు కలిపినట్టు, నా పాట సూడు నా పాట సూడు నా పాట సూడు ..**

ముగింపు : ఈ విధంగా దాదాపు 80 సంవత్సరాలకు పైగా జానపద గేయాలు తెలుగు సినిమాలోకాన్ని ఏలుతున్నాయి. జానపద సాహిత్యంలో ఉండేటువంటి సౌందర్యం, అనుకరణ, ప్రాస, పదలాలిత్యం, జీవన సౌందర్యం, మొదలైనవన్నీ సినీ రూపంలో వెండితెర మీదకి ఎక్కి ప్రేక్షకుల్ని రంజింపజేశాయి. ప్రపంచం రోజురోజుకు గణనీయంగా మార్పులు చెందుతుంది. దీంతోపాటే ప్రేక్షకుల అభిరుచి మారుతుంది. అయినప్పటికీ జానపదం తన ఉనికిని, ఔన్నత్యాన్ని ప్రతి దశాబ్దంలోనూ తెలుగు సినీ లోకంలో నిలుపుకుంటూనే ఉంది. దీనిని బట్టి ఎన్ని భాషలు తెలుగు భాషలోకి వచ్చిన, ఎన్ని మోడ్రన్ పాప్ కల్చర్లు తెలుగు సిని సంగీతంలో ప్రవేశించినప్పటికీ జానపదం మాత్రం ఎప్పటికీ నిరాదరణకు గురికాదని, ఎప్పటికీ నిలిచే ఉంటుందని భవిష్యత్తులోనూ తన ఉనికిని గొప్పగా చాటుతుందని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగు జానపదగేయ సాహిత్యం– డా. బిరుదు రాజు రామరాజు.

2. పగలే వెన్నెల (సినారె సినీగీతాల సంకలనం) యువభారతి ప్రచురణలు.

3. Telugu melody lyrics.com

4. www Google.com

5. telugu lyricstape.com

❖ ❖ ❖ ❖ ❖

# విమర్శకునిగా దేవులపల్లి రామానుజరావు


**ఇమ్మడి మహేందర్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 95056 45706

సాహిత్య విమర్శ అంటే మౌలికంగా ఒక అభిప్రాయమే. సాహిత్య విమర్శకులు మొదట పాఠకులై ఉండాల్సిందే. పాఠకులు విమర్శకులుగా రూపొందడానికి వారు నాలుగు రకాల లక్షణాలు కలిగి ఉండాలి. ఒకటి సహృదయత్వం, రెండు ఆలోచనాపరులై ఉండటం, మూడు సామాజిక బాధ్యత కలిగి ఉండటం, నాలుగు సాహిత్య బాధ్యత కలిగి ఉండటం. ఈ నాలుగు లక్షణాలు ఉన్నప్పుడు వారు విమర్శకులుగా రూపొందుతారు. తెలంగాణ సాహిత్య విమర్శ వికాసంలో, మొత్తంగా తెలుగు సాహిత్య విమర్శ వికాసంలో పై లక్షణాలు కలిగిన విమర్శకులు చాలామంది ఉన్నారు. అందులో దేవులపల్లి రామానుజరావు ఒకరు.

మనిషి సంఘజీవి. సంఘంలోని ప్రతీ చలనం ఎంతో కొంత స్థాయిలో మనుషులపై ప్రభావం చూపుతుంది. ప్రతీ వ్యక్తి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తన చుట్టూ ఉండే కుటుంబం, రాజకీయ పరిస్థితుల ప్రభావానికి లోనవుతాడు. తండ్రి వేంకట చలపతిరావు పట్టణ ప్రముఖులుగా ఉండటంతో తమ ఇంటిలో సాహిత్య, రాజకీయాలకు సంబంధించిన చర్చలు ఎక్కువగా జరిగేవి. ఇవన్నీ దేవులపల్లి రామానుజరావులో సాహిత్య జిజ్ఞాస కలగడానికి కారణం అయ్యాయి. వరంగల్‌లో విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత తెలుగుపై మక్కువతో నిజాం కళాశాలలో బి.ఏ. చదివారు. 1938 నాటి ఓయూ విద్యార్థుల చారిత్రాత్మక వందేమాతరం ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. బహిష్కృతులయ్యారు. నాగపూర్ వెళ్లి అక్కడ న్యాయ శాస్త్రాన్ని చదివారు. అక్కడి జాతీయోద్యమంతో ప్రభావితం అయ్యారు. 1939 – 1940ల నాటికి గోలకొండ పత్రికలో రచయితగా గుర్తింపు తెచ్చుకున్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, మందుముల నరసింగరావు, బుక్కపట్నం రామానుజరావు గార్ల ప్రోత్సాహం లభించింది.

దేవులపల్లి రామానుజరావుకు విస్తృత అధ్యయన ప్రతిభ ఉంది. చారిత్రక దృష్టితో వర్తమాన అంశాలపై అనేక రచనలు చేశారు. సహృదయ పాఠకునిగా, సాంస్కృతికోద్యమ కార్యకర్తగా, వివిధ సంస్థలకు బాధ్యుడిగా విస్తృతంగా పనిచేశారు. తన విమర్శ రచనా వ్యాసంగాన్ని ప్రధానంగా రెండు మార్గాలలో చేశారు. అందులో మొదటిది వ్యాసం, రెండోది ప్రసంగం. సాహిత్య విమర్శకుడిగా సారస్వత నవనీతం, వ్యాస మంజూష, తెనుగు సాహితీ, నా రేడియో ప్రసంగాలు, నా సాహిత్యోపన్యాసాలు, వేగుజుక్కలు, తెనుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం వంటి గ్రంథాలను రచించారు. దేవులపల్లి రామానుజరావు గారు సాహిత్య విమర్శ చరిత్రలో గుర్తించదగ్గ ప్రతిపాదనలు చేశారు. ఈయన సాహిత్య విమర్శను ప్రధానంగా మూడు కోణాలలో అధ్యయనం చేయవచ్చు. ఒకటి ప్రాచీన సాహిత్యం, రెండు ఆధునిక సాహిత్యం, మూడు తెలంగాణ ప్రాంతీయ తెలుగు సాహిత్యం. వీరు తెలంగాణ సాహిత్యం, నవ్య కవిత వికాసానికి సంబంధించిన విషయాలను చారిత్రక దృష్టితో వివేచించారు. ప్రతీ వ్యాసం భిన్నమైన ఆలోచనలను కల్పించింది.

1. దేవులపల్లి రామానుజరావు గారు ప్రాచీన సాహిత్య విమర్శ అధ్యయనానికి "చరిత్ర"ను ఒక ముఖ్య సాధనంగా గుర్తించారు. తెలుగులో కన్నా ముందే కన్నడ భాషలోనే ముందుగా లిఖిత సాహిత్యం వచ్చిందనే అభిప్రాయానికి శాస్త్రీయమైన నిరూపణలు చేశారు. **"క్రీ. శ. 7వ శతాబ్దమున దక్షిణాపథమున తొలుత కర్ణాట ప్రాంతమును, తరువాత తెలుగు దేశమును చాళుక్యుల వశమైనది. ఈ చాళుక్యులు దేశీయులతో కలిసిపోయి వ్యవహరించడానికి భాషలను ప్రోత్సహించి, పరిపోషించిరి. వారి కృషి వలన తొలుత లాభపడిన భాష కన్నడము. అందువలన ఆంధ్ర భూమిని పాలించిన చాళుక్యులు సైతం మొదట కన్నడమునే ప్రోత్సహించిరి. కావునే పంపడు, పొన్నడు మొదలైనవారు జన్మతః తెలుగుదేశపు వారే అయినను కన్నడమున రచనలు సాగించి, ప్రభువుల ఆదరణను ఆర్జించిరి."** (రామానుజ రావు, దేవులపల్లి. తెనుగు సాహితీ. 1991: 02) పంపడు, పొన్నడు లాంటి తెలుగు రచయితలే రాజాశ్రయం కోసం కన్నడంలో రచనలు చేయడాన్ని ఆనాటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వివరించారు. భాష, సంస్కృతుల వికాసానికి రాజ్య సహకారం అనేది చాలా ముఖ్యమైనది అని చరిత్ర నిరూపిస్తూనే ఉన్నది.




తెలుగు సాహిత్య చరిత్రలో 12వ శతాబ్దికి భిన్నమైన స్థానం ఉంది. ఈ కాలం నాటికి సాహిత్యం రాజావసరంగా ఉన్న స్థితి నుండి మత అవసరాలను తీర్చే స్థితికి వచ్చింది. వీరశైవాన్ని ప్రచారం చేయడానికి, అది సామాన్య ప్రజలకు అర్థం చేయించడానికి, సంస్కృతం అవసరం రాదని భావించారు. తెలుగులో సాహిత్య సృష్టికి, దేశీయ మార్గాలను

అన్వేషించారు. నన్నయ కాలపు సాహిత్య భాష వారికి అవసరం రాలేదు. అందుకే శివ కవులు మణి ప్రవాళ శైలిలోకి మొదటి అడుగులు వేశారు. ఈ స్థితిని వివరిస్తూ రామానుజరావు ఇలా ప్రతిపాదించాడు. **"బహుశః మణిప్రవాళ శైలిలో అనగా సంస్కృత విభక్తులతో సంస్కృత పదములను, తెలుగు విభక్తులతో తెలుగు విభక్తులను కలగాపులగం చేసి రూపొందించి వాక్యములు కల రచనా రీతిలో కూడా పద్యములు రచించబడేననుట వృషాధిప శతకమునందలి ఒక పద్యం వల్ల తెలియవచ్చుచున్నది. ఈ వివిధ సమస్యలకు పరిష్కార మార్గమును చూపినవారు 13వ శతాబ్ది నాటి తిక్కన సోమయాజి"** (రామానుజరావు, దేవులపల్లి. తెనుగు సాహితి. 1991: 03) శివ కవులు చేసిన ప్రయత్నాన్ని తెలుగులో సుస్థిరం చేసిన వాడిగా తిక్కనను గుర్తించారు. సాహిత్యాన్ని కేవల సాహిత్యంగా చదవడం కాకుండా లోతైన పరిశోధన, పరిశీలన చేయడం రామానుజరావు గారి విమర్శనా దృక్పథం.

రామానుజరావు గారికి కవిత్రయం అంటే తిక్కన, పోతన, వేమనలు. తిక్కనపై ఎనలేని గౌరవం. ఆంధ్ర మహా భారతాన్ని పూర్తి చేసిన తిక్కన గ్రంథాన్ని ఆనాటి సామాజికార్థిక, రాజకీయ పరిస్థితుల్లోంచి అధ్యయనం చేశాడు. **"ఆ కాలమున తమిళనాడు నుంచి వైష్ణవము, కర్ణాటము నుండి వచ్చిన శైవము ఆంధ్రులయందు ధార్మికముగ చీలికలను కలిగించి కల్లోలమునకు కారణములైనవి. ఈ పరిస్థితి నుండి దేశమును వెలికితీయు తన కృషిని ఆయన హరిహర మూర్తికి అంకితము చేసి ధార్మికంగా ఒక వెలుగు బాటను చూపించగలిగినాడు."** ఆనాడు వైష్ణవ, శైవ మతాలు ప్రజల్లో, సాహిత్యంలో అల్లకల్లోలం సృష్టించాయని రామానుజరావు గారి అభిమతం. ఈ పరిస్థితిని తిక్కన మధ్యేమార్గంగా హరి, హరులను కలుపుతూ తన గ్రంథాన్ని హరిహర మూర్తికి అంకితం ఇవ్వడం ద్వారా ప్రజల్లో సమన్వయాన్ని తీసుకొచ్చే ప్రయత్నాన్ని చేశారని ప్రతిపాదించారు.

2. ఆధునిక సాహిత్యానికి మానవ జీవితమే గీటు రాయి. ఇది సాహిత్య విమర్శలో నూతన విమర్శా పరికరాలను ప్రవేశపెట్టింది. సాహిత్యానికి, సమాజానికి మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది. **"సంఘ జీవితమునకు సాహిత్యమునకు విడదీయరాని బంధము కలదు. ఒక కాలమునందలి నాగరికత ప్రత్యేక స్వరూపమును దాల్చుటకు కారణాలు. ఆ నాగరికతపైన గల యితర ప్రభావములు, ఆ జాతి సాహిత్యమునందు స్పష్టముగా గన్పట్టును. అసాధారణ ప్రతిభాశాలియగు రచయిత స్వీయ వాఙ్మయమునందు నూత్న శకమారంభించి సమకాలిక సాహిత్యమునకు క్రొత్త రుచులు గల్పించుటయు కలదు. కాని యెంతటి శేముషీ సింధువైనను సమకాలిక సంస్కృతి విజ్ఞానము ఆదర్శములు, నైతిక మానసిక విప్లవ శక్తులు మున్నగు వాని ప్రభావము నుండి తప్పించుకొన జాలదు."** (రామానుజరావు, దేవులపల్లి. తెనుగు సాహితి. 1991: 122) పై ప్రతిపాదన ఆధునిక విమర్శా సూత్రం. ఇదే ఆధునికమైన దృష్టి కూడా. "నవ్య కవిత నీరాజనం" అనే అంశానికి సంబంధించి కవి స్రష్ట, నవ యుగోదయం, ఖండ కావ్యములు, అభ్యుదయ యుగము అనే నాలుగు శీర్షికలతో నవ్య కవిత్వ పరిణామ, చారిత్రక క్రమాన్ని అంచనా వేశారు. సాహిత్య చరిత్ర రచనల్లో ఆధునిక కవిత్వ వికాసాన్ని ఎవరు వికాస దృష్టితో అంచనా వేయలేదు. ఈ లోటును ఈ వ్యాసాలను తీర్చాయి.

తెలుగులో ఆధునిక సాహిత్య ప్రారంభంలో వేంకట పార్వతీశ కవుల రచనలు చాలా ప్రసిద్ధమైనవి. **"ఈ వంగ వైష్ణవ గీతమునందలి రక్తి, ప్రేమ ప్రకృతి పురుషుల లీలా విలాస వర్ణనము వేంకట పార్వతీశ కవుల ఏకాంత సేవయందు గోచరము"** అని ప్రతిపాదిస్తాడు. ఈ వ్యాసాల్లో దేవులపల్లి వారి సూక్ష్మ పరిశీలన, అధ్యయన విస్తృతి వ్యక్తం అవుతుంది. అలాగే **"పరాసు విప్లవమునకు ఆంగ్ల వాఙ్మయమునకు గల సంబంధము వంటిదే గాంధీ తత్త్వమునకు, మన నవ్య కవి కుమారులు స్వాతంత్ర్య భావములకు గల సంబంధము. ప్లేటో తత్త్వము ఆంగ్ల భావ కవి కుమారుల నే విధంగా నాకర్షించి వారి ప్రతిభకు దోహద మొనరించినదో అదే విధంగా వైష్ణవ గీతముల భక్తి ప్రేమలు మన కవుల భావనా శక్తిని విజృంభింపజేసినవి."** (రామానుజరావు, దేవులపల్లి. తెనుగు సాహితి. 1991: 131) తెలుగు సాహిత్యంలో వివిధ వాదాల నేపథ్యంలో వచ్చిన సాహిత్యానికి తాత్విక ప్రభావం ఉంటుంది. నవ్య కవిత్వం కూడా అలానే ప్రారంభమైంది. ఒక ప్రాంతంలో ఉండే రాజకీయ భావజాలం ఆ ప్రాంత సాహిత్యంపై పడుతుంది. ఈ ప్రభావమే ప్లేటో తత్త్వం ఆంగ్ల కవులను ఏ విధంగా ఆకర్షించిందో, తెలుగు ప్రాంతంలోని వైష్ణవ భక్తి గీతాలు ఇక్కడి భావ కవుల ఆలోచనలపై ప్రభావం వేసినట్లు తులనాత్మక అధ్యయనం ద్వారా విశ్లేషించారు.

ఆధునిక కవిత్వం జీవితం తాలూకు వాస్తవికతను అందిస్తుంది. ప్రజల ఆకాంక్షలు, సంస్కృతులు మొదలైనవి అన్ని ఆధునిక కవితలో ప్రతిబింబిస్తాయి. **"ఆధునిక కవితయందు కవి హృదయము ప్రతిబింబించును. కవి ఆశయములే, సామాజికములకు పలు విషయములను గురించిన యాతని భావములే నవ్య కవిత యందు గోచరించును"** (రామానుజరావు, దేవులపల్లి. తెనుగు సాహితి. 1991 : 131) ఆధునిక కవిత్వ లక్షణాలను విశ్లేషించాడు. దేవులపల్లి రామానుజరావు గారు నవ్య కవితకు మూడు లక్షణాలు చెప్పారు. 1. ఉత్సాహము 2. ఆవేశము 3. ఉద్రేకము. భావకవి గురించి చెప్తూ ఒక చమత్కారవంతమైన ప్రతిపాదనను చేశారు. **"ఆవేశ సాగరమును నిగ్రహ సహాయమున నీదు వాడు కావ్యకర్త. ఏ సహాయము లేక ఆవేశ మే వైపున నీడ్చిన ఆ వైపునకు దిరుగువాడు భావ కవి."** ఇందులో నవ్య కవిత్వంలోని స్వేచ్ఛా ప్రియత్వాన్ని

దర్శించవచ్చు. **"రసానుభవమున నార్ద్ర హృదయుడైన కవి కుమారుని లేఖిని విన్యాసమే నవ్య కవిత విలాసము"** అని నవ్య కవిత వికాసాన్ని ప్రతిపాదించాడు.

3. దేవులపల్లి రామానుజరావు గారికి తాను పుట్టిన తెలంగాణ ప్రాంతం అంటే విపరీతమైన అభిమానం. తెలంగాణ ప్రాంతాన్ని భాషాపరంగా చూసినప్పుడు తెలంగాణ నేలకు ఉన్న ప్రాంతీయ సాహిత్య ప్రత్యేకతలను సందర్భం వచ్చినప్పుడల్లా చాటి చెప్పారు. 1978 ఫిబ్రవరి నెల్లూరులో ఎర్రన జయంతి ఉత్సవాలలో చేసిన "తెలంగాణ సాహితీ వికాసం" అనే ప్రసంగం ద్వారా తెలంగాణ సాహిత్య వివేచనకు సంబంధించి, అందునా ప్రాంతీయ భాష సాహిత్యాల వికాసంపై నిర్దిష్టమైన అభిప్రాయాలు కలిగి ఉన్నారని అర్థమవుతుంది. ఈ ప్రసంగంలో తెలంగాణ ప్రాంతంలో వచ్చిన రచనలను, వాటి వికాస క్రమాన్ని చెప్పారు.

**"తెలంగాణ ప్రాంతంలో తెలుగు దీపాలు ఎన్నడూ ఆరిపోలేదు. అప్పటి ప్రభుత్వ విధానాల వలన యీ దీపాలు దేదీప్యమానముగా ప్రకాశించక పోవచ్చును. కానీ మిణుకు మిణుకుమని వెలుగుచూనే యుండెను."** అనే అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణ నేల మీద జరిగిన చారిత్రక, వర్తమాన రాజకీయ, సాహిత్యాలను చారిత్రక దృష్టితో రికార్డు చేశారు. అలాగే తెలంగాణపై ఎంత ప్రేమాభిమానాలు ఉన్నప్పటికి ఈయన విశాలాంధ్ర వాదిగానే ఉన్నారు. **"ఈ కలయిక సహజమైనది, సముచితమైనది"** అనే అభిప్రాయంతో ఉన్నారు. అలాగే "తెలంగాణము – ఆంధ్ర సారస్వత వికాసం" అనే వ్యాసంలో ఇక్కడి సాహిత్య ప్రత్యేకతలను చెప్పారు. "ఆంధ్ర సాహిత్యము – తెలంగాణము" అనే వ్యాసం కూడా ఈ కోవకే చెందుతుంది. ఈ విధంగా ఆంధ్ర సాహిత్య చరిత్రలో తెలంగాణ స్థానాన్ని నిరూపించారు. తిక్కన భారతం, పోతన భాగవతం, భాస్కర రామాయణం ఈ మూడు ప్రధాన ఇతిహాసాలు ఇక్కడి నేల నుంచే పురుడు పోసుకున్నాయని ప్రతిపాదించారు.

దేవులపల్లి రామానుజరావు విస్తృతమైన అధ్యయన శీలి. సాహిత్య చరిత్రకు ఎంతో రచనా సంపదను అందించిన వ్యక్తి. ఎంతో మంది తెలుగు సాహిత్య సారస్వత మూర్తులపై వ్యాసాలు రాశారు. కందుకూరి వీరేశలింగం, కొమర్రాజు, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, గురజాడ అప్పారావు, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, కాశీనాథుని నాగేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, కట్టమంచి రామలింగారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, జార్జ్ బెర్నార్డ్ షా, బాపిరాజు, విశ్వనాథ, చలం, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, నన్నయ, అలాగే ప్రాచీన సాహిత్యం, జానపద సాహిత్యం, ఆధునిక సాహిత్యం, ప్రాంతీయ ప్రత్యేక సాహిత్యం, ఉర్దూ భాషపై ప్రత్యేక అధ్యయనం, తెలుగు సాహిత్యానికి ముస్లింలు చేసిన సేవ వంటి విలువైన అంశాలపై వ్యాసాలు రచించారు.

**ఆధార గ్రంథాలు :**

1. చెన్నయ్య, జె. (సంపా) డా. దేవులపల్లి రామానుజరావు గ్రంథావళి, హైదరాబాద్ : తెలంగాణ సారస్వత పరిషత్తు, 2017.
2. రామానుజరావు, దేవులపల్లి, నా సాహిత్యోపన్యాసాలు, హైదరాబాద్ : స్వీయముద్రణ, 1978.
3. రామానుజరావు, దేవులపల్లి. తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం, హైదరాబాద్ : శ్రీ దేవీ పబ్లికేషన్స్, 1983. ఆరవకూర్పు
4. రామానుజరావు, దేవులపల్లి, యాభై సంవత్సరాల జ్ఞాపకాలు, హైదరాబాద్ : ఆంధ్ర సారస్వత పరిషత్తు, 2015. ద్వితీయ ముద్రణ.

---

## నానీలు

**పిప్పి శ్రీలత, ఫోన్ : 9121512082**

కాగితాలల్లో నింపడం
కాదు కవిత్వం
హృదయాలల్లో
నిలపడం

కరోనాతో మొదలు కాదు
సామాజిక దూరం
సమాజంలో స్వార్థంతో
మొదలు

మనిషి
విలువైన సమయం
నేడు సెల్‌ఫోన్
మయం అయింది

నేడు తల్లిదండ్రులు
ఉద్యోగాలకు
అందుకే రేపు పిల్లలు
విదేశాలకు

యువతకు నేడు
సెల్‌ఫోనే ప్రపంచం
మితిమీరితే
ప్రాణాలకే ప్రమాదం

నాడు ఆరుబయట
ఆటపాటలు
నేడు అద్దెగదుల్లో
పుస్తకాల కుస్తీ

విదేశాలల్లో
ఉద్యోగమా?
అయితే
కన్నవాళ్ళకి న్యాయమే?

ప్రభుత్వ ఉద్యోగంకై
పోరాటం సరే
పిల్లలెందుకు
ప్రైవేటుకి అంకితం

పెళ్ళితో ప్రేమబంధం
జత పడింది
కాని పేగు బంధానికే
బీటలు

పంటలు పండిస్తే
పస్తులు
ప్రజల శ్రమను దోచేస్తే
ఆస్తులు

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్య హృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్**
**జయావహం జపం నిత్యమక్షయం పరమం శివమ్"**

**సర్వ మఙ్గల మాఙ్గల్యం సర్వపాప ప్రణాశనమ్**
**చిన్తాశోక ప్రశమన మాయుర్వర్ధన ముత్తమమ్॥**

**6. అక్షయమ్ :** క్షీణించేది కాదు. అవ్యయమైనది. గీతలో "ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహ మవ్యయమ్" అన్నారు వాసుదేవులు. ఆ అర్థాన్ని దీనికి సమన్వయించుకోవాలి. 'యన్నవ్యేతి తదవ్యయమ్' – ఏది ఏ మార్పు పొందకుండా ఏకరూపంగా సర్వదేశకాలాలలో ఉంటుందో అది అవ్యయము. అక్షరాలతో, పదాలతో, వాక్యాలతో ఏర్పడినది అవ్యయమెలా అవుతుంది అని శంకింపరాదు. అది శబ్ద బ్రహ్మాత్మకం కనుక నిరాక్షేపంగా అవ్యయమే. అందుకే అనుపదంలో 'పరమ, శివమ్' అన్న రెండు విశేషణాలు ఉపస్థితములయ్యాయి.


**7. పరమమ్ :** అన్నింటికంటె విశిష్టమైనది. పరమాత్మ అని యీ శబ్దానికి నిఘంటువులు అర్థాన్ని చూపుతున్నాయి. పరమాత్మ ప్రతిపాదకమైన వాక్కుల సముదాయము. ఇంతకుముందు అనుకొన్నట్లుగా, శబ్ద బ్రహ్మాత్మకమై పరమాత్మ అవుతున్నది.


**8. శివమ్ :** జ్ఞాన స్వరూపమైనది. జ్ఞానమంటే బ్రహ్మజ్ఞానమే. ఆదిత్య హృదయం అదే. అయితే అంత మనోదాత్తమైన ఎత్తులో ఉన్నదానిని నేలబారు ప్రయోజనం కోసం ఉపాసించడమేమిటి? అని శంకింపరాదు. రావణజయం అనేది నేలబారు ప్రయోజనం కాదు. అది అజ్ఞానవిచ్ఛేదాత్మకమైనట్టిది. రామాయణం వేదమే అన్న వాక్యాన్ని మనం విస్మరించరాదు.

**9. సర్వమఙ్గల మాఙ్గల్యమ్ :** సకల సుఖాలకు నిలయమైనది. సంసార యాత్ర సుఖంగా సాగాలనే పట్టుదల కలవానికి ఆ సుఖాలన్నింటినీ సమకూర్చేది. పైవాని కంటె ఇది తక్కువ స్థాయికి చెందిన విషయం అనుకోనక్కర లేదు. పరమార్థమే పరమలాభంగా భావించి జీవయాత్ర చేసేవానికి లౌకికసుఖాలు విక్షేపాలను తొలగించి మార్గాన్ని సుగమం చేస్తాయి. ఆవిధంగా ఆదిత్య హృదయం సకలశుభదాయకం అవుతుంది.

(సశేషం) (ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

## సత్సంగం





### సంతోషం

సంతోషమంటే ఏమిటి? అంతా బాగుంది. ఏ విధమైన అసంతృప్తీ లేదన్న భావం. మనమెంతో నిర్విరామంగా, శక్తిమంతంగా దీనికోసం బయటి ప్రపంచంలో వెతుకుతూంటాం. కాని శాశ్వతమైన సంతోషం దేనినుండీ పొందలేం. అయినా, ఆశని వీడం, అన్వేషణని కొనసాగిస్తూనే ఉంటాం.

శ్రీ భగవాన్ సంపదమీద గాని, మనం సాధించిన వాటిమీద గాని సంతోషం ఆధారపడదంటారు. "తన వెలుపల గల శక్తుల వల్లగాని, తన సంపదవల్ల గాని సంతోషం కలుగుతుందని భావిస్తే ఆ సంతోషం అతని సంపద ఎక్కువైన కొద్దీ ఎక్కువవుతూ, తరిగిన కొద్దీ తరిగిపోతూ ఉండాలి కదా! ఇట్లా చూస్తే అతనికి ఏ సంపదా లేనప్పుడు అతని సంతోషమూ పూర్తిగా లేకుండా పోవాలి కదా. కాని వాస్తవిక అనుభవం ఏమిటి? సుషుప్తిలో మనిషికి తన దేహంతో సహా ఏ సంపదా ఉండదు. కాని ఎంతో విచారంగా ఉండటానికి బదులు ఎంతో సంతోషంగా ఉంటాడప్పుడు. అందరికీ సుఖనిద్ర కావాలి కదా. అంటే దీని అర్థమేమిటి? సంతోషమన్నది మనిషిలోనే సహజంగా ఉంది. అది ఏ బయటి పరిస్థితులపైనా ఆధారపడదు. అకళంకమైన ఆనందాన్ని పొందాలంటే ఆత్మజ్ఞానం పొందాలి."

మనం విచారంగా ఉన్నప్పుడు ప్రార్థనలు చేస్తూంటాం. ప్రార్థన చేసేటప్పుడు కాస్సేపైనా ఒక దివ్యశక్తికి అంకితమవుతాం. ఎంతో వినయంగా ఉంటాం. మన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించం. అహంకారం లేనప్పుడు, వ్యక్తిత్వ భావం లేనప్పుడు, మనశ్శాంతి ఉంటుంది. సంతోషముంటుంది. ప్రార్థనవల్ల మనకి కలిగే ప్రశాంతతకి కారణం మనస్సు తాత్కాలికంగానైనా ఆత్మలో లీనమవటం. మాక్స్ హాండల్, "ప్రార్థన స్విచ్ వేయటం వంటిది. అది విద్యుచ్ఛక్తిని ఉత్పాదన చేయదు. విద్యుచ్ఛక్తి ప్రవహించడానికి ఒక దారి ఏర్పరుస్తుంది" అన్నారు. శ్రీ భగవాన్ ప్రపత్తే పరమోత్కృష్టమైన ప్రార్థన అన్నారు. అటువంటి ప్రార్థనలో వ్యక్తిలేడు. చిదానందముంది.. ఆనందవాహినికి అడ్డుతగిలేదల్లా అహంకారమే. పృథక్ భావమే.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 5 41 హైదరాబాద్ మార్చి : 2024

# మహాభారతం: 'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-3

**డా. అట్టెం దత్తయ్య** , సహాయాచార్యులు, ఎస్వీ కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9494715445

మనిషిని పోలిన మనిషి మరొకరు ఉండరు అంటారు. ఉప్పు కప్పురం వలె ఒకే తీరుగా కనిపించిన వారిలో పుణ్య పురుషులు వేరంటారు. 'మనిషి' ఒక అర్థం కాని మహాసముద్రం. మనిషిని అంచన వేయడం అతికష్టం. మనుషుల్లో మృగాళ్ళుంటారు. మనుషుల్లోనే మహనీయులు, మునులు, మాధవులుంటారు. కనిపించే మనిషికి, ప్రవర్తించే తీరుకు సంబంధం ఉండని వారు కూడా ఉంటారు. ఆకారం చూసి అంచన వేయలేం. వారి కోరికలు, వాసనలు, ఆలోచనలను అంచనా వేయడం అసాధ్యం. అందుకే ధర్మరాజు ఇలాంటి ప్రశ్న ఒకటి అడిగాడు.

ప్రశ్న: ***కొన్నిసార్లు మంచి వారు, చెడ్డవారిగాను, చెడ్డవారు మంచివారిగాను కనిపిస్తారు. ఎవరు ఎలాంటివారో గుర్తించి తెలుసుకోవాలంటే సులువైన మార్గం ఏమిటి?*** (శ్రీమదాంధ్ర మహాభారతము. శాంతి. 3-56)

దీనికి సమాధానంగా భీష్ముడు 'పులి - నక్కా సంవాదం'ను తెలియజేసాడు. పూర్వజన్మలో పౌరికుడు అనే రాజు పురిక అనే నగరాన్ని పాలించేవాడు. అతని కర్మానుసారం పూర్వ వాసనలతో నక్కగా జన్మించాడు. కాని ఈ జన్మలో ఆ నక్క జీవహింస చేయకుండా, మాంసం ముట్టుకోకుండా రాలిన పండ్లను తింటూ దీక్షగా జీవనం గడుపుతుంది. ఇది గమనించిన తోటి నక్కలు దానికి మాంసం తినిపించడం కోసం ప్రయత్నించాయి. కాని ఫలితం దక్కలేదు. ఆ నక్క విషయం అడవికి రాజైన పులికి తెలిసింది. పులి నక్క దగరకు వచ్చి దానితో స్నేహం చేయుమంది. సర్వ సుఖాలను అనుభవించుమని కూడా అనింది. నక్క సుఖాలను అనుభవించాలని లేదు. నీకు మంచి చెడులు తెలియజేస్తూ స్నేహితునిగా ఉంటానని అనింది. వారి ఇద్దరి స్నేహాన్ని చూసి వేరే వారు ఓర్వలేక ఏమి చెప్పినా నమ్మకూడదని పులిదగ్గర మాట తీసుకుంది. సంతోషంగా పులికి హితులు చెప్తూ అక్కడే ఉంటుంది. నక్క పులి స్నేహం పూర్వపు సేవకులకు నచ్చలేదు. అవన్నీ కలిసి కుట్రపన్నాయి.

ఒకరోజు పులి తినే మాంసాన్ని మూలభృత్యులు తెలియకుండ ఎత్తుకెళ్ళాయి. దానిని నక్క ఉండే గుహలో పెట్టాయి. పులి తినే ఆహారం లేని విషయాన్ని గమనించిన నక్క పులికి చెప్పింది. పులితో పాటు అందరు వెతుకుతున్నారు. అది నక్క గుహలోనే దొరికింది. అప్పుడు పులికి నక్కమీద నమ్మకం పోయింది. ఇదే అదునుగా చూసుకుని మిగతా సేవకులు నక్క పెద్దమోసగాడు అని ఒకటికి రెండు కలిపి పులికి చెప్పాయి. ఆ మాటలతో నక్కమీద పులికి మరింత కోపం పెరిగింది. నక్కను పట్టుకు వచ్చి చంపుమని



ఆదేశించింది. ఇదంతా పులి తల్లి విన్నది. కుమారుడి దగ్గరకు వచ్చింది. నీతో సేవకులు కల్పించి చెప్పారు. నక్క అట్లాంది కాదు. నీవు సేవకుల మాటలు నమ్మడం తప్పు. సొంత తెలివి ఉండాలి అని తిట్టింది. తల్లి మాటలకు కళ్ళుతెరుచుకుని రాజు నక్కను పిలిచి అక్కున చేర్చుకున్నాడు. కాని నక్క రాజుతో ఉండడానికి ఇష్టపడక దాని దారిలో అది వెళ్ళిపోయింది.

పులి తల్లి చెప్పిన మాటల్లో ఎంతో విలువైన వాక్యాలు కనిపిస్తాయి. అందులో సేవకుల గురించి చెప్తూ **"భృత్యుల్ పుట్టినకోలెను గుటిలతలెట్టెట్టివి సేయ? రకట! యెఱుక గలఁగెనే?"** (శాంతి. 3.69) అంటుంది. సేవకులు పుట్టుకతోనే కుటిలబుద్ధిగలవారై ఉంటారు. రాజు అనేవాడే అది తెలుసుకోవాలి. సేవకులు చెప్పిన మాటలను గుడ్డిగ నమ్మకూడదు. సొంత నిర్ణయం చాలా అవసరం. మనిషి స్వభావం వారికికంటే అధికులను చూస్తే సహించరు.

**"బుద్ధిమంతునివలన దుర్బుద్ధు లధికు**
**వలన హీనులు రూపసివలనఁ గొనటి**
**వా రసూయలు సేయుదు రీరసమున..."** (శాంతి. 3.70)

'బుద్ధిమంతులకు - బుద్ధిహీనులు, గొప్పవారికి - తక్కువవారు, అందమైన వారికి - అందహీనులు ఈర్ష్యతో లేనివి అంటగడతారు' అంటుంది. ఈ విషయాన్ని పోలిన అంశాలు మూల భారతంలో మరిన్ని కనిపిస్తాయి. **"లుబ్ధానాం శుచయో ద్వేష్యాః..."** (శ్రీమహాభారతము. శాంతి. అ111. శ్లో61,62) అనే శ్లోకాలలో **"లోభులకు ఉదారులయందు, పిరికివారికి వీరులందు, మూర్ఖులకు పండితుల యందు, దరిద్రులకు ధనవంతులందు, అధార్మికులకు ధర్మనిష్ఠుల యందు, విరూపులకు అందమైన వారి యందు ద్వేషం ఉంటుంది"** అని తెలియజేస్తారు. కాబట్టి చెప్పుడు మాటలు వినేటప్పుడు బాగా ఆలోచించాలి. కొన్ని సమయాలలో లేదా కొందరి మాటల వల్ల మంచి చెడుగా, చెడు మంచిగా అనిపించే అవకాశం ఉంటుంది.

**"ధర్మ మధర్మము భంగి న**
**ధర్మము ధర్మంబు మాడ్కిఁ దనయా! తోఁచున్**
**నిర్మలమతి నరయవలయు**
**ధార్మికతన కోరువాఁడు తన కేర్పడఁగన్"** (శాంతి. 3.71) ధర్మం అధర్మంగా, అధర్మం ధర్మంగా కూడా అనిపిస్తాయి. నిజమేదో తెలిసే వరకు మంచిమనసుతో ఆలోచించాలి. తెలుసుకోవాలి. తొందరపడి ఎదుటి వారిని అనుమానించి, నిజం తెలిసిన తర్వాత వారిని ఎంత దగ్గరకు తీసిన వారి మధ్యలో సఖ్యత కుదురదు. అందుకని ఎవరైనా...

**"వావిరి మాటలఁ దేలక**
**భావంబునఁ గీడు మేలుఁ బరికించి యస**
**ద్భావుని సద్భావుని నవ**
**నీవర! యేర్పఱుప నెఱుఁగ నేరగ వలయున్"** (శాంతి. 3.81) ధర్మరాజు అడిగిన ప్రశ్నకు సూటి సమాధానం ఈ పద్యం. మనిషిని మంచి, చెడ్డ అని నేరుగ గుర్తుపట్టడం కష్టమే. కాని మాయ మాటలు నమ్మకుండా, మంచి చెడు పరిశీలించి రెండు రకాల వారిని గుర్తించగలగాలి. ఒక మనిషి మరొక మనిషిని కలిసిన అతి తక్కువ కాలంలోనే అతని మీద ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకుంటాడు. ఆ అభిప్రాయం కలగడానికి ఏదో ఒకదానిని ఆధారంగా స్వీకరిస్తాడు. అది ఇతరులు చెప్పిన మాటలు కావచ్చు. అతనితో మొదటిసారి మాట్లాడిన తీరు కావచ్చు. కాని ఈ రెండు తప్పే. ఎందుకంటే ఏ రంగంలో అయినా వారికంటే గొప్పవారి గురించి తక్కువవారు తప్పుడు సమాచారమే ఇస్తారు. కారణం ఈర్ష్య. అసూయ. ఒకేసారి కలిసినంత మాత్రాన వారిని అర్థం చేసుకోవడం కూడా సాధ్యమైన పనికాదు. ఇలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకునే మనుషులే అధికశాతం. ఈ భయానికే చాలామంది first impression is the best impression అని మొదటి సారే నమ్మించడానికి సర్వ తంటాలు పడుతారు. ఇదో రకంగా పదినిమిషాల పెళ్ళిచూపుల వంటిది. ఒకరి మెప్పుకోసం మరొకరు చేసే ప్రయత్నమే ఒక అద్భుత నటన. ఇది అందరికీ తెలిసిందే. అందుకని ఒక వ్యక్తిమీద ఒక అభిప్రాయానికి వచ్చే ముందు చాలా ఆలోచించడం అవసరం. సమయం తీసుకుంటే తప్పా ఇతరుల గురించి సరైన అంచన వేయలేరు. దీనికి మధ్యేమార్గాలు, గీటురాళ్ళు ఉండవు. ఈ సమాధానానికి మూల భారతంలో గల శ్లోకం మరింత బలాన్ని చేకూర్చుతుంది.

**"తస్మాత్ప్రత్యక్షదృష్టోఽపి యుక్తో హ్యర్థః పరీక్షితుమ్ ।**
**పరీక్ష జ్ఞాపయన్నర్థాత్ నపశ్చాత్పరితప్యతే ॥"**
(శ్రీమహాభారతము. శాంతి. 111అ. 67శ్లో)

అనే శ్లోకం ద్వారా **'ప్రత్యక్షంగా చూసినప్పటికీ కూడా మళ్ళీ పరిశీలించుకోవడం ఉచితం. ఈ విధంగా పరీక్షించుకుని నిర్ధారించుకున్న విషయంలో తర్వాత ఎటువంటి పశ్చాత్తాపం పడవల్సిన అవసరం ఉండదు'** అని తెలుస్తుంది.

భారతంలోనే వేరే సందర్భంగా చెప్పినప్పటికి ఈ కథను ఇక్కడ గుర్తు చేసుకోవడం సముచితం. మనుషులు వారి స్వార్థం కోసం ఎలాంటి మాటలు చెప్తారు అనేది ఇందులో గమనించవచ్చు. విదిశాపట్టణంలో ఒక పిల్లవాడు చనిపోయాడు. ఆ శవాన్ని వల్లకాటికి తీసుకునిపోయారు. అక్కడ ఆత్మీయులందరు విపరీతంగ ఏడుస్తూ ఉండిపోయారు. వల్లకాటికి ఒక గద్ద వచ్చింది. **'చీకటి పడుతుంది. ఈ సమయంలో ఇక్కడ ఉండడం మంచిది కాదు. భూతాలూ, పిశాచాలు, రాక్షసులూ పీనుగులను చీల్చుకుని తినడానికి చెలరేగి వస్తాయి. చచ్చిన బిడ్డతో మీరంత పోవడానికి సిద్ధపడుతున్నారా? తొందరగా పీనుగను పాతిపెట్టి వెళ్ళండి'** అని గద్ద అనింది. అది నిజమే కావచ్చు అనుకుని వారంతా శవాన్ని పాతిపెట్టి వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యారు. అంతలోనే అక్కడికి ఒక నక్క వచ్చింది. అది **'గద్ద మాటలకు భయపడకండి. ఇంత చక్కని పిల్లవాడిని పాతిపెట్టి పోవడానికి మీకు మనసు ఎలా వస్తుంది. మీ కడుపుశోకం తీరేదాక ఇక్కడే ఇంకా కొద్దిసేపు ఏడవండి. అంతలో బ్రహ్మ దయతలిచి ఈ పిల్లవాడికి తిరిగి ఊపిరి పోస్తాడు కావచ్చు'** అని చెప్పింది. వారందరికి కొంత ఆశ పుట్టింది. నక్క చెప్పినట్లు చేయడానికి సిద్ధపడ్డారు. అది చూసిన గద్ద **'ఈ మందమతి నక్కమాటలు వినవచ్చా? పోయిన ప్రాణాలు తిరిగి వస్తాయా? పిల్లవాడు ప్రాణాలతో తిరిగి వస్తాడనే ఆశలు పెట్టుకోకండి. దానధర్మాలు చేసి ఆ పిల్లవాడికి పుణ్యగతులు కలిగించండి'** అని చెప్పింది. మళ్ళీ నక్క ఆ శవపు బంధువులతో **'గద్ద మాటలు వినకండి. అది రాతి గుండెది. ఇలాంటి బిడ్డను చూస్తూ వదిలిపెట్టడం మీకు ఎలా ఒప్పుతుంది'** అని అనింది.

గద్దకు కోపమొచ్చింది. **'నాకు పదిహేనువందల సంవత్సరాలు ఉంటాయి. ఇన్నేళ్ళలోను ఎప్పుడూ, పోయినవాడు-పసివాడుకాని, పెద్దవాడు కాని, పండుముసలి కాని మళ్ళీ తిరిగిరావడం చూడలేదు. చావగానే మరో గర్భంలోకి వెళ్ళిపోతాడు జీవుడు. ఈ జిత్తులమారి నక్కకు ఏం తెలుసు? పీనుగు బ్రతుకుతుందంటే ఎవరైనా నవ్విపోరా?'** అనింది. అది నిజమే అనుకుని వారు అక్కడి నుండి వెళ్లడానికి నిశ్చయించుకున్నారు.

అయినా నక్క వదలలేదు. **'ఏ సిద్ధుడో, గంధర్వుడో, మరే దేవుడో మీ మొర విని, జాలిపడి, మీ పిల్లాణ్ణి బ్రతికిస్తే మేలేకదా? ఎందుకు వెళ్ళిపోతారు?'** అంటూ అడ్డుకొంది. పూర్వం తిరిగి బ్రతికించిన వారిని గురించి, బ్రతికిన వారి గురించి కూడా చెప్పింది. అదీ నిజమే అనుకుంటూ వారు వెనక్కు వచ్చారు. గుండెలవిసేలా ఏడ్చారు. వారి శోకానికి శివుడు ప్రత్యక్షం అయ్యాడు. బాలుడి ప్రాణాలు తిరిగి పోసాడు. వారందరు బాలుడిని తీసుకుని అక్కడి నుండి వెళ్లిపోయారు. ఆ కరుణామయుడు ఆ గద్ద, నక్కలకు కూడా ఆకలి లేకుండా వరమిచ్చి కనబడకుండా పోయాడు.

ఇక్కడ గద్ద, నక్క రెండు ఆకలితో ఉన్నాయి. ఆ శవాన్ని తినడం కోసం మహా ఆరాటంగా ఉన్నాయి. రెండు కూడా వాటి స్వార్థం కోసమే సంభాషస్తున్నాయి. నీతులు, వేదాంతాలు చెప్తున్నాయి. అయితే చీకటి పడితే గద్ద ఉండలేదు. తినలేదు. కాబట్టి సూర్యాస్తమయానికి ముందే వారు వెళితే తినాలి అని దాని ప్రయత్నం. రాత్రి అయితే నక్కకు మేలైన సమయం. కాబట్టి అప్పటి వరకు వారిని పోకుండా చూస్తే పూర్తిగా అదే తినవచ్చునని దాని కపట ఆలోచనలు. స్వార్థం కోసం ఎంతటి పరిస్థితులలో అయినా నమ్మించడానికి ప్రయత్నించే వారు ఉంటారు. ఆలోచనతో కపటత్వాన్ని కనిపెడితే తప్పా మోసానికి గురికాకుండా మనిషి ఉండలేడు. **"కపటుల నేర్పు తెరువు లెఱింగి కొనుటకును నుదాహరణంబైన గృధ్ర జంబుకోపాఖ్యానంబు..."** (శ్రీమదాంధ్రమహాభారతము. శాంతి.3.381) ఈ విషయాన్ని మూల భారతం –

**"స్వకార్య బద్ధకక్షౌ తౌ రాజన్గృధ్రోఽథ జంబుకః।**
**క్షుత్పిపాసాపరిశ్రాంతా శాస్త్రమాలంబ్య జల్పతః॥"** (శ్రీమహాభారతము. శాంతి.అ153.శ్లో107) ఈ శ్లోకం ద్వారా **"తమ కోరిక నెరవేర్చుకోవడానికి, ఆకలి దప్పులు తీర్చుకోవడం కోసం శాస్త్రాలను కూడా ఆధారం చేసుకుని నమ్మించే ప్రయత్నం చేస్తారు"** అని సూచన చేస్తుంది. వ్యక్తులను గుర్తించడం, వారి మాటలను నమ్మడం అనేది అతి చాతుర్యంతో చేయవల్సిన పని. మాటలు కొన్ని వినడానికి వేదాంతాలుగా ఉన్నా వాటి వెనుక కపటం, స్వార్థం, మోసం, వంచన ఉంటాయని గమనించాల్సిన అవసరం ఉంది. అందుకే మంచి, చెడ్డవార్లను గుర్తించడం అనేది అతని పరిశీలన మీదనే ఆధార పడి ఉంటుంది.

❖ ❖ ❖ ❖ ❖

మనిషి సంఘజీవి. అందరితో కలిసి ఉండాలి. కొందరిని నమ్మి జీవనం సాగించాలి. ఒంటరిగా ఉండే మనిషి మనుగడ సాగించలేడు. అయితే ఎవరిని నమ్మాలి? ఎంతగా నమ్మాలి? అనేది మాత్రం చాలా మందికి వచ్చే సంశయమే. ఇందులో ధనం, విద్య, అర్థం, కులం, హోదా, ప్రాంతం వంటివి అన్నీ భాగస్వామ్యం అవుతాయి. ఒక్కసారి చిన్న తేడవచ్చిన ఇంట్లో భార్యను భర్త, భర్తను భార్యకూడా నమ్మరు. ఇట్లాంటి సమాజంలో తియ్యగా మాట్లాడేవారిని నమ్మాలా? ఉన్నది ఉన్నట్లుగా చెప్పేవారిని నమ్మాలా? ఎప్పుడో తెలియకుండా చిన్న వైరం ఏర్పడితే వారిని జీవితాంతం నమ్మకుండానే ఉండాలా? ఇట్లాంటి సంశయాలను తీర్చే ప్రశ్ననే ధర్మరాజు భీష్ముడిని అడిగాడు.

ప్రశ్న : **ఎవరిని నమ్మకపోతే మనస్సుకు ఊరట కలుగదు. నమ్మితే కష్టాలు సంభవిస్తాయి. నమ్మడం, నమ్మకపోవడంలో ఏది ఆచరించాలి?** (శ్రీమదాంధ్ర మహాభారతము.శాంతి.3.244)

భీష్ముడు దీనికి సమాధానంగా **'బ్రహ్మదత్తుడు - పూజని (గోరువంక) సంవాదం'** వినిపిస్తాడు. ఒక పట్టణానికి రాజు బ్రహ్మదత్తుడు. ఆ పట్టణంలో పూజని అనే గోరువంక ఉండేది. గొప్ప మాటకారి. రాజుతో మంచి స్నేహ సంబంధాలున్నాయి. దానికి ఒక సంతానం ఉండేది. రాజు కొడుకు గోరువంక పిల్ల ఇద్దరు కలిసి ఆడుకునేవారు. గోరువంక తీసుకువచ్చే మంచి పళ్ళను రాజు కొడుకుకు కూడా పెట్టేది. కాని ఒకరోజు ఆ పిల్లవాడు ఆ గోరువంక పిల్ల తలను పగలకొట్టి చంపేసాడు. తల్లిపిట్ట వచ్చి చూసి విలవిల లాడింది. వాపోయింది. రాజులకు స్నేహం, జాలి, కృతజ్ఞత ఉండవు. గర్వంగలవారు, కఠినులు, నమ్మశక్యం కానివారని దూషించింది. ఈ పగ తీర్చుకోవడానికి గోరువంక రాజకుమారుడి రెండు కళ్ళు ఊడపీక్కుని, వేగంగా ఆకాశంలోకి ఎగిరిపోయింది. ఆకాశంలో నుండి బ్రహ్మదత్తుడుకి వినపడే విధంగా జరిగింది చెప్పింది. అయినప్పటికీ ఆ రాజు మనం ముందువలనే స్నేహంగా కలిసి ఉందాం అంటాడు. దానికి గోరువంక అంగీకరించదు. వారి ఇద్దరి మధ్యలో ఏర్పడిన పగ వారికి ఎప్పటికైనా హాని తలపెడుతుందని గమనించింది. ఆ విషయాన్ని కొంత వివరంగా కూడా తెలియజేస్తుంది.

పగ అనేది అయిదు విధాలుగా పుడుతుంది. **"వినుము! నేల దోఁచికొనినను దాయాదులైన..."** (శ్రీమదాంధ్ర మహాభారతం. శాంతి.3.257) అనే పద్యంలో ఆ ఐదు విధానాలను తెలియజేసాడు. 1. భూమి దురాక్రమణం వల్ల 2. దాయాదుల వల్ల 3. ఆడవారి వల్ల, 4. మాటమాట పెరగడం వల్ల 5. అడ్డూ ఆపూ లేని చెడు తలపెట్టటం వల్ల. ఇలా ఏ విధంగా అయినా ఒక్కసారి పగ పుట్టిందంటే అది ఒక పట్టాన పోదు. చెట్టులో దాగి ఉండే నిప్పువలె మనసులో దాగి ఉంటుంది. మాటల మాయలో పడి పగను మర్చిపోవచ్చు. కాని దాని వల్ల చావు, కలత, కీడు ఏదైనా జరిగే అవకాశం ఉంది. నీతిశాస్త్రం సొంతవారినే నమ్మకూడదు అంటుంది. పగ ఏర్పడిన తర్వాత ఇతరులను నమ్మడం మూర్ఖత్వం.

**"తెగఁ దీర్పక తగ నార్పక**
**తెగటార్పక కడమ కొంత ద్రిక్కఁగ నున్నన్**
**జగతీశ! యప్పునగ్నియుఁ**
**బగయును గడుఁ బెరుఁగుఁగీడు వాటిల్లు దుదిన్"** (శ్రీమదాంధ్ర మహాభారతం. శాంతి.3.257)

పై పద్యం ప్రకారం **'అప్పు, అగ్ని, పగ వీటిని సమూలంగా తొలగించాలి. ఈ మూడు ఏమాత్రం మిగిలి ఉన్న తెలియకుండా చేతికి అందనంతగా పెరిగిపోతాయి. అంతే కాదు చివరకు కీడును తెచ్చిపెడుతాయి.'** ఇక్కడ పగను అగ్నితో, అప్పుతో పోల్చడం వల్ల దాని తీవ్రత ఎంతమేరకు ఉంటుందనే విషయం తెలిసిస్తుంది. ఈ పగను గురించి భారతంలోనే మరోచోట **"పగయ కలిగినేని పాముున్న యింటిలో నున్నయట్లు..."** (శ్రీమదాంధ్రమహాభారతం.ఉ


సెల్ :9908059234



## నిరంతరం అభ్యసించు

డాక్టర్ మహమ్మద్ హసన్, ఫోన్ : 990 805 9234

ప్రపంచమే ఉత్తమ గ్రంథం
కాలమే ఉత్తమ గురువు
ప్రకృతే పాఠ్య /విద్యా ప్రణాళిక
జ్ఞానం సూర్యుడిలా ప్రకాశించడానికి
అజ్ఞానం మేఘంలా విచ్చుకోవడానికి
వ్యక్తిత్వం సమగ్రంగా వికసించడానికి
సాటి మనిషి పట్ల సోదర భావం ప్రగాఢంగా అల్లుకోవడానికి
సంఘ జీవనం
మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లడానికి
"సాధన, అభ్యాసం" "తపస్సులా" నిరంతరం సాగాలి..!
ఊపిరి పోసుకున్న దశ నుంచి ఊపిరి వదిలే వరకు
ప్రతి మనిషి నిత్య విద్యార్థి కావాలి నిరంతరం
"అభ్యాసం" చేయాలి
శిల శిల్పంగా మారినట్లు ,మోడు పుష్పించినట్లు..!
మనిషి,మనీషిగా "పరివర్తన" చెందాలి..
ప్రకృతే విలువైన పాఠశాల..!
కొండలు, కోనలు,చెట్టూ , పుట్టా, నదీ నదాలు
అద్భుతమైన పాఠాలు..!
"అధ్యయనమే అజ్ఞానాంధకారాన్ని తొలగించగలదు"..!
అనంతమైన విశ్వ రహస్యాల్ని తెలుసుకోవడానికి ఉపకరించేది
"అభ్యసనమే"..
నిన్ను నీవు దర్శించుకోవాలంటే..!
నువ్వొక జ్ఞానిలా మారాలంటే "అభ్యసనం" ఆవశ్యకం..!
కిరాతుడు వాల్మీకిగా, వేమన యోగిగా,
సిద్ధార్థుడు బుద్ధుడిగా, పరివర్తన చెందినట్లు..!
"నిరంతరం అభ్యసించు"...!




ద్యోగ. 3.20) అనే పద్యం **'పగ ఏర్పడితే పాముున్న ఇంట్లో కాపురమున్నట్లు. ఎప్పుడు భయంభయంగా ఆందోళనతోనే ఉండాలి. గాని క్షణమాత్రం కూడా నిమ్మళంగా ఉండలేరు. కాబట్టి పగ కలిగి ఉండడం మంచింది కాదంటారు'.** దీని తర్వాత పద్యంలోనే పగ పరిహారం కూడా తెలియజేస్తాడు. శత్రుత్వాన్ని అంతమొందించడం శుభదాయకం. అది మంచి పని. పగతో పగ సమసిపోదు. వైరంతో బాధ కలిగించిన వాడిని ఉపేక్షించడం సాధ్యం కాదు. పోని తెగించి పగను లేకుండా చేద్దామనుకుంటే ఇంకా కొంత దిగజారాల్సి వస్తుంది. ఏ విధంగా ఆలోచించినా పగ వలన ప్రమాదమే ఏ మాత్రం ప్రయోజనం కనిపించదు. పగకు అసలైన పరిహారం మృదుత్వం. ఈ విషయాన్ని –

**"మార్దవమున మృదువు మర్దింపగా వచ్చు**
**మార్దవమున పర విమర్దనంబుఁ**
**జెల్లు మార్దవమునఁ జెల్లనియది లేదు**
**గాన మృదువ తలఁప ఖరము సువ్వె"** (శ్రీమదాంధ్రమహాభారతం. ఉద్యోగ. 3.277) **'మృదుత్వంతో మెత్తని వాడిని తుడిచివేయవచ్చు. మృదుత్వంతో శత్రువులను చంపవచ్చు. మృదుత్వంతో సాధించరానిదంటూ ఉండదు. కాబట్టి మృదుత్వమే అన్నిటిని మించి వాడియైనది సుమా'** అంటాడు భీష్ముడు. మొత్తంగా ఎవరిని నమ్మినా తగినంతగానే నమ్మాలి. ప్రత్యేకించి పగ ఏర్పడిన వారిని ఏ మాత్రం నమ్మకూడదు. ఇలాంటి విషయాలు భీష్ముడు తెలిపిన చిన్నచిన్న కథలు, మానవ, పశుపక్ష్యాది పాత్రల ద్వారా గొప్ప సందేశాన్ని అందిచాయి.

**ఆధార గ్రంథాలు** :

1. సుబ్రహ్మణ్యం, జి.వి. సంపా. **'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము'** (అన్ని పర్వాలు, 15 సంపుటాలు). 2014. తిరుపతి: తి.తి.దే.

2. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. శ్రీనివాసులు, సూరం. సంపా. **'శ్రీమహాభారతము'** (అన్ని పర్వాలు, 7 సంపుటాలు). 2018. గోరఖ్‌పూర్: గీతాప్రెస్.

3. హనుమంతరాయ శర్మ, బలభద్రపాత్రుని. **'మహాభారత విమర్శనము'** (రెండు సంపుటాలు). 1996. గుంటూరు: భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

4. అప్పలస్వామి, పురిపండా. **'వ్యావహారికాంధ్ర మహాభారతం'** (శాంతి పర్వము). 1976. రాజమండ్రి: ప్రాచీన గ్రంథావళి.

5. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. **'భీష్ముడు చెప్పిన రాజనీతి కథలు'** 1986. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.

6. వెంకటరత్నం, గుంజి. **'మహాభారత విజ్ఞాన సర్వస్వం'** 2021. హైదరాబాద్: ఎమెస్కో.


❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 5  UGC Care List Approved Journal
హైదరాబాద్ మార్చి : 2024

# సంపత్ కుమార్ కవిత్వం – మానవీయ దృక్పథం

**బి.వి.ఎస్. గౌతమ,** మద్రాసు విశ్వవిద్యాలయం, ఫోన్ : 9652241261

మానవత్వం అంటే మానవ తత్త్వం. మనిషి మనిషి గుణాలను కలిగి ఉండడం. అంటే దయాదాక్షిణ్యాలు, కరుణ, ప్రేమ మొదలైన సహజ గుణాలను కలిగి ఉండడం. ఈ విశ్వంలో జంతువులు, పక్షులు, మనుషులు, పురుగులు... ఇలా వాటిలోని భేదాలతో కలిపి కోట్ల జీవరాశులు ఉన్నాయి. వాటిలో మనిషి అనే జీవి మాత్రమే ఉత్కృష్టమైనది. ఎందుకంటే ప్రతి జీవి తన జీవలక్షణాలను అనుసరించి మాత్రమే జీవించగలుగుతుంది. అంతకు మించి వేరే ఏ లక్షణాన్ని తను అనుకరించలేదు. అనుసరించలేదు. కానీ మనిషి మాత్రం ఇతర ఏ జీవి చేయనట్టు ఆలోచించగలడు, స్పందించగలడు, ఇతర జీవులను అనుకరించగలడు, వాటిని తన వశం చేసుకోగలడు. అలాగే ఇతర జీవులకు లేని భావోద్వేగాలు, మాటలాడడం మొదలైనవి మనిషికి ఉన్న గొప్ప లక్షణాలు. తనకు ఉన్న బుద్ధిని ఉపయోగించి నిర్ణయాలను కూడా తీసుకోగలడు. ఇలా మనిషి చేసినట్టు ఈ విశ్వంలో ఏ జీవి చేయదు. అయితే, ముందు చెప్పినట్టు ప్రతి జీవి తన లక్షణాలకు నూటికి నూరు శాతం అనుగుణంగా వర్తిస్తాయి.




తెలుగుకవులు కొందరు సమాజం పట్ల బాధ్యతతో, మనిషిని మనిషిగా మార్చేందుకు, కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకు అనేక ప్రక్రియల్లో కవిత్వం రాశారు. తదనంతర కాలంలో దానిని మానవతావాదంగా మార్చారు. మానవత్వం అంటే విచక్షణ లేని దయ, జాలి చూపించడం కాదు. సహేతుక దృష్టితో పీడిత ప్రజల బాధలను తొలగించడానికి మార్గాలను అన్వేషించారు. అన్యాయం, అజ్ఞానం, దుర్మార్గం వంటి వాటిని ఖండిస్తూ కులం, మతం, ప్రాంతం, రాజకీయం, లింగం మొదలైన విభేదాలతో మనిషిత్వాన్ని మరచిపోయిన వారికి, వాటికి అతీతంగా మనిషి ఎలా ఉండాలో తమ వ్యక్తిత్వం ద్వారా ఋజువు చేస్తూ, తమ కవిత్వం ద్వారా ప్రేరణ కలిగిస్తూ వచ్చారు. సమాజం వేదికగా మానవాభివృద్ధే వారి ధ్యేయం అయ్యింది. అలాంటి కవులు తెలుగు సాహిత్యంలో చాలమంది ఉన్నారు. వారిలో మాడభూషి సంపత్ కుమార్ గారు కూడా ఉండడం గొప్పవిశేషం.

**"మనిషి"** అనే కవితలో నేడు మనిషి ఎలా ఉన్నాడో అద్భుతంగా వివరించారు. దానిని బట్టి మనిషి ఎలా ఉండాలో అర్థమవుతుంది.

**"యుద్ధాన్ని గురించి భయం లేదు**
**మరణాన్ని గురించి భయం లేదు**
**క్రూర మృగాల గురించి**
**విషనాగుల గురించి**
**సునామీ గురించి**
**ఉప్పొంగే నదుల గురించి భయంలేదు**
**నా భయమంతా మనుషుల గురించే"** (శత్రువు. 2015:64)

అంటూ ఒక మనిషిని చూసి మరో మనిషి భయపడే స్థితిని మనిషి ఎలా ఉన్నాడో, ఎలా ఉండాలో 1997 లోనే వివరించారు. ఇక ఇప్పుడు ఆ మనిషి ఎలా మారాడో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అంటే సమాజంలో మనసున్న మనుషులు లేరని చెప్పడం కవి ఉద్దేశం. కాబట్టి మనిషి అన్నవాడికి మంచి మనసు ఉండాలి. అదే మానవత్వం అనేది కవి ఉద్దేశం.

**కన్నతల్లి దుఃస్థితి :**

ఏదైనా ఇంటి నుండే మొదలవ్వాలని అంటారు పెద్దలు. దానికి నిదర్శనమే సంపత్ కుమార్ గారు తల్లుల గురించి రాసిన కవితలు. ఈ విశ్వంలో ప్రతి జీవరాశి పుట్టుకకు, మనుగడకు కారణభూతమైన వాటిలో తల్లిది మొదటిస్థానమే. నవమాసాలు మోసి, కని, పెంచి, పెద్ద చేసి, బిడ్డ అభివృద్ధిలో అనేక రకాల పాత్రలను పోషించి, బిడ్డ ఉన్నతికి దోహదం చేస్తుంది తల్లి. బిడ్డ ప్రతి పనిని వెనకేసుకు వచ్చే ఏకైన వ్యక్తి అమ్మ మాత్రమే. అలాంటి తల్లిది కుటుంబంలో చాలా కీలకమైన పాత్ర. తల్లి లేని పిల్లలు ఉన్న కుటుంబాలకు, తల్లి ఉన్న కుటుంబాలకు చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో తల్లికి గొప్పస్థానం కల్పించారు

**"ఒక తల్లి**
**పదిమంది పిల్లల్ని**
**కని పెంచి పోషిస్తుంది!**
**పది మంది**
**పిల్లలు ఒక తల్లిని పోషించలేకపోతున్నారు!**
**రాను రాను మనుషులు బలహీనపడిపోతున్నారు!**

**అందుకే తల్లి**
**ఇప్పుడు ఒకే బిడ్డతో సరిపెట్టుకొంటోంది" (మూడో. 2017:15)**

పై కవితలో తల్లి పాత్ర ఎంత గొప్పదో వివరించారు కవి. ఇప్పుడంటే ఒకరు లేదా ఇద్దరుతో సరిపెట్టుకుంటున్నారు కానీ పూర్వం ఒక్కో తల్లి పదిమంది సంతానాన్ని కనేది. తనకు కలిగిన పది మందిని తారతమ్యం లేకుండా పెంచేది. సమానత్వంతో పాటు, సమానధర్మాన్ని పాటిస్తూ బిడ్డలను పోషించేది. ఆ కాలంలో తల్లులు 1:10 నిష్పత్తితో ఏ కష్టం కలగకుండా కంటికి రెప్పలాగా పిల్లలను కాపాడుకునేవారు. ఆ పిల్లలు ప్రయోజకులైన తరువాత 10:1 నిష్పత్తిలో అంటే పదిమంది కలిపి ఒక తల్లిని కూడా చుసుకోలేక పోతున్నారని, లక్షలు సంపాదిస్తున్నా వృద్ధాశ్రమాలలో వదులుతున్నారని, అందుకే ఇప్పటి తల్లి ఒక బిడ్డతోనే సరిపెట్టుకుంటుందని కవి వర్ణించారు. ప్రతి ఒక్కరు మానవీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని, తల్లిదండ్రులను సరిగా చూసుకోవడంతో ఇంటి దగ్గర నుండే మొదలవ్వాలని పై కవితలో హితోపదేశం చేశారు. అమ్మలను ఆదరించాలనే ప్రథమ కర్తవ్యాన్ని, మానవత్వ దృక్పథాన్ని ప్రతి ఒకరూ కలిగి ఉండాలనే విషయాన్ని ఈ కవిత ద్వారా తెలియజేశారు.

**రైతుల జీవితం :**

భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. ఇప్పుడు వ్యాపార, వాణిజ్య రంగాలలో కుడా కొంత ప్రభావాన్ని చూపుతున్నప్పటికీ 41.49 శాతం అంటే భారతదేశ జనాభాలో దాదాపు సగం ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. ఆహార, ఆహారేతరమైన పంటలను పండిస్తున్నారు. కొందరు రైతులు ఇప్పటికీ వర్షాధారిత వ్యవసాయాన్నే నమ్ముకుని జీవనాన్ని సాగిస్తున్నారు. అలాంటి దశలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పంటకు నష్టం వాటిల్లి రైతులు నష్టపోతున్నారు. నష్టాన్ని భరించలేని సన్నకారు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. భారతదేశంలో 2021 సంవత్సరంలోనే (డిసెంబర్ నాటికి) 10881 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అలాంటి రైతుల పక్షాన కవిత్వంతో అండగా నిలబడిన కవులలో సంపత్ కుమార్ గారు కుడా అగ్రగణ్యులు. **"రైతు ఆత్మకథ"** అనే కవితలో రైతు గొప్పతనాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు కవి.

**"రైతు ఆత్మకథ**
**వాడి స్వేదం నుండి జాలువారుతుంది**
**మట్టే వాడికి వస్తువు**
**ఒళ్ళంతా మట్టి పూసుకొని" (వికారి. 2019:60)**

అంటూ రైతు జీవితాన్ని అద్భుతంగా వర్ణించారు. సమాజంలో మోసపోవడమే తప్ప మోసం చేయడం చేతకాని వృత్తికారునిగా రైతుని చిత్రించారు కవి. సంఘాలు పెట్టుకోవడం చేతకాదు, సంఘటితం కాలేదు, సంఘానికి ద్రోహం చెయ్యలేదు అని రైతుని ఒక పవిత్రమైన వృత్తికారునిగా వర్ణించారు. తాను పడ్డ కష్టమంతా పరోపకారం అనుకుంటాడని, అర్థం కోసం, స్వార్థం కోసం బతకని, బతక నేర్వని వ్యక్తిగా రైతును, అతని గొప్పతనాన్ని ఆకాశంలో నిలబెట్టారు కవి.

"రైతే కూలి" అనే కవితలో–

**ఎవరో ఇచ్చిన**
**విత్తనాలు విత్తాలి**
**ఎవడో చెప్పిన**
**ఎరువు వెయ్యాలి**
**..................**
**అప్పు కోసం పడిగాపులు కాస్తోంది**
**వేలకోట్లు ఎగ్గొట్టిన వాడి ముందు మోకరిల్లుతున్న బ్యాంకులు** (చివరకు. 2016: 80)

అని కవి తన బాధని వ్యక్తం చేశారు.

**సాటివారి ఎదుగుదల పట్ల అసూయ :**

ప్రతి మనిషి ఏదో ఒక రంగంలో అభివృద్ధిని సాధించడానికి ప్రయత్నం చేసి సఫలీకృతులు కావడం తెలిసిన విషయమే. అలా ప్రతి వ్యక్తి తాను ఎంచుకున్న రంగంలో అభివృద్ధి సాధిస్తే తద్వారా దేశం అభివృద్ధి సాధిస్తుంది. జాతీయ ఆదాయంలో మార్పు వచ్చి, దేశం అభివృద్ధి పథంలో ఉంటుంది. విద్య, ఆరోగ్యం విషయంలో ఆ దేశప్రజలు సరైన మేళ్లను పొందగలుగుతారు. కానీ భారతదేశం లాంటి దేశాలలో కొంతమంది తాము బాగుపడకున్నా పర్వాలేదు కానీ ఎదుటివాళ్ళు మాత్రం బాగుపడకూడదనే ఆలోచనతో ఉంటారు. ఒకవేళ ఎవరైనా ఎదుగుతుంటే ఓర్వలేక వారిని ఎలా దిగజార్చాలా అని ఆలోచిస్తారు. వారిని ఏదో రకంగా కిందకు లాగేస్తారు. అలాంటి వారిని గురించి కళ్ళకు కట్టినట్లు కింద కవితలో వర్ణించారు కవి.

**"కింద ఉంటే**
**పైవాణ్ణి కాళ్ళు పట్టి లాగేస్తాడు!**
**పైనుంటే కిందవాణ్ణి కాళ్ళతో అణగదొక్కేస్తాడు!**
**వాడు అభివృద్ధిలోకి రావడానికి అవతలివాడి అంతుచూస్తాడు!**
**రాత్రికి రాత్రి**
**భూమ్యాకాశాలను తారుమారు చేస్తానంటాడు**
**ఆకాశాన్ని సులభంగా కిందికి లాగుతాడు!**
**మరి భూమిని?"**

కొంతమంది పతనావస్థలో ఉంటూ పురోగతిని పొందే వారిని కిందికి లాగడానికి ప్రయత్నం చేస్తారు. అలా నష్టపోయినవారు పైస్థాయికి వెళ్ళిన తరువాత కింద ఉన్న వ్యక్తులకు చేయూత నివ్వడానికి బదులు పైకి ఎదగనీయకుండా అణగద్రొక్కడానికి ప్రయత్నిస్తారు. అదే దేశంలో ఉన్న దుర్మార్గం. తాను పడ్డ ఇబ్బంది ఎదుటివారు పడకూడదు అని ఆలోచించే లక్షణాన్ని పూర్తిగా విడిచి

పెట్టేస్తారు. వారు అభివృద్ధి చెందే క్రమంలో ఎంతమందినైనా తొక్కుకుంటూ వారి అంతుచూస్తారు అంటూ ఈర్ష్యాజీవుల స్వార్థబుద్ధిని గురించి కవి తెలియజేశారు.

**బాలల సమస్యలు :**

సంపత్ కుమార్ గారికి పిల్లలన్నా, విద్యార్థులన్నా అమితమైన ప్రేమ. వారికి ఎలాంటి ఇబ్బంది కలిగినా వాటిని తీర్చేక్రమంలో సంపత్ గారు ముందుంటారు. విద్యార్థులకు సంబంధించిన ఎలాంటి సమస్యనైనా క్షణాల్లో తీర్చాలి. వారు అందుబాటులో లేకపోవయినా మాట రూపంలోనైనా విద్యార్థులకు పని అయ్యేంతవరకూ తోడుంటారు. అలాంటి గొప్ప వ్యక్తి ఆలోచనల, ఆచరణల ప్రతిఫలమే ఆయన కవిత్వం. ఆలోచనలు అనే కవితాసంపుటిలో అద్భుతమైన కవితలు రాశారు. ఇందులో అనాథ బాలల పట్ల, బాలకార్మిక వ్యవస్థ పట్ల ఆయనకున్న మానవీయ దృక్పథంతో పాటు విద్య నేడు ఎలా మారిపోయింది ఆ విద్యావ్యవస్థలో పడి నలిగిపోతున్న బాలలు ఎలా ఉన్నారన్న బాధ కలిపిస్తుంది.

**అనాథ బాలలు:**

తల్లిదండ్రులను దైవంతో సమానంగా భావిస్తుంది భారతీయ సమాజం. అది అక్షరాల నిజం. మిగతా ఏ దేశంలో బిడ్డను 30 సంవత్సరాలు వచ్చినా పోషించే తల్లిదండ్రులు లేరు ఒక్క భారతదేసంలో తప్ప. అలాంటి దేశంలో కూడా అనాథ బాలబాలికలు ఉన్నారు. దానికి 2 కారణాలు. 1. తల్లిదండ్రులు చనిపోవడం, 2. తల్లిదండ్రులు ఇద్దరూ పిల్లలను కని చెత్తకుప్పల్లో పడవెయ్యడం. ఈ రెండు పనుల వల్ల పిల్లలు అనాథలై రోడ్ల మీద తిరుగుతూ ప్లాట్ ఫాం తల్లిగాను, చెత్తకుప్పను తండ్రిగాను భావించుకుంటూ జీవితాన్ని సాగిస్తూ ఉంటారు. దానికి తార్కాణమైనదే కింది కవిత.

**"ప్లాట్ఫామే తల్లి**
**చెత్తకుప్పే తండ్రి**
**అనాథ బాలలు!" (ఆలో. 2017:51)**

కవిగారు ప్లాట్ ఫాం తల్లి అనీ చెత్త కుప్ప తండ్రి అని కేవలం సాధారణంగా ప్రయోగించలేదు. తల్లి లక్షణం బిడ్డను అక్కున చేర్చుకోవడం, తన ఒడిలో సేదతీర్చడం, నిద్రపుచ్చడం ఒక ధైర్యాన్ని ఇవ్వడం. ఇవన్నీ ప్లాట్ ఫాంలో కూడా ఉంటాయి. ఇక తండ్రి ప్రధాన లక్షణం పోషణ. మిగిలిపోయిన ఆహారాన్ని చెత్త కుప్పల్లో పడేస్తాం. వాటిని తిని జంతుజాలాలు బతుకుతాయి. వాటితోపాటు అనాథలు కూడా. ఇక్కడ వారి ఆకలిని తీర్చే బాధ్యత ఆ చెత్తకుప్ప తీసుకుంది కాబట్టి చెత్తకుప్పే తండ్రి అన్నారు కవి. అదే ఒక సాధారణ కవికి, సమాజం పట్ల నిబద్ధత ఉన్న కవికి ఉన్న వ్యత్యాసం.

**విద్యావశ్యకత :**

పేదరికం నశించాలన్నా కావాల్సింది విద్య. చదువు ప్రతిమనిషి



జీవితంలో ప్రాథమిక అవసరాలలో ఒకటి. ఈ రోజు మానవుని తెలివితేటలు అడవి నుండి అంతరిక్షయానం వరకూ ఎదిగాయంటే దానికి చదువే కారణం. అయితే మనిషి ఎంత ఎదిగినా తన సమాజంలో జడలు విప్పి నర్తిస్తున్న సామాజిక పీడన పిశాచాలను అణచివేయలేకపోతున్నాడు. అలాంటి వాటిలో పేదరికం ఒకటి. పేదరికానికి కారణాలు ఎన్నున్నా ఒకప్పుడు పేదరికం వల్ల చాలా మంది చదువుకోలేకపోయేవారు. చదువు లేక పేదరికం, పేదరికం వల్ల చదువుకోలేకపోవడం కొన్ని తరాలపాటు పేదల జీవితాన్ని నాశనం చేసింది. కానీ దానికి అడ్డుకట్ట వేసేందుకు భారత రాజ్యాంగంలో **"అందరికీ విద్య"** సూత్రాన్ని ప్రతిపాదించారు. అయినప్పటికీ నాలుగు దశాబ్దాలపాటు భారతదేశంలో నిరక్షరాస్యత విపరీతంగా ఉంది. చదువు యొక్క అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం కుల, మత, లింగ భేదాలు లేకుండా అందరూ చదువుకోవాలన్న ధ్యేయంతో తీసుకువచ్చిన పథకమే అందరికీ విద్య (సర్వ శిక్షా అభియాన్). 1వ తరగతి నుండి 10వ తరగతి వరకూ పైసా కూడా ఖర్చులేకుండా ప్రభుత్వ విద్యాలయాల్లో ఉచితంగా చదువుకోవచ్చు. అంతే కాదు ఆ చదువును తప్పనిసరి కూడా చేసింది. ఆ వయస్సు పిల్లలను బడికి పంపకపోతే తల్లిదండ్రులను, పనిలో పెట్టుకొంటే యజమానులను నేరస్థులుగా పరిగణించింది. గొంగళి పురుగుల్లా ఉన్న పిల్లల జీవితాన్ని అందమైన సీతాకోక చిలుకల్లా మార్చాలని ప్రయత్నం చేసింది. దానిని ఉద్దేశించి కవి –

**"గొంగళి పురుగును**
**సీతాకోక చిలుకగా మార్చండి**
**అందరికీ విద్య!** (ఆలో. 2017:51)

అంటూ గొప్పగా వర్ణించారు. అందరికీ విద్య అనే పథకం వచ్చిన తరువాత దేశంలో అక్షరాస్యతలో గణనీయమైన మార్పు వచ్చింది. ఈ కవితలో మనం అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే అభంశుభం తెలియని వయస్సులో పిల్లలను తరగతి గదులకే పరిమితం చెయ్యడాన్ని, దాని వెనుక దాగి ఉన్న తల్లిదండ్రుల ఆలోచన విధానాన్ని, అలాంటి ఆలోచలను ప్రేరేపిస్తున్న ప్రస్తుత సమాజాన్ని.

వీటన్నిటి ప్రతిఫలమే నేడు మనం సమాజంలో చూస్తున్న అరాచకాలు, దుర్మార్గాలు, రోగాలు, మానసిక బలహీనతలు వాటన్నిటిని దగ్గర ఉండి అరికట్టడం కవిగారి ఒక్కరి వల్ల కాదు, అలాగని చూస్తూ ఉండలేని స్వభావం కాబట్టి ఇలా కవిత్వమై ఘోషించారు.

**స్త్రీల సమస్యలు :**

స్త్రీల సమస్యలు అనేకం. శారీరక మానసిక సమస్యలు, ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడం, లింగ వివక్ష మొదలైనవి. వాటన్నిటి దృష్టితోనే ధిక్కారంగా తెలుగులో ప్రధాన సాహితీ స్రవంతికి సమాంతరంగా స్త్రీవాద సాహిత్యం పుట్టుకు వచ్చింది. స్త్రీవాద సాహిత్యాన్ని స్త్రీలే సృష్టించుకోవడం కనిపిస్తుంది. అయితే, సానుభూతి, సహానుభూతి క్రమంలో సహానుభూతిగా స్త్రీలకు సపోర్టు చేస్తూ చాలా మంది కవులు, రచయితలూ తెలుగులో రచనలు చేశారు. ఈ క్రమంలో సంపత్ కుమార్ గారు కూడా తమ వంతుగా కవిత్వాన్ని రాశారు.

**అసమానత :**

భారతీయ సమాజంలో స్త్రీ పురుషుల మధ్య ఒక గీత ఎప్పుడూ ఉంటూ ఉన్నది. ఇంట్లో, ఆఫీసుల్లో, సమాజంలో అసమానత ఉన్నది. స్త్రీని దేవతగా పూజించే భారతదేశంలో ఇటువంటి సంస్కృతి ఉండడం బాధాకరం. దానిని వైవిధ్యం అనుకొని కొంతమంది, వైరుధ్యం అని కొంతమంది భావించి ముందుకు వెళ్తూ ఉంటారు. బాధ పడి కొందరు, భరించి కొందరు కాలాన్ని వెళ్లబుచ్చుతూ ఉంటారు. కానీ కవులు మాత్రం బాధితుల పక్షాన ఎప్పుడూ నిలబడతారు. అదనుకు నిదర్శనంగా సంపత్ కుమార్ గారు రాసిన కవిత్వాన్ని చెప్పుకోవచ్చు.

ఆయన మగవారైనప్పటికీ బాధితులైన స్త్రీల పక్షాన మొహమాటం లేకుండా కవిత్వం రాశారు. “మగవాడు” అనే కవితలో మగవాడు ఎటువంటి వాడైనా అనాదిగా ఈ సమాజం ఎలా చూస్తూ వచ్చిందో, ఆడవారిని ఎంత తక్కువగా చూస్తూ వచ్చిందో అద్భుతంగా వర్ణించారు.

**“మగాడంటే**
**మొనగాడని చెప్పింది అవ్వ**
**అవుననుకున్నది అమ్మ!**
**ఆడా మగా**
**వైవిధ్యం అనుకున్నాను**
**తెలియలేదు నోరు కూడా కుట్టేశారని”** (శత్రువు. 2015:46–48)

ఆడవారికి అలంకారార్థం ముక్కు కుట్టడం, చెవులు కుట్టడం ఆనవాయితీ కానీ మన సమాజం ఆడవారి నోరు కూడా కుట్టేస్తోంది అంటూ కొత్త అభివ్యక్తిని చేశారు కవి. అది ఆడవారికి మాట్లాడే స్వేచ్ఛ కూడా లేదని చెప్పడానికి వాడిన అత్యద్భుతమైన ప్రయోగం. ఇలాంటి ప్రయోగం ఏ స్తీవాద కవయిత్రి కూడా ప్రయోగించి ఉండరు.

స్త్రీలను సమాజం చాలా చిన్నచూపు చూస్తోంది. కాబట్టి స్త్రీలకూ పురుషులతో పాటు ఆస్తిలో, అవకాశాలలో సమానమైన హక్కులు కావాలని ఎన్నో పోరాటాలు సాగాయి. స్త్రీలు పురుషులతో ఏ మాత్రం తక్కువ కాదు అని విద్య, ఉద్యోగం, వ్యాపారం, క్రీడారంగం... ఇలా అన్ని రంగాల్లోనూ స్త్రీలు తమ శక్తిని చాటుకున్నారు. అలాంటి సందర్భాన్ని గుర్తుకు చేసే కవితలు కింద ఉన్నవి.

**“శూన్యంలో సగం**
**సంపదలో శూన్యం**
**స్త్రీలకు సమాన హక్కులు!”** (ఆలో. 2017:33)

భారతదేశం వేదభూమి, కర్మభూమి, ధర్మభూమి యని, స్త్రీలకు ఎనలేని గౌరవాన్ని ఇస్తుందని యావత్ ప్రపంచమే కొనియాడుతూ ఉంది. కానీ హక్కులు, సంపద విషయంలో మాత్రం స్త్రీలకు అన్యాయం జరుగుతూనే ఉంది. సమాజంలో మహిళలకు సగభాగం స్థానం కల్పించాలనే ప్రభుత్వాల మాటలు పార్లమెంట్లో ఇప్పటివరకు ఆమోదానికి నోచుకోలేదని సంపత్ కుమార్ వాపోయారు. అయితే ఇలాంటి కవుల, పోరాటదారుల నిరంతర కృషి ఫలితంగా ఆడవారికి అన్నిటిలోనూ 33.3 శాతం రిజర్వేషన్ కల్పించడం, అలాగే మగవారితో సమానంగా ఆడపిల్లలకు తండ్రి ఆస్తిలో సమానమైన హక్కులు ఉండడం లాంటివి సాధ్యం అయ్యాయి.

**అఘాయిత్యాలు :**

మహాత్మాగాంధీ స్త్రీ అర్ధరాత్రి భయం లేకుండా, స్వేచ్ఛగా నడిచిన రోజే నిజమైన స్వాతంత్ర్యమని భావించాడు. కానీ నేడు పట్టపగలే ఆ స్త్రీ ఇంటా బయటా సర్వత్రా సామూహిక అత్యాచారాలకు గురౌతూనే ఉంది. దానికి సంబనధించి కవిత

**“అర్ధరాత్రి ఆడవాళ్ళ**
**ఒంటరి ప్రయాణమే అసలైన స్వాతంత్ర్యం**
**సామూహిక అత్యాచారం”** (ఆలో. 2017:35)

భారతదేశం రోజురోజూ అభివృద్ధిని సాధిస్తూ ఉన్నది. అలాగే మరో పక్క నేరాల శాతం కూడా బాగా పెరిగిపోతోంది. ఢిల్లీ నిర్భయ కేసు మొదలుకొని డా. ప్రీతి వరకూ ఎంతమంది ఆడవారు హత్యకావించబడ్డారు. అత్యాచారాలకు గురయ్యారో లెక్క కట్టలేము. స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలకు వయస్సుతో సంబధం లేదు. తొమ్మిది నెలల పసికందుల నుండి పండు ముసలి వరకూ అందరూ మగరాక్షసుల చేతిలో నలిగిపోతున్నారు. అలాంటి సందర్భాన్ని ఉద్దేశించి సంపత్ కుమార్ గారు **“కుక్కలుంటాయి జాగ్రత్త”** అన్న కవితను రాశారు.

**“నువ్వు పసికందువు కావచ్చు**
**పండు ముదుసలివి కావచ్చు**
**యవ్వనవతివి కావచ్చు**

**గర్భవతివి కావచ్చు**
**కామాంధుడికి**
**చిత్తకార్తె కుక్కలు**
**చిత్త చాంచల్యంతో తిరుగుతూ ఉంటాయి"**

(వికారి. 2019:70,71)

అంటూ ఆడవారు ఏ దశలో ఉన్నా మగవారు విడిచిపెట్టడం లేదని, రాత్రే కాదు పగలు కూడా చాలా బాహాటంగా జరుగుతున్నాయని ఉన్నది ఉన్నట్లు చెప్పారు. పై కవితలో చెప్పిన ఆడవారి అందరిపై అత్యాచారాలు జరిగాయి. అందుకే ఉన్నది ఉన్నట్లు కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు. ముఖ్యంగా చిన్నపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలలో ఎక్కువ శాతం తెలిసినవారే, కుటుంబ సభ్యులే చేస్తున్నట్లు నిర్ధారించబడిన విషయాన్ని కవితలో ప్రస్తావించారు.

ప్రభుత్వం ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా సమాజంలో మార్పు రావడం లేదు. కారణం మనుషులో సహజ లక్షణమైన మానవత్వం లేకపోవడం. మనిషికి మాత్రమే సొంతమైన నైతికమైన విలువలు లేకపోవడం. అలాంటి విలువలును పెంపొందించే విద్యావిధానం పోయి, కార్పోరేట్ విద్యావిధానం దేశంలో విచ్చల విడిగా అమలు కావడం. అలాంటి వాటిని చూసే కవి పైకవితలో ఆ మాటలు అన్నారు. అంతే కాదు ఎవరిని వారు రక్షించుకోవాలని స్త్రీలను ప్రేరేపించే విధంగా **"నోరు తెరవండి"** అన్న కవితను రాశారు.


**"ఇకనైనా**
**నోరు తెరిచి మాట్లాడండమ్మా**
**వేల సంవత్సరాలనుంచి**
**మౌనంగా ఉంచిన నోరు"**

అంటూ స్త్రీలను ఉత్తేజ పరచారు. అలానే కవి సమాజంలోని స్త్రీలకు ఊతమిచ్చారు. మనిషిని మనిషిగా మలిచేది అక్షరం. మానవునిలోని అజ్ఞానాన్ని పారద్రోలి విజ్ఞానాన్ని వెలిగించు దివ్య జ్యోతి అక్షరం. అక్షరం కళాత్మకమైతే అది సాహిత్యం. అలాంటి సాహిత్యం సమాజంలోని కల్మష భావాలను పారద్రోలి నూతన చైతన్యాన్ని సమాజానికి జవసత్వాలుగా అందిస్తుంది. అలాంటి సాహిత్యంలో కవిత్వం ఒక మార్గం లేదా ఒక పద్ధతి. లయాత్మకమైన తన పదవిన్యాసంతో కవిత్వం సమాజాన్ని ఒక లయబద్ధమైన మార్గంలో నడిపిస్తుందనడంలో సందేహం ఏమాత్రం లేదు. అలాగే కవిత్వం సమాజాన్ని దర్శించిన కవి నుండి పుడుతుంది. ప్రతి కవి సమాజాన్ని సమాజంలోని ప్రజలకు దర్శింపజేయాలని ఆరాటపడుతూ ఉంటాడు. తద్వారా సమాజం పట్ల ప్రజలలో చైతన్యభావాల్ని పెంపొందింపజేయాలని పరితపిస్తున్నారు.

❖ ❖ ❖ ❖ ❖

## జీవిత మింతే...!

**డా. తిరునగరి శ్రీనివాస్, ఫోన్ : 9441 464 764**



బతికినంత సేపూ
బలాబలాలే
ఊపిరాడినంత సేపూ
వ్యూహ ప్రతివ్యూహాలే
కదిలినంత మేర
వ్యామోహ మోహాలే
అర్థం కానిదేమీ లేదు
అంతా తేటతెల్లమే
కళ్లూ, మనసూ మూసుకుపోతే
జ్ఞానోదయాలు తమదారిన తాము
కొట్టుకుపోతూనే వుంటాయి
పునాదులపై వికృత
సమాధులు మొలుస్తూనే వుంటాయి
అడ్డదిడ్డాలు
అంతస్థులుగా ఎదిగిపోతూనే వుంటాయి



ఎవరూ పిలవరు
ఎవరూ అడగరు
బొట్టుకాటుకలెవ్వరూ పెట్టరు
మంగళహారతులెవరూ పట్టరు
చచ్చిపోకుండా బతికుండాలంటే
చొచ్చుకుపోయి తీరాలి
నిశ్శబ్దాలకు శబ్దతడి అద్దాలి
ఆత్మాభిమానం జెండాగా ఎగిరినా
అవస్థలతో అవనతమైనా
స్వయం నిర్ణయమే అది
ఎగబడడం
ఎదగడం
చివరకు మృత్యు స్పర్శకు లొంగిపోవడం
అందుకే కమ్ముకున్న పొరలు తొలగాలి
అప్పుడే అసలు రహస్యం పట్టుబడుతుంది

# భస్మలేపన శివా! పార్వతీశ!

**యెల్లికంటి జ్ఞానప్రసూనా శర్మ**
కడ్తాల, రంగారెడ్డి జిల్లా. ఫోన్ : 9493112429



కైలాస గిరివాస! కాత్యాయనీ ప్రియా!
కామితమ్ములు తీర్చు కాలకంఠ!
వెండి కొండయె నీకు ప్రియమైన ఇల్లాయె
మెండు బూచుల రేడ! కొండ దేవ!
సర్పహారమ్ములు సంతసంబున దాల్చు
నాగరాజేశ్వరా! నందివాహ!
దక్ష యజ్ఞ వినాశ! దాక్షాయణీ వరా!
భస్మలేపన శివా! పార్వతీశ!
ఆది మధ్యాంత రహితుడా! ఆదిదేవ!
భిక్షు వేషక! జడధారి! రక్షకుండ!
అర్ధనారీశ! విధుమౌళి! యభయదాత!
భూత నాయక! జగమేలు నేత నీవె!

మాఘమాసము నందు మంగళ కరమైన
శివరాత్రి పండుగ శ్రేష్ఠతరము
మంగళ రూపిణీ మాత భవానిని
కోరివరించగా కోర్కె తోడ
గంగమ్మ గౌరమ్మ కాంక్షగా పతిదేవు
చేయినందుకొనగ క్షేమమయ్యె
భక్తకోటి మిగుల భవుని గొల్వగాను
పూజలందు హరుడు పుష్కళముగ
అభిషేకంబుల నార్తితో జరిపింప
శుభముల నొసగెతా నభయ దాత!
లోక కళ్యాణంబు లోకులు వీక్షించ
జన్మధన్యత నొందె జగతి యంత
పసుపు కుంకుమిచ్చి పడతుల గాచుచూ
జగతి నేలుచుండు జనని గౌరి!
దీన జనుల పాలి దివ్య ప్రభాసమౌ
శాంతి సుఖము గూర్చు సాంబశివుడు!!

---

**STATEMENT OF OWNERSHIP & OTHER PARTICULARS ABOUT "MUSI" TELUGU MONTHLY**
**FORM IV (See Rule 8)**

| | |
|---|---|
| **1.** Place of Publication | Hyderabad |
| **2.** Periodicity of its Publication | Monthly |
| **3.** Printer's Name | **B. Ananta Laxmi** |
| a) Whether citizen of India? | Yes |
| b) if foreigner, state the country of origin | - |
| address | 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderabad-500027 |
| **4.** Publisher's Name | **B. Ananta Laxmi** |
| a) Whether citizen of India? | Yes |
| b) if foreigner, state the country of origin | |
| address | 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderabad-500027 |
| **5.** Editor's Name | **Dr. Sagi Kamalakara Sharma** |
| a) Whether citizen of India | Yes |
| b) if foreigner, state the country of origin | |
| address | 2-2-1109/BK-LIG-10, Bathukamma kunta, Bagh Amberpet, Hyderabad -500013 (Telangana) |
| **6.** Name and address of individuals who own the Newspapers and partners or share holders holding morethan one percent of the total capital. | **B. Ananta Laxmi** |

I, **B. Ananta Lakxmi,** hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

01.03.2024

*Sd/-*
**B. ANANTA LAXMI**
Publisher

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 5 51 UGC Care List Approved Journal హైదరాబాద్ మార్చి : 2024

# ప్రక్రియల దండలో 'మణిపూసల' మెరుపు

డా. సుభాష్, వికారాబాద్, ఫోన్ : 730 686 4798

ఛందోబద్ధ ప్రక్రియ అనేది సాహిత్యయుగంలో ఈనాటిది కాదు. ప్రపంచ సాహితీవనంలో అత్యంత ప్రాచీనమైన రచనగా పేర్గాంచింది. ఋగ్వేదంలోని గాయత్రీ మంత్రంలో 24 అక్షరాలు, పంక్తిలో 28 అక్షరాలు, విరాజ్‌లో 40 అక్షరాలు, త్రిష్టుప్‌లో 44అక్షరాలు, జగతిలో 48 అక్షరాలతో కూడిన ఛందోరచనలు కనిపిస్తున్నాయి. శుక్ల యజుర్వేదం, కృష్ణయజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం, అరణ్యకాలు, ఉపనిషత్తులు ఇలా అనేక గ్రంథాల్లో ఛందోవిధాన రచనలు తటస్థమౌతూనే ఉన్నాయి.

వేదాంగాలు ఆరు. శిక్ష, కల్పం, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం. "ఛందః పాదౌతు వేదస్య" అనగా వేదానికి ఛందస్సు పాదం వంటిదని అర్థం. నాటి వైదిక ఛందస్సు అక్షరగణం మీద ఆధారపడింది. ఒక్కొక్క పాదానికి ఇన్ని అక్షరాలు అనే నియమం ఉండేది. ఇలా ఎన్ని పాదాలైనా రాసుకునే అవకాశం నాటి నుండి ఉంది. ఈ క్రమంలో వేదాల్లో మూడుపాదాల ఛందో విధానం ఎక్కువ కనిపిస్తుంది.

ఖండకావ్యం, ముక్తక కావ్యాలను కలిపి లఘుకావ్యాలు అనవచ్చు. సర్గబంధం, పంచసంధులు, వర్ణనలతో కూడిన మహాకావ్యాలకు సరి సమాన స్థాయిలో నిలబడ్డ రచనలు లఘుకావ్యాలు. ఈ లఘుకావ్యాలు గాన యోగ్యతకు ఆమోదయోగ్యమైనవి. ఇట్లా నాటికాలంలో ఆరంభమైన ఛందోరచన నేటికీ కొనసాగుతూనే ఉంది.

గాలికిపోయే మాటను గాలికే అంకితం చేయాలి. మనసుకు తాకే మాటను మాత్రం తప్పక అక్షరబద్ధం చేయాలి. అక్షరబద్ధమైన వాక్యం గ్రంథం అవ్వాలి. ఆ గ్రంథం అన్ని తరాలకు అలరించాలని అనుకున్నాడీ ప్రక్రియా సృష్టికర్త. పాదాలు మనసుకు అందాలి, మనసుకు లయ దొరకాలి. దొరికిన లయ మణిమాణిక్యం అవ్వాలి. అవే మణిపూసలై సాగాలని హృదయానికి చెప్పుకున్నాడు. ఆ హృదయం నుండి పుట్టుకు వచ్చినవే, ఆ ఒంటరితనం నుండి బయటకు లాక్కొచినవే మణిపూసలు.

క్రీ.శ.12,13 శతాబ్దాల నుండి 20 వ శతాబ్దం ఆరంభకాలం వరకు సాహితీ ప్రపంచంలో అనేకమైన, వైవిధ్యభరితమైన ప్రక్రియలు రాజ్యమేలాయి. వాటిలో అతి ప్రధానమైనవి శతకాలు, ద్విపదలు, ఉదాహరణలు, ప్రబంధాలు, రగడలు, యక్షగానాలు, పదకవితల వంటివి కనిపిస్తాయి. తరువాత కాలంలో తెలుగు సాహిత్యంలో ఉద్యమ కవిత్వాల వికాసం, మినీకవితల వైభవం విలసిల్లి అవసరాల కనుగుణంగా కవితా రూపం మారుతూ సాగింది. ఈ పరిణామంలో కొత్తపుంతలు తొక్కుతూ అతి తక్కువ కాలంలో తన ఉన్నతిని నిలబెట్టుకున్న నూతన కవితా ప్రక్రియ మణిపూసలు.

కవిత్వం సామాన్యునికి అర్థమవ్వాలి. కవిత్వం సామాన్యునిలోకి ప్రవేశించాలి. కవిత్వం ఆలోచన రేకెత్తించాలనే భావన నాడు బద్దెన, వేమన, కంచర్ల గోపన్న వంటివారి రచనల్లో కనిపిస్తే ఆధునికకాలంలో గురజాడ, పెన్నా శివరామకృష్ణ, కాళోజీ మొదలగు వారి రచనల్లో దర్శనమిస్తాయి.

21 వ శతాబ్దంలో మినీకవితా ప్రక్రియకు ప్రాచుర్యం, ప్రాధాన్యత, ఆదరణ ఎంతగానో పెరిగిపోయింది."అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః యథాస్మై రోచతే విశ్వం తదేవం పరివర్తతే" అంటారు ధ్వన్యాలోక కర్త ఆనందవర్ధనుడు. అంటే అనంతమైన ప్రపంచానికి కవియే ప్రజాపతి. కవి ఇష్టానుసారమే కావ్యజగత్తు నిర్మితమౌతుంది.

ఈ విధానాన్ని అనుసరించి ఆధునిక కవి తన కవితా ప్రపంచంలో నూతన ప్రక్రియలకు, కవితలకు శ్రీకారం చుట్టాడు. మహాకావ్యం రాయవచ్చు, లఘుకావ్యం రాయవచ్చు. కానీ వ్యక్తికి వేగంగా, తక్కువ కాలంలో ప్రభావాన్ని చూపగలిగే మార్గమేదన్న దానిపై అన్వేషణ మొదలైంది. ఈ అన్వేషణ నుండి పుట్టుకు వచ్చిన ప్రక్రియలు రుబాయిలు, గజళ్ళు, నానీలు, హైకులు, రెక్కలు, మొగ్గలు, కైతికలు, నానోలు, చిమ్నీలు, సిసింద్రీలు, సమ్మోహనాలు వంటివి ఎన్నో. ఇవి సామాన్యుని మెదడును ఆలోచింపజేశాయి. ఈ మార్గానికి చెందినదే మణిపూసలు. పాఠశాల స్థాయి విద్యార్థుల నుండి ఉద్దండులైన, మహామహులైన సాహితీవేత్తల వరకు ఆసక్తిని పెంచి రచనాభిరక్తిని కల్పించాయి. 2018 కాలంలో వికారాబాద్ జిల్లా తాండూర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త వడిచర్ల సత్యం మేధస్సు నుండి ఈ ప్రక్రియకు అంకురార్పణ జరిగింది. నాలుగు పాదాలు కలిగి ఉండి 1,2,4 పాదాలు అంత్యప్రాస నియమంతో 10 లేదా 11 లేదా 12 మాత్రల్లో ఏదైనా ఒక రూపాన్నే ధరిస్తుంది. 3వ పాదం మాత్రం 10 నుండి 12 మాత్రల్లో ఎన్నైనా తీసుకోవచ్చు.

మణిపూసలు ఒక ప్రాంతానికి పరిమితం కాలేదు. ఆవిర్భావ కాలం నుండి నిత్యనూతనంగా కొనసాగుతూ ఉంది. నవ్యాంధ్రలో శ్రీకాకుళం మొదలు అనంతపురం వరకు, తెలంగాణాలో ఆదిలాబాద్ నుండి గద్వాల వరకు మరియు మహారాష్ట్ర, తమిళనాడు మొదలగు రాష్ట్రాల నుండి ఎందరో పాఠకులు మరెందరో రచయితలు నిత్యం ఈ ప్రక్రియపై పఠనాసక్తి, రచనాసక్తిని చూపుతున్నారు.

## శతకంలో – మణిపూసలు

Poetry is expression of imagination అంటారు షెల్లీ అను ఆంగ్లకవి. అనగా "భావ వ్యక్తీకరణమే కవిత్వం" అని అర్థం. చెప్పే విధానంలో, రక్తికట్టించే తీరులో కొత్త ప్రయోగం నిత్యం జరుగుతూనే ఉండాలి. మణిపూసల రచనలో ఈ విశిష్టత స్పష్టంగా కనిపిస్తుంది. శతక వాఙ్మయంలో మకుట నియమం అనేది నాలుగవ పాదంగా ఉండడం సహజం. కొన్ని శతకాల్లో చివరి రెండు పాదాలు ఉండడం చూస్తూ ఉంటాం. మణిపూసల్లో రాయబడిన మురళి శతకము, తెలుసుకో ఓ మనిషి శతకం, మణిపూసల త్రిశతి, మానవత్వ పరిమళాలు శతకం, ఆడపిల్ల శతకం, ఓ నరుడా శతకం, తెలుసుకో విద్యార్థి వంటివాటిలో మకుట నియమం అనేది మూడవ పాదానికి చేకూర్చి పాఠకునికి ఆసక్తిని కలిగించాయి.

## భగవద్గీతలో– మణిపూసలు

విభిన్న వస్తువులను తీసుకొని అల్పార్థంలో అనల్పార్థాన్ని వ్యక్తం చేయడమే మణిపూసల ప్రత్యేకత. శ్రీమద్భగవద్గీత అనేది వ్యాస ప్రోక్తం అన్న విషయం మనకు స్పష్టమే. గీతాసారాన్ని తాగిన వాడికి పునర్జన్మ లేదు. సాక్షాత్తు భగవంతునిలోకి లీనమవ్వడం తథ్యం అని గీతాచార్యుడే నాడు ఫలశ్రుతి చేశాడు. అటువంటి భగవద్గీతలోని 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలకు సంబధించిన సారాంశాన్ని 1300 మణిపూసల్లో కాటేగార్ పాండురంగ విఠల్ గారు తీసుకువచ్చి నిశితంగా తెలుగువారికి అందించడం జరిగింది. అందులో ఒక శ్లోకాన్ని తీసుకుంటే –

యదయదాహిధర్మస్యగ్లానిర్భవతి భారత!
అభ్యుత్థానమధర్మస్య తథాత్మానం సృజామ్యహం!!

అనే శ్లోకాన్ని మణిపూసల్లో

**ధర్మము క్షీణించినపుడు / అధర్మములు పెరిగినపుడు**
**పార్థా! నేనవతరిస్త ! / భక్తులు వేడుకున్నపుడు**

అంటూ బహుసరళంగా అందించారు. ఈ ఒక్క శ్లోకమే కాదు భగవద్గీతలోని ప్రతీ శ్లోకం మణిపూసల్లో అపురూపంగా కనిపించి, సామాన్యునికి చేరువయ్యాయి.

## రామాయణంలో – మణిపూసలు

సంస్కృతంలో ఆదికావ్యం వాల్మీకి విరచిత రామాయణమే అయినప్పటికి భారతదేశంలోని వివిధ కాలాల్లో ఎందరో మహానుభావులు స్థల, కాలాలకనుగుణంగా రామాయణ రచన గావించారు. వీటిలో ప్రధానంగా చూస్తే తమిళంలో కంబడు కంబ రామాయణం, హిందీలో తులసీదాసు రామచరిత మానస్, గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణం, హుళక్కి భాస్కరుని ఆధ్వర్యంలోని భాస్కర రామాయణం, మొల్ల రామాయణం, కంకంటి పాపరాజు ఉత్తర రామాయణం, విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం వంటివి ఎన్నో దర్శనమిస్తాయి. ఎవరు రాసినా, ఎన్ని రాసినా నిత్య నూతనం రామాయాణం. ఈ పరంపరాగతంలో వచ్చిందే మణిపూసల రామాయణం. రామాయణ కాండలను విడువకుండా, మణిపూసల నియమాన్ని తప్పకుండా కథా విభాగాన్ని అపురూపంగా రచించారు రచయిత టీ. ఆశీర్వాదంగారు. శ్లోక సంప్రదాయం లేదు, పద్య కఠినత్వం లేదు. అలతి పదాలతో సామాన్య పాఠకునికి రామాయణ సారాన్ని సమూలంగా అందించారు. శ్రీరామ జననం బాలకాండలో ఈ విధంగా వర్ణించారు.

**"చైత్రశుద్ధ నవమినాడు / రాముడు జన్మించినాడు**
**కన్నతల్లి కౌసల్యకు / ఆనందము పంచినాడు"**

పాఠకునికి ఇందులో అర్థం కానీ పదమంటు ఏమి లేదు. తర్కమంత లోతులేదు. చదివిన వెంటనే మనసుకు ఎక్కే విధంగా పదాల నడక ఉంటుంది. అరణ్య కాండలో లంకేశ్వరుడు సీతమ్మ తల్లిని అపహరించే వేళలో జటాయువు ఎదిరించి నేలకూలిన ఘట్టాన్ని అతి తేలిక పదాలతో –

**"రావణుడను రాక్షసుడు / సీతనపహరించినాడు**
**అడ్డుకొని ఎదురించగ / నన్నీగతి చేసినాడు"**

అంటూ శ్రీరాముల వారితో చెప్పుకున్న విధానం అద్భుతంగా కనిపిస్తుంది. ఇలా మణిపూసల రామాయణం ప్రతీ కాండలో అమృత భాండం వంటి భావాలు కనిపిస్తాయి. వాటిని తాగి జీర్ణం చేసుకోడమే తప్ప మనం అంతకంటే ఏమీ చేయలేము.

## మణిపూసల విశిష్టత

మణిపూసలు ఒక వస్తువు చుట్టూ తిరగలేదు. ఎన్నో రకాల అంశాలు ఇందులో తటస్థమౌతాయి. కథా విశ్లేషణపై గ్రంథాలు వచ్చాయి. శతకాలపై గ్రంథాలు వచ్చాయి. ప్రకృతి ఒడిని స్పృశించాయి. వీటిలో ప్రధానంగా రుక్మిణీ కళ్యాణం, బాల రామాయణం, తిరుప్పావై మణిపూసల ద్విశతి, మణిపూసల త్రిశతి, మణిపూసల పంచశతి, కౌశికుని చరిత్ర, శ్రీ రాజరాజేశ్వర నమో నమః, రైతు మణిపూసలు, అంబేద్కర్ మణిపూసలు, సర్వలఘు మణిపూసల శతకం అనే హిత సూచక మణిపూసలు, మానవత్వ పరిమళ మణిపూసలు, విద్యార్థుల అంకురం, ప్రకృతి ఒడిలో, శ్రీ చీకోటి రామ శతకం, మణిపూసల మంజరి, షిరిడీసాయి చరిత్ర, చెట్లు ఆరోగ్యానికి మెట్లు, నవరత్నాలు (సంకలనం), బ్రహ్మరాతలు, హనుమాన్ చాలీసా, కందగర్భం, స్వప్నవీణ, నమామి శ్రీకంఠ, దివ్యాంగ మణిపూసలు, మిణుగురులు, నదీ మణిపూసలు వంటివి అనేకం రాగా, ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా

మహమ్మరిపై కూడా "కరుణ లేని కరోనా" అను మణిపూసల పుస్తకం రావడం గొప్ప విశేషం.

**"కరోనా నీ ఊరేది / కరోనా నీ జాడేది**
**ఎవ్వరికి కనబడని / కరోనా నీ రూపేది"**

ఆ అంతరంగ జీవిని కవి ప్రశ్నించడం జరిగింది. కరోనా సమయంలో భయభ్రాంతులతో జడించని వ్యక్తులు లేరు. అటువంటి భయంకర సూక్ష్మ జీవిని కవి గొంతెత్తి ప్రశ్నించాడు.

మణిపూసలు మనిషి హృదయాన్ని కదిలించే భావతరంగాలుగా జనించాయి. ఇప్పటి వరకు సాహిత్యంలో అనేక ప్రక్రియల ఆవిర్భావం జరిగింది. అందులో నిలబడేవన్ని నిలబడ్డాయి నిలబడనివి పక్కకు ఒరిగాయి. కారణం సామాన్య స్థాయి చదువరులకు అవి చేరలేక పోవడమే అని ఘంటాపథంగా చెప్పవచ్చు. కానీ మణిపూసలు కాలరాత్రిలో కాంతిరేఖల వంటివి, వెలుగులు విరజిమ్ముతూ సామాన్యుల హృదయాలను అతిమధురంగా తట్టి కదుపుతున్నాయి. ఇప్పటి వరకు కొన్ని వందల పుస్తకాల ఆవిష్కరణలు జరిగాయి. ఎన్నో వ్యాసాలు వచ్చాయి. కానీ విశ్వవిద్యాలయ స్థాయిలో చేరకపోవడం కొంత లోటుగా కనిపిస్తుంది. ఇంకా ఆదరణ రావాలి, పరిశోధనలు జరగాలి. వ్యాసకర్తల నుండి పరిశోధనాత్మక వ్యాసాలు రావాల్సిన అవశ్యకత ఉంది. కనుక విశ్వవిద్యాలయాల్లో సాగుతున్న పరిశోధనల్లో ఇటువంటి నూతన ప్రక్రియలను ఆదరించి, పరిశోధనకు అవకాశం కల్పిస్తే, సాహిత్య జగత్తులో ఈ ప్రక్రియ కొన్ని దశాబ్దాలపాటు బతికి నిలిచే అవకాశం ఉందని పలువురి అభిప్రాయం.

**ఆధార గ్రంథాలు :**


1. వడిచర్ల మణిపూసలు (2018) : సత్యం వడిచర్ల, కాగ్నా కళా సమితి, తాండూర్
2. వెన్నెల మణిపూసలు (2018) : సత్యం వెన్నెల, వెన్నెల ప్రచురణలు, షాద్ నగర్.
3. శ్రీఘన మణిపూసలు (2019) : పరమేశ్వర్ ఘనపురం, సాహితీ సమితి, చేవెళ్ళ.
4. దశావతారాలు (2019) : శ్రీమతి లక్ష్మి ఎడ్ల, ఎడ్ల భూంరెడ్డి ప్రచురణలు, సిద్ధిపేట.
5. ఆలకించు ఓ మనసా (2019) : నాగమోహన్ ఎలిషాల, మణికంఠ అప్సెట్స్, ఖమ్మం.
6. శ్రీ షిరిడి సాయి చరితం (2019) : చరణ్ సాయిదాస్ వేముల, బటర్ ఫ్లై గ్రాఫిక్స్, సిద్ధిపేట.
7. రుక్మిణి కళ్యాణం (2019) : మమత ఐల, మమత ప్రచురణలు, హైదరాబాద్.
8. మణిపూసల ద్విశతి (2019) : మాణిక్ రావు కరణం, కాగ్నా కళాసమితి, తాండూర్.
9. మణిపూసల త్రిశతి (2019) : వీరారెడ్డి శాడ, బటర్ ఫ్లై గ్రాఫిక్స్, సిద్ధిపేట.
10. విమల మణిపూసలు (2019) : విమల బొమ్మ, బటర్ ఫ్లై గ్రాఫిక్స్, సిద్ధిపేట.
11. సహజకవి మణిపూసలు (2019) : అంజయ్య గౌడ్ బండకాడి, సాహిత్య పరిషత్తు, సిద్ధిపేట.
12. ఎదలోయలో (2019) : వీరబ్రహ్మం అవుసలి, ఉమలత ప్రచురణలు, వికారాబాద్.
13. అంబేద్కర్ మణిపూసలు (2019) : రవీందర్ శివాజీ, సురవి ప్రచురణలు, నల్లగొండ.
14. మణిపూసల రామాయణం (2022) ఆశీర్వాదం, టీ, కారుణ్య పబ్లికేషన్స్, హైదరాబాద్.
15. భగవద్గీత మణిపూసలు (2022) : పాండురంగ విఠల్, కే, కాగ్నా కళాసమితి, తాండూర్.


❖ ❖ ❖ ❖ ❖


**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177




# ప్రళయ కాలంలో కర్తవ్యగీతం 'ప్రపంచీకరోనా'

**డా. జె. నీరజ,** అసోసియేట్ ప్రొఫెసర్, గవర్నమెంట్ సిటీ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 98483 70018

ప్రపంచీకరణ నేపథ్యంలో 21వ శతాబ్దంలో ప్రపంచమొక వ్యాపార కుగ్రామంగా మారింది. ప్రపంచదేశాల మధ్య ఎగుమతి దిగుమతి సంబంధాలు విస్తృతంగా పెరిగాయి. ఈ కారణంగానే 2019 డిసెంబర్ లో చైనాలోని ఊహాన్ లో పుట్టిన కరోనా వైరస్ అత్యంత వేగంగా విస్తరించి ప్రపంచ దేశాలన్నింటినీ కలవరపెట్టింది. అంతుచిక్కని అతి సూక్ష్మ శత్రువుపై కొత్తరకం ఆయుధాలతో, యుద్ధతంత్రాలతో మానవాళి బతుకు పోరు చేసింది. ఈ పరిస్థితులలో ప్రజల మానసిక స్థితి ఏమిటి? పరిష్కారం కనుచూపు మేరలో కనిపించని సమస్య నుండి తన పౌరులని కాపాడటానికి రాజ్యం తీసుకుంటున్న చర్యలేమిటి? పౌర సమాజం స్పందన ఎలా వుంది? అనే విషయాలు కరోనా సమయంలో పెద్ద ప్రశ్నలై నిలిచాయి.

ఏ సమాజంలోనైనా కవులు, రచయితలు ఆయా చారిత్రక సందర్భాలలో తమ స్పందనను కవిత్వం, కథ, నవల, పాట తదితర సృజన రూపాల్లో వ్యక్తీకరిస్తారు. అది దేశ స్వాతంత్ర్యం కోసమో, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసమో, సామాజిక దురాచారాలపై నిరసన తెలుపుతూనో, రాజ్య దురహంకారాన్ని ప్రశ్నిస్తూనో కవులు, కళాకారులు తమ కళారూపాల ద్వారా స్పందిస్తారు. కాలం మారవచ్చు, సమాజాలు మారవచ్చు, వ్యక్తీకరణలో మార్పులు ఉండవచ్చు కానీ ప్రజాగొంతుక వినిపించే బాధ్యతను కవులు, రచయితలు మాత్రమే అంది పుచ్చుకుంటారు.

మరి ఈ సందర్భంలో కవులు ఎలా స్పందించారు? వారి వైయక్తిక మానసిక స్థితి ఏమిటి? సమస్యను వారు ఎలా అర్థం చేసుకున్నారు? దాని ప్రభావంతో భయాందోళనలకు గురైన తమ తోటివారికి తమ వాక్యాల ద్వారా ఎలా ధైర్యాన్ని ఇచ్చారు? అనేవి గమనించదగిన అంశాలు. **"చీకటి రోజుల్లో గానాలుండవా... ఉండకేం... చీకటి రోజుల గురించి గానాలుంటాయి"** అన్నాడు ప్రపంచ ప్రఖ్యాత నాటకకర్త బెరన్తోచ్ బ్రెఖ్ట్. అలాగే కరోనా కాలంలో ప్రపంచవ్యాప్తంగా కవులు, కళాకారులు లాగానే తెలుగు కవులు, రచయితలు స్పందించారు.

తెలుగు సాహితీలోకంలో డా.ఎన్.గోపి పేరు తెలియని సాహిత్యకులు కానీ, సామాన్యులు కానీ లేరు. ఆయన కవితాస్పర్శ తగలని వస్తువు లేదు. **'ముట్టుకుంటే తగలాలి కవిత్వం/మనిషిలాగ'** అంటారు. జీవితపు లోతుల్నీ, తాత్విక రీతుల్నీ, మానవత్వపు జాడల్నీ తన కవిత్వవారధి ద్వారా పాఠక హృదయాలలోకి చేరవేస్తున్న కవి ఎన్.గోపి. కరోనా వైరస్ వార్తలు ప్రపంచానికి తెలియడానికి కొద్ది రోజులముందే చైనాలో సాహిత్య యాత్ర చేసి వచ్చిన కవి, ప్రపంచీకరణ వలన సంభవించిన అత్యంత తీవ్రమైన పరిణామంగా, **'ఊహాన్ లో పుట్టి ప్రపంచాన్నిచుట్టేస్తున్న వైరస్ గురించి'** లాక్ డౌన్ కి పూర్వమే **'ప్రపంచీకరోనా'** కవిత రాశారు. ఆ తరువాత, కరోనా వ్యాప్తితో భారతదేశంలో 2020 మార్చి 23 నుండి 44 రోజులపాటు దేశవ్యాప్తంగా లాక్ డౌన్ విధించటంతో కేవలం నాలుగు గంటల నోటీసుతో 1.3 బిలియన్ల మంది ప్రజలు ఎక్కడివారక్కడ బందీలై పోయారు. ఈ కాలంలో కేవలం ఆరోగ్య సంక్షోభాన్ని మాత్రమే కాకుండా సామాజిక, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొన్నారు. అంతుచిక్కని వైరస్ వేగంగా వ్యాప్తి చెందడంతో ఆందోళనలు పెరిగాయి, గృహ హింస కేసులు కూడా బాగా పెరిగాయి. అయినప్పటికీ, నిరాశ మధ్య ఆశల మెరుపులు ఉన్నాయి. నగరాల్లో సామాజిక సేవా సంస్థలు, కమ్యూనిటీలు, గ్రామాల్లో ఒకరికొకరు మద్దతు ఇవ్వడానికి, ఆహారం, వనరులను పంచుకోవడానికి కలిసి వచ్చాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు వర్చువల్ విద్యను, వినోదాన్ని సులభతరం చేసి భయాందోళన స్థితి నుండి కొంత ఉపశమనాన్ని అందించాయి.

ఈ సంక్షోభ సమయంలో తెలుగు నాట కవులు తమ చుట్టూ ఎన్నడూ చూడని భీతావహ పరిస్థితిని చూసి ఆందోళన పడినా కవులుగా తమ కర్తవ్యాన్ని గుర్తించి స్పందించారు. ఈనాడు దినపత్రిక **"కరోనా పై కదనరంగం"** అనే పేరుతో నిర్వహించిన కవితల పోటీలో డా.గోపి రాసిన కవితకు తొలిరోజు ప్రథమ బహుమతి లభించింది. మొదటి లాక్ డౌన్ కాలంలో కవి మొత్తం ఇరవై ఐదు కవితలు రాశారు. ఈ 25 కవితలలో కరోనా విపత్తు స్థానికంగా, జాతీయంగా, అంతర్జాతీయంగా మానవ జీవితంపై చూపిన ప్రభావం, దాని పర్యవసానాలు, తాత్విక చింతన ఇత్యాది విషయాలను స్పృశించారు కవి. ఈ కవితలు ఆయా పత్రికలలో ప్రచురితమై పాఠకుల దగ్గరకు చేరితే వాట్సాప్ ద్వారా కవి స్నేహితులకు, సన్నిహితులకు చేరుకుని వారి భయాన్ని, ఆందోళనను కొంత తగ్గించాయి. కరోనా భౌతికంగా మనుష్యుల మధ్య అడ్డుగోడలు సృష్టించినప్పుడు మొబైల్ భావ ప్రసారాలే ఊపిరులందించాయి.

ప్రపంచదేశాలన్నీ సరళీకృత ఆర్థిక విధానాలను అనుసరిస్తున్నాయి. దీని వలన ప్రపంచం ఒక మార్కెట్ కూడలిగా మారింది. ఈ ప్రపంచీకరణ అన్ని దేశాలలో, ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెను మార్పులను తీసుకువచ్చింది. దేశాల మధ్య సరిహద్దురేఖలు చెరిగిపోయి వ్యాపార వాణిజ్య సంబంధాలకు అవకాశం ఏర్పడింది. రాకపోకలు విపరీతంగా పెరిగాయి. జీవన వేగం పెరిగింది. ఈ నేపథ్యంలోనే కరోనా లాంటి వైరస్‌లు విజృంభించాయని గోపి గారు ఇలా అంటారు–

**"ఒకప్పుడు విదేశీ యాత్రలు/జ్ఞానాన్ని మోసుకొచ్చేవి**
**ఇప్పుడు/రోగాలను వెంటతెస్తున్నాయి**
**వైశ్వీకరణం అంటే ఇదే కాబోలు!**
**ఒకప్పుడు/విదేశాల నుంచి తిరిగొస్తే**
**పూలదండలు ఎదురొచ్చేవి.**
**ఇప్పుడు వైద్యులు/బురఖాలు వేసి లాక్కుపోతున్నారు."**

విదేశీ యాత్రలు అరుదుగా, కేవలం కొద్దిమందికే, అందునా ఉన్నత విద్యార్జనకు/విజ్ఞానార్జనకు పరిమితమైన కాలంలో ఈ ప్రయాణాలు జ్ఞానాన్ని మోసుకొచ్చేవని, కానీ ఊహాన్ లో పుట్టిన కరోనా వైరస్ అత్యంత వేగంగా విశ్వవ్యాప్తమవ్వటమే వైశ్వీకరణం అని అంటున్నారు కవి. కరోనా సమయంలో విదేశీ ప్రయాణీకుల పాట్లు ఎలా ఉండేవో కూడా ఇక్కడ వ్యాఖ్యానించారు.

కవిలోని చూపు, దార్శనికత వారిని ఇతరులనుండి భిన్నంగా నిలబెడుతుంది. కవి మనకు పరిచితమైన పరిసరాలను, విషయాలను అపరిచితం చేసి కొత్తగా పరిచయం చేస్తాడు. సామాన్య వస్తువుకు సైతం అసామాన్యతను ఆపాదిస్తారు. అది మనం తినే రొట్టె కావచ్చు, కప్పుకునే బొంత కావచ్చు, రైల్వే స్టేషన్, చీమ, దండెమ్, చిలకొయ్య ఇలా ప్రతివస్తువుతో మనిషికి ఉన్న అనుబంధాన్ని ఆవిష్కరించి ఆ వస్తువుకు కవిత్వ పరిమళాన్ని అద్దుతారు. అందుకే కరోనా భీతావహ సమయంలో కంటి ముందు కనువిందు చేసే దృశ్యమైనా కవికి సృజనాభిలాష కలుగదు అంటారు.

**"ఇప్పుడు**
**అనంత దిగంత సుందర దృశ్యాన్ని చూస్తే / కవిత్వం పుట్టదు.**
**స్వాప్నిక భావుక జగత్తు ఎంత**
**ఎదుట కనిపించే/వాస్తవాల ముందు!**
**ఇప్పుడు సౌందర్యమంటే**
**కోవిడ్ సాప్తవర్ణిక/చిత్రరాజమే దర్శనమిస్తుంది"**


కవి వాస్తవాలను విస్మరించి స్వప్నజగత్తులో విహరించలేడు. అందుకే ఈ కాలంలో ప్రతి కవికీ కరోనానే కవితా వస్తువని, ఏ కవీ కరోనా ప్రసక్తి లేకుండా కవిత్వం రాయలేడని, అసలు కవిత్వానికే కరోనా సోకిందని అంటారు–

**"కవిత్వానికి కూడా / కరోనా సోకింది.**
**ఇవాళ దాని ప్రసక్తి లేని / పద్యం అల్లండి చూద్దాం"**

కవి కూడా కరోనా భయానికి, లాక్ డౌన్ నిబంధనలకి లోబడి ఇంట్లోనే బందీగా ఉండవచ్చుగానీ, తన అక్షరాలతో ప్రపంచమంతా విస్తరించి అందరికీ ధైర్యాన్ని, స్థిమితత్వాన్ని అందిస్తాడు అంటారు గోపి. భయంలోనైనా కవిత్వమే రాస్తానని, బేలగా మారిన మనిషిని ఓదారుస్తానని ప్రతిజ్ఞ చేశారు–

**"ఇవాళ కవి/గంప కింద కోడి కావచ్చు**
**కానీ / ప్రపంచం నిండా రెక్కలు సాచి**
**అందరికీ భరోసానిచ్చే / తాపత్రయమూర్తి**






**భయంలోనైనా సరే / నేను కవిత్వమే రాస్తాను**
**నన్ను నేను కరిగించుకుంటూ/సమస్త మానవాళిగా మారిపోతాను**
**ఇవాలటి మహానిశబ్దంలో/నిన్నటి మాటల అడుగుజాడలుంటాయి**
**వాటిని నిలువెత్తు నిబ్బరగీతంగా / ఆలపిస్తాను"**

కరోనా పై పోరులో ఆయుధాలు మనం తీసుకోవలసిన ఇతర జాగ్రత్తలతోపాటు అతి ముఖ్యమైన జాగ్రత్త కరచాలన నిషేధం. స్నేహితుల మధ్య, కుటుంబ సభ్యుల మధ్య కరస్పర్శ, మాటకంటే ఎక్కువ దగ్గరితనాన్ని, ధైర్యాన్ని ఇస్తుంది. కానీ ఈ ఆపద సమయంలో మనని మనం కాపాడుకోవాలన్నా, ఇతరులను కాపాడాలన్నా భౌతిక దూరాలు అభ్యాసం చేయాల్సిందేనని కవి వాపోతారు–

**"స్పర్శ వినా బతకలేని మానవుడు**
**దూరాలను అభ్యాసం చేస్తున్నాడు.**
**అదృశ్య రాకాసిని / ఎదుర్కొనే అస్త్రశస్త్రాలు లేక**
**శూన్యంలో యుద్ధం చేస్తున్నాడు"**

కులమతాలు, వర్గభేదాలు, పేద ధనిక తేడాలు మనుషుల మధ్య అంతరాలు సృష్టిస్తాయి కానీ కరోనా వైరస్ మృత్యువీణ ముందు అందరూ సమానమేనని, ఎప్పుడూ ఏకంకాని మానవ జాతి ఒకే శ్రుతిలో స్పందించింది కరోనా వ్యాప్తి సందర్భంలోనేనని అంటారు గోపి–

**"ఎన్నడూ ఏకంకాని మానవజాతి/ఇప్పుడు ఒకే శ్రుతిలో స్పందిస్తున్నది.**
**ఊపిరితిత్తులకు/కులమత భేదాలుండవు**
**ఇవాళ స్పర్శకు నిషేధం/భయమే ఏకైక సహజాతం**
**అలజడుల మధ్య మానవత్వం ఒక మిథ్య"**

లాక్డౌన్ అందరినీ దాదాపు రెండున్నర నెలలపాటు గృహ నిర్బంధంలో ఉంచేసింది. ఉద్యోగులు, వ్యాపారులు, చిరుద్యోగులు, రోజువారీ రెక్కల కష్టం మీద బతికే బడుగు జీవులు, విద్యార్థులు, సమస్త రంగాల, సహస్ర వృత్తుల జనులు నాలుగు గోడల మధ్య తమ వారితోనే బహుశా అంతకాలం పూర్వమెన్నడూ గడిపి ఉండక పోవచ్చు. అందుకే మన ఇల్లే మనకి కొత్తగా కనిపిస్తున్నది, మానవ అనుబంధాలలోని తియ్యదనం ఆనందానిస్తున్నది, నిర్మానుష్య వీథులు

మనకు నిశ్శబ్దంగా కర్తవ్యాన్ని బోధిస్తున్నాయి అని కవి అంటున్నారు.

**తెలిసిన ఇంటినే/ఇవాళ కొత్తగా దర్శిస్తున్నాడు.**
**అనుబంధాల్లోని అందం/మకరందాన్ని వెదజల్లుతున్నది.**
**నిర్జన వీథుల్లోని నిశ్శబ్దం/అశరీరవాణిగా మారి**
**గురుబోధ చేస్తున్నది**

మానవసేవయే మాధవసేవ అనే మాట మనకు తెలుసు. కానీ నమ్మిన వారికి, మనుషుల్లోనే ఉన్న మాధవుడు, కంటిముందు కనిపించే మాధవుడు మాత్రం వైద్యుడే. ప్రపంచవ్యాప్తంగా కరోనా బాధితులను కాపాడే ప్రయత్నంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి వైద్యం చేస్తున్న వైద్యోనారాయణులు, వారికి సహకరిస్తూ, రోగులకు సపర్యలు చేస్తున్న నర్సులను తేజోమూర్తులుగా 'క్వారంటైన్' కవితలో అభివర్ణించారు కవి.

**"డాక్టర్ల పైన కోపమెుద్దు/నర్సు తల్లులను అదిలించొద్దు**
**ప్రాణాలను/తృణాలను చేసుకొని**
**వృత్తి ధర్మాన్ని/వత్తిలా వెలిగిస్తున్న తేజోమూర్తులు వారు"**

కొన్ని సందర్భాలలో రోగి బంధువులు వైద్యులపై/ఇతర వైద్య సిబ్బందిపై చేయి చేసుకోవటం, ఆస్పత్రులలో విధ్వంసాన్ని సృష్టించిన సంఘటనల గురించి మనం చూస్తున్నాం. అలాంటి సంఘటనలు ముక్తకంఠంతో వ్యతిరేకించాల్సిందే. ప్రస్తుత సందర్భంలో ఒక ప్రాణాంతక వైరస్ బారిన పడిన రోగులకు వైద్యం చేస్తే, తమకు కూడా ప్రాణహాని ఉందని తెలిసినా, తగిన జాగ్రత్తలతో అలుపెరగక వైద్యం అందిస్తున్న వైద్యులను గురించి 'వైద్యుడికే మన దండం' మరో కవిత కూడా రాశారు కవి. అందులో, యుద్ధక్షేత్రంలో కనపడని శత్రువుతో నైపుణ్యంగా పోరాడుతున్న వైద్యులు రోగులలో ఆత్మస్థైర్యం నింపుతారని, వారికే మన దండం అంటారు కవి.

**శత్రువు కనబడదు, దొరకదు / అయినా గాలిలో ఖడ్గం తిప్పే**
**సంకుల నైపుణీ సమర / వీరమూర్ధన్యుడతడు.**
**ఆత్మస్థైర్య ప్రచోదక / జీవన ప్రచారకుడతడు**

కరోనా కాలంలో రోగ భయం కంటే దేశవ్యాప్తంగా అందరి మనసులు కలచివేసిన అంశం వలస కార్మికుల తిరుగుబాటు. ఇల్లు విడిచి, ఊరు విడిచి, అయిన వారిని వదిలి పొట్ట కూటికోసం రాష్ట్రాలు దాటి వచ్చిన వలస జీవులు లాక్ డౌన్ వేళ ఊరిలో ముసలి తల్లిదండ్రులు, తమ పసిబిడ్డలు ఎట్లా ఉన్నారోననే ఆరాటం తమ ఊరి దిక్కుగా కాలినడకన సాగిపోయేలా చేసింది. కన్నీళ్ల మూటగట్టుకుని కట్టుబట్టలతో, ఎర్రటి ఎండల్లో చెప్పుల్లేని కాళ్లతో వందలాది మైళ్ళు సాగిన వారి ప్రయాణాన్ని ప్రపంచమంతా చూసింది. అలుపెరుగని వారి నడకను చూస్తున్నవారు దుఃఖంలో తడసిపోయారు. వ్యవస్థల పనితీరుమీద తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. ప్రజాస్వామ్య పాలనలో ఇదొక విషాద మరక. ఇలాంటి వలస జీవుల వేదన గురించి కవి మూడు కవితల్లో ప్రస్తావిస్తారు.

**"నా నడకగురించే/ఆలోచిస్తున్నానుగానీ**
**తిండిలేక కూలీలు/వందలాది మైళ్ళు నడిచే**
**సామూహిక దృశ్యం గుర్తొచ్చి**
**ఇప్పుడు/నిజంగా రక్తం వేడెక్కింది**
**సిగ్గుతో ఇంటివైపు మళ్ళాను**
**ఇవాళ ఇంట్లో కూర్చుంటే**
**ఇల్లులేనివాళ్ళు గుర్తుకొస్తున్నారు.**
**తిండికోసం కండలు కరిగించే**
**కష్టజీవులు కళ్ళలో మెదులుతున్నారు"**


గోపిగారు కరోనా సందర్భంలో రాసిన కవితలన్నింటినీ ఒకేసారి పరిశీలిస్తే నాటి పరిస్థితులలోని అన్ని విషాద కోణాలను వారు స్పృశించినట్లు అర్థమవుతుంది. అయితే తన పరిశీలనను, తన దృష్టికోణాన్ని, తన కవితా అభివ్యక్తి నిపుణతను ప్రకటించడానికి వారు ఈ కవితలను రాయలేదు. ఆ వాతావరణ తీవ్రతలోని వేదనోద్వేగాన్ని తట్టుకోలేని అనివార్యస్థితిలోంచి ఉబికి వచ్చింది ఈ కవిత్వం. లాక్‌డౌన్ రోజులలో తన చుట్టూ ఆవరించిన నిశబ్దాన్ని బద్దలు కొట్టడానికి, తన ఒంటరితనం నుండి బయటకు రావడానికి కవి చేసిన ప్రయత్నంగానూ ఈ కవితలను మనం చూడవచ్చు.

కవిత్వం అందించే శాశ్వత విలువలపై డా.ఎన్.గోపికి గాఢమైన నమ్మకం ఉంది. ఇటువంటి పెను ప్రళయ కాలంలో మానవాళి ప్రాణభీతిని చూస్తూ ఏం చేయాలనే స్పష్టతతో ఉన్నారు. అందుకే **"ఇది కీర్తి కోసం రాసినవి కాదు. ఆర్తి వీటి రచనా హేతువని"** కవి భావన. ఇది మనిషి విలువల సంపుటికి లిట్మస్ పరీక్ష లాంటి సమయమనే ఆలోచన అంటూనే తన కర్తవ్యాన్ని నిరూపించు కున్నారు. ఎన్.గోపి కవిత్వం వర్తమాన జీవితాన్ని విస్మరించదు. సమకాలీన పరిణామాల్లో సామాన్యుడికి ఎదురయ్యే బాధలను గమనిస్తూనే ఉంటుంది. కవిగా వారి కన్నీటిని తన చూపుడు వేలుతో తుడిచే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఈ కవిత్వమంతా భూగోళాన్ని చుట్టుముట్టిన విషాదాన్ని తరిమి వేసే పోరాటాన్ని చేసింది. ఒక భయానక వాస్తవాన్ని ఎదుర్కోవడానికి అందరం సామూహికంగా చేయవలసిన ప్రణాళికలను కవిత్వ రూపంలో చెప్పారు కవి. **"ఎంత సుదీర్ఘ రాత్రి అయినా ఉషస్సు రాక తప్పదు. దానికోసమే మనందరం ఎదురు చూద్దాం"** అన్న కవి ఎదురుచూపులు ఫలించాయి. నేడు మనమంతా మాస్కులు లేని లోకంలో సంచరిస్తున్నాం. ఈ ఆర్కైవ్ కవిత్వం భావితరాలకు కవితా గుణ పాఠాలు.



# కవుల ఊహలకు కట్టిన వేదిక

డా. కాచాపురం దుర్గాదేవి, ఫోన్ : 789 309 3495






"నా మూలమ్ లిఖ్యతే కించిత్ నానపక్షేతమ్ ఉచ్యతే" (మూలములో ఉన్న దానిని ఉన్నట్లే చెప్పెదను. లేని దానిని కల్పించను) అని మల్లినాథుడు చెప్పిన మాట వ్యాఖ్యాతలకు ఆదర్శ ప్రాయమైంది. ప్రాచీన కాలంలో వ్యాఖ్యానించడమే విమర్శ. క్రమంగా గుణదోషాలను విచారించడం కావ్య సౌందర్యం, తాత్వికదృక్పథం, వస్తునిర్మాణము, శిల్పం, ధ్వని విశేషాలు, పాత్ర చిత్రణ, శబ్ద చర్చ, వర్ణనలు, అలంకారాలు కూలంకషంగా చర్చించడం ఆధునిక విమర్శ లక్షణంగా కొనసాగింది.

ఒక్కొక్కప్పుడు కవి హృదయం కవికి తెలియకపోవచ్చు గాని కవి అభిప్రాయాలు సరిగా గుర్తించి లోకానికి తెలిపే ప్రజ్ఞాశాలి విమర్శకుడు అని అంటారు. నేటి అత్యాధునిక విమర్శ ఎన్ని రూపాలెత్తి కొత్త పుంతలు తొక్కి తన పరిధిని విస్తరించుకుందో తెలుసుకోవాలంటే ఏనుగు నరసింహారెడ్డి రచించిన ఊహల వేదికను చదవాలి. ముందుమాటలు, సమీక్షలు, వ్యాసాల రూపంలో పాఠకులకు చేరువైన ప్రామాణిక విమర్శనా వ్యాసాలతో కలిసి రూపుదిద్దుకున్న విమర్శనా గ్రంథమిది. సాహిత్యము, చరిత్ర, భాషలలో సమాన ప్రతిభా సంపత్తి గల ఏనుగు నరసింహారెడ్డి వందలాదిమంది కవులు వారి రచనలు, పాశ్చాత్య తత్వవేత్తలు, రచయితలు, ఉద్యమాలు, పోరాటాలు, చారిత్రక సంఘటనలు, పురాణగాథలు, ఐతిహ్యాలు, సంస్కరణలను ఈ గ్రంథంలో భాగస్వామ్యం చేసినారు.

కవిత్వాన్ని ప్రధానంగా చేస్తూ పుస్తకాల కవులు, కాలాలు, భౌగోళిక పరిస్థితులు, సామాజిక స్థితిగతులు, జీవన విధానాలు, వారు ఎన్నుకున్న వస్తువులపై గల ప్రభావాలు అన్నింటిని కూలంకషంగా చర్చించినారు. ఇందులోని 62 వ్యాసాలలో పాట, పద్యం, గేయం, గజల్, వచన కవిత, యక్షగానం, బుర్రకథ నేటి ఆధునిక కాలంలోని కొత్త రూపాలు. ఇలా ఏ రూపాన్ని విమర్శించినా ఇందులోని ఏక సూత్రత అన్ని వ్యాసాలు కవితా ప్రక్రియవై ఉండడమే.

ప్రతి కవితా రూపపు పుట్టుపూర్వోత్తరాలు ఆయా కవితా రూపాలలో ప్రఖ్యాతి చెందిన ఎందరో కవులను వారి రచనలను విభిన్న రూపాల లక్షణాలను నియమాలను పూర్తిస్థాయిలో చర్చించడం వలన ఉపయుక్తమైన సాహిత్య గ్రయావన్ని చదువుతున్న భావనను కూడా పాఠకుడు పొందుతాడు.

గర్రెపల్లి కవితా మాధురిలో బ్రిటిష్ పాలనా కాలంలో హైదరాబాద్ సంస్థానములోని తెలంగాణ ప్రజల విద్యను, సంస్కృత ప్రేమను వివరంగా అందించారు. అదేవిధంగా ఎన్.టి.రామారావు అధికారంలో స్థిరపడి ప్రభుత్వోద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 58 నుండి 55 కు తగ్గించగా ఆ వేదనతోనే గర్రెపల్లి కన్నుమూసాడని తెలుపుతారు. ఆ సమయాలలో దాశరథిని ఆస్థాన కవి పదవి నుండి అవమానకరమైన పద్ధతిలో తొలగించిన విధానాన్ని తెలిపి సీమాంధ్రులు కవులపై జరిపిన దాడిని అంచనా వేయిస్తారు. గజ్జెల రామకృష్ణ కవితని విమర్శించే సందర్భంలో నేతకళలో ఆరితేరిన నేతగాళ్ల మునివేళ్లు బ్రిటిష్ వాళ్ళు తమ వ్యాపారాభివృద్ధి కొరకు నరికివేసిన సంగతిని, నేత వృత్తికారులను దెబ్బ తీసిన బొంబాయి టెక్స్‌టైల్ కార్మికుల సమ్మె పరిణామాలను వుటంకిస్తారు.

పుష్పలత కవిత్వాన్ని విమర్శిస్తూ నిషిద్ధాక్షరం కవయిత్రిలో అటు విప్లవ సానుభూతి, ఇటు దళితవాదం సమాంతరంగా ప్రయాణం చేస్తున్నాయంటూ కుల పోరాటాలు వర్గ పోరాటాల మధ్య వైవిధ్యాన్ని తెలుపుతూ 2018లో 'లాల్ నీల్' కూటమిని ప్రస్తావిస్తారు.

పోరెడ్డి రంగయ్య గారు అందించిన భువన కవనాన్ని విమర్శిస్తూ ఆనాటి మూడవ సింగభూపాలుడితో ప్రారంభించి 2016 అక్టోబర్ 11న ఏర్పాటయిన యాదాద్రి భువనగిరి జిల్లా వరకు ఇటు చరిత్రను అటు సాహిత్యాన్ని సమాంతరంగా విశ్లేషిస్తూ పోతన శ్రీనాథుడులతో ప్రారంభమై ఎన్. గోపీల వరకు సాహిత్యాన్ని విమర్శించడమే కాకుండా అగ్నిపర్వతాలు నిక్షిప్తం చేసిన రాతి సంపదను భువనమల్లుడి పేరు మోస్తున్న ఏకశిల ప్రకృతి సౌందర్యాన్ని పోచంపల్లి, బొల్లెపల్లి, భూదానోద్యమ గాథలను పొందుపరిచిన తీరు ఉద్గ్రంథాన్ని చదివిన భావనను కలిగిస్తుంది.

రెబ్బ మల్లికార్జున్ లోహకాలం ఆర్ద్ర కవిత వ్యాసం నేపాల్ రాజు దీపేంద్ర తన తల్లిదండ్రులతో పాటు 9 మందిని కాల్చి చంపడం, ఆఫ్ఘనిస్థాన్ లో తాలిబన్లు అధికారం చేపట్టడం, స్పానిష్ ఫ్లూ, కరోనాల వాస్తవ గాథలతో అనూహ్యంగా ప్రారంభమై గగుర్పాటుతో కూడిన ఆసక్తిని కలుగజేస్తుంది.

తనకు తెలిసినంతలో కోమటి కొట్టు పై మడత భాస్కర్ దే తొలి కవిత అంటారు. రిలయెన్సుకూ ఊరికొట్టుకూ ముడిబెట్టడం మన వితండ వాదమని వీటికి నడుమ సంస్కృతానికి దేశి కవిత్వానికి ఉన్నంత తేడా ఉందంటారు.

పాలడుగు నాగయ్య 1943లో జన్మించి 1982లో మరణించారు. వీరు **"అంబేద్కర్ బుర్రకథలో అంబేద్కర్ గారు జన్మముతోనే అపరమనువండి సమత భావము కలవాడు సాంఘిక కర్త యండి"** అంటారు. దీనిని విమర్శిస్తూ ఈ వస్తువును ఇప్పుడు ఏ దళితవాది Positiveగా చూడలేదు అంటూ కవి ఉపయోగించిన మాటల ఆధారంగా నాటి సంఘర్షణామయ దళిత జీవితాలను చర్చిస్తారు. 1970 గోదావరి లోయ పోరాటాన్ని 1945 నుండి జరిగిన సాయుధ పోరాటాన్ని వివరిస్తారు.

'అమ్మ' కవులకు ఓ భిన్నమైన జ్ఞాపకంలో గ్రీక్ కథైన ట్రోజర్ వార్ సందర్భంలో అలిచిస్ అతని తల్లి కథ, దుర్యోధనుడు గాంధారి కథ, పులి చేతికి చిక్కిన ఆవుకథ, ఉప్పల నరసింహం రాసిన 'ఇత్తనపు కోడె' కథలతో సమన్వయ పరుస్తారు. అమ్మ అనే వస్తువు చుట్టూ అల్లుకున్న కవిత్వాన్ని సమర్థించడానికి ఎన్నుకున్న కథలలోని వైవిధ్యం గమనింపులోకి వచ్చి తీరుతుంది. ఒక పాశ్చాత్య ఒక పౌరాణిక ఒక ఐతిహాసిక ఒక ఆధునిక కథలు కాకతాళీయంగా వచ్చి చేరలేదని భౌగోళికదూరాలు యుగాల కాలాలు ఏవి ఎంత మారినా 'అమ్మ' అమ్మనే అన్న భావాన్ని బలపరుస్తూ కవిత్వాన్ని విశ్లేషించిన తీరు విమర్శకులకు ఆదర్శనీయం కాకుండా ఎలా ఉంటుంది.

చీదెళ్ల సీతాలక్ష్మి, దండమూడి శ్రీ చరణ్ కవిత్వాలను విమర్శిస్తూ తనను తాను నియంత్రించుకోలేక కవిగా పరకాయ ప్రవేశం చేస్తారు. విమర్శంతా కవిత్వమే అనిపిస్తుంది **"పడవ చేయడానికి కాగితాన్ని మడతలు పెట్టినట్టు మెత్తగా కవిత్వం చెబుతూ పోయాడు"**అని అంటారు ఇది అభిలషణీయం కూడా.

ప్రధానంగా కవిత్వం ఆవశ్యకత కవుల బాధ్యతలు ఏమిటి కవిత రచన నిర్వహణ ఎలా ఉండాలో తెలిపే పేరాలు వాక్యాలు పెద్ద మొత్తంలోనే అడుగడుగునా తారస పడుతుంటాయి. ఈ విషయంలో కొత్త కవులు రచయితలు విమర్శకుల పట్ల బాధ్యతాయుతమైన అధ్యాపకుడి పాత్రను ఏనుగు నరసింహారెడ్డి పరిపూర్ణంగా పోషించినారు.

ఒకచోట **'కవిత్వం వస్తే రాసేదే కానీ రాస్తే వచ్చేది'** కాదంటారు. వాసర చెట్ల జయంతి కవిత్వాన్ని విమర్శిస్తూ భౌతిక ఉద్యమాలకు కానికాలం దాపురించిన రోజులివి కాబట్టి నినాదాలు వాక్యాలను ప్రత్యామ్నాయంగా పాఠకుడిని బాధ్యతాయుతుడిగా తయారు చేయడమే ఇప్పటి కవుల లక్ష్యం. అందుకు గొప్ప ఊహలు కొత్త ఆలోచనలు తక్షణావసరం అంటారు.

కొలకలూరి ఇనాక్ గారి కవిత్వాన్ని విమర్శిస్తూ అపరిమితత్వం సాహిత్య సృజనకు కావలసిన మూలధనం అని కవిత్వానికి మల్టీ డైమెన్షన్స్ ఉండడం గొప్ప లక్షణమనీ అంటారు.

డాక్టర్ రాయరావు సూర్యప్రకాశ్ రావు సంపాదకత్వం వహించిన భావదర్పణం గురించి రాస్తూ కవిత్వం ఒక తీరని దాహం అన్న శ్రీశ్రీ మాటలను వైవిధ్య భరితంగా సుదీర్ఘంగా చర్చించారు. తాళపత్రంతో ఆరంభమైన సాహిత్యం సాఫ్ట్ కాపీ సృజనతోపాటు సాంద్రకవిత్వం దిశగా కూడా పయనించాలంటారు..

ఒక వైపే మొగ్గుచూపని తత్వం నిజమైన విమర్శకుడి సొంతం. సిరివెన్నెల సీతారామశాస్త్రి సాహిత్యాన్ని విశ్లేషించిన తీరులో అది స్పష్ట మవుతుంది. అమ్మానాన్న శతక వ్యాసంలో కవయిత్రి శాంతారెడ్డి పాలమూరు కేంద్రంగా మహిళల కోసం ప్రత్యేకంగా సాహిత్యోద్యమం చేస్తున్న వారుగా అభినందించబడడం ఆదర్శనీయం.

కవితారచనలో ఎత్తుగడ నిర్వహణ ముగింపులు ఎలా ఉండాలో సీనియర్ కవులు విమర్శకులు అందరూ సర్వసాధారణంగా వివరించే ఉపయుక్తమైన విషయమే. ఇందుకు భిన్నంగా కవిత్వం రాయాలంటే పూర్వరంగాన్ని ఎలా ఏర్పరచుకోవాలో వ్యక్తిత్వాన్ని ఎలా నిర్మించు కోవాలో ఏ విధంగా సంసిద్ధులు అవ్వవలసి ఉంటుందో నక్క హరికృష్ణ కవిత్వాన్ని విమర్శించే వ్యాసంలో ఆసక్తికరంగా వివరిస్తారు. **"కిరీటాలు తొలగించుకోవాలె భుజకీర్తులు తీసి పక్కన పెట్టాలే........ సారూప్యమైన ఊహలు వెతుక్కోవాలె కొత్త అనుభవాలకు మనల్ని మనం అనుసంధానం చేసుకోవాలె. నూర్ల పాదాల సాహిత్యాన్ని అక్కున చేర్చుకోవాలె. అప్పుడు గాని నూటొక్కటో పాదం పురుడు పోసుకోదు"** అంటారు.

ఈ ఊహల వేదికలో జాషువా, సినారె, ఆత్రేయలతో పాటు దాసోజు లలిత, నిజం శ్రీరామమూర్తి, దొరవేటి, ఎండల నరసింహులు యాదగిరి, ఎడ్లలక్ష్మి, బండికాడి అంజయ్య గౌడ్, డాక్టర్ బాలకృష్ణ, నూతక్కి రాఘవేంద్రరావు, మూర్తిశ్రీదేవి, కర్నాటిలింగయ్య, గులాబీల మల్లారెడ్డి, ఉగ్రగౌడ, అంబల్ల జనార్దన్, దాసరిశ్రీనాథ్, మాడభూషి సంపత్ కుమార్, ఖాజా దామెరరాములు, కే ప్రభాకర్, గడ్డంశ్యామల, నారాయణరెడ్డి, చిగురుమల్ల శ్రీనివాస్, డాక్టర్ యమ్ యస్ బృంద, హసేన, కొప్పుల యాదయ్యల కవిత్వం కూడా ప్రామాణికంగా విమర్శించబడింది.

తెలంగాణలోని ప్రతీకవి విని గర్వపడే నినాదం **"ఒకప్పటి మాట తెలంగాణలో కవులు పూజ్యం ఇప్పుడు తెలంగాణ కవుల రాజ్యం"** ఈ నినాదం సృజనకారులు ఏనుగు నరసింహారెడ్డి గారు ఊహల వేదికను వేదిక చేసుకొని గ్రంథస్థం చేయడం ఆనందింప దగినది.


16 గ్రంథాలను రచించిన సుప్రసిద్ధులైన కవి, విమర్శకులు, అనువాదకులు ఏనుగు నరసింహారెడ్డి. ఈ ఊహల వేదికలో కవిత్వం అంటే దేన్నీ ధిక్కరించడమూ కాదు దేన్నీ ఆలింగనం చేసుకోవడం కాదు బాధ్యతాయుతమైన జీవనం, హేతువు ఆధారమైన జీవనం, సత్యాన్వేషణం కూడా' అని అంటారు. వీరు రచించిన ప్రఖ్యాతి చెందిన తెలంగాణ రూబాయిలు కూడా ఈ అన్వేషణ కొరకు చేసిన ప్రయాణమే. ఏనుగు నరసింహారెడ్డి గారి ఈ సత్యాన్వేషణ నిరంతరంగా కొనసాగాలని ఆశిద్దాం.

❖ ❖ ❖ ❖ ❖

# అయాచితం నటేశ్వరా! శతక వైభవం!!

సుప్పని సత్యనారాయణ, తెలుగు అధ్యాపకులు, బాన్సువాడ. ఫోన్ : 9492626910






ఉమ్మడి హిందువు జిల్లా సాహిత్య చరిత్రకు భీష్మాచార్యుల వంటి వారు, సంస్కృతాంధ్ర పండితులు, అష్టావధాని, దాశరథి పురస్కృతులు, శ్రీమాన్ బ్రహ్మశ్రీ డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ. వీరి కలం నుండి జాలువారని కవితా ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కానేరదు. చారిత్రక పరిశోధనలో, ఉభయ భాషల్లో కలిపి ఎన్నో మేలిమి కృతులను వెలువరించారు. ఈమధ్య వారి లేఖిని నుండి జాలువారిన నూతన రచనయే ఈ నటేశ్వరా! శతకము. ఇది వారి ముద్రిత రచనల యందు 51 వ పుస్తకం.

పద్యం అంటే పరమ ప్రామాణికంగా భావించే నటేశ్వర శర్మ కలం, ఎన్నో శతకములకు, కావ్యములకు, సిద్ధాంత గ్రంథాలకు ఆయువుపట్టు అయినప్పటికీ, వారి సొంత దస్తూరి తో వెలువరించిన తొలి గ్రంథం ఈ నటేశ్వరా! శతకము. ఇది దీని యొక్క ప్రత్యేకత. అందమైన చేవ్రాలు గల నటేశ్వర శర్మ ఏ పద్యమునైనా, కవిత్వాన్ని అయినా దానికి ఒక జీవం నింపే విధంగా వారి దస్తూరి మనకు కనిపిస్తుంది. అది వర్తమాన సారస్వత లోకంలో ఎందరికో ఆదర్శంగా నిలిచింది. మునుముందు నిలుస్తుంది అనడంలో ఎంత మాత్రమూ సందేహం లేదు.

ఆత్మ ప్రబోధాత్మకమైన ఈ కావ్యమునందు రచయిత తనలోని భావనలను, అనుభూతులను, ఆలోచనలను సమన్వయపరిచి, ప్రతి పద్యము నందు లోక రీతులను, నీతులను అత్యంత సుందరంగా, మనోహరంగా చెక్కిన తీరు, మనకు ప్రతి పద్యం నందు గోచరిస్తుంది. శివుడి పట్ల అపార భక్తి ప్రభత్తులు కలిగినటువంటి నటేశ్వర శర్మ తనలోని 'ఆర్తి'ని, సంవేదనను శివోహం (తనలోకి పరమేశ్వరుని ఆవహింప చేసుకోవడం) గా మార్చుకున్నారు. జీవుల పట్ల, సకల ప్రాణుల పట్ల అపార కరుణా పారావార సముద్రుడైన ఆ నటరాజుకు, తన భక్తి ప్రభక్తులతో ఆ స్వామికి నివేదించడమే ఈ కావ్యము నందలి ప్రతి పద్యం యొక్క ఆంతర్యం. అట్లే ఆ స్వామి కృపాకటాక్షములే ఈ కావ్య రచనకు కారణభూతాలని, కావ్యారంభమున రచయిత తన నివేదనలో విన్నవించుకున్నారు.

తనకు తానే విన్నవించుకోవడం (ఆత్మ ప్రబోధాత్మకం) అనేది ఒకరకంగా ఆత్మ పరిశీలనయే. అంతరాత్మ సాక్షిగా అని కూడా భావించవచ్చు. నటేశ్వరా! అన్న మకుటంతో సాగిన ఈ శతకమునందలి చెంపకోత్పలములు, అయాచితం నటేశ్వర శర్మ మనోభావాలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచినాయి. తన మదీయ దైవమైనటువంటి ఆ పరమేశ్వరుడిని 'నటరాజు' గా కీర్తింపబడడం, తన పేరు నటేశ్వరునిగా పిలువబడడం ఒకరకంగా చెప్పాలంటే, పరోక్షంగా తనలో దాగిన శివునికి విన్నవించడమే. ఇది అందరి వలన అయ్యే పని కాదు. తన రచనలను, తన అమలిన హృదయమును ఆ పరమేశ్వరుని దివ్య చరణారవిందములయందు అర్పించడం మరో విధంగా చెప్పాలంటే, తనకు తాను దైవదత్త మవ్వడం. ఈ భావన దైవం పట్ల ప్రగాఢమైన భక్తి విశ్వాసాలకు తార్కాణం.

నడిచే పద్యం గా కీర్తింపబడిన అయాచితం వారికి, పద్యం అంటే ఎంత ప్రాణమో, ఎంత అభిమానమో ఈ క్రింది పద్యమును చదివితే గాని తెలియదు.

**ప్రొద్దున లేచినంత విరబూయును నామది తోటవాకిటన్**
**పద్దెపు పువ్వు దాని వరభవ్యపరీమళమెల్ల వీచెడిన్**
**హద్దులు లేక విశ్వమును హాయిగా పొద్దున దాటి రమ్యమై**
**ముద్దులు గొల్పిపాఠకుల ముగ్ధుల జేయునురా! నటేశ్వరా!!**

సుప్రభాత వీచికలతోనే తనలో పద్య సుమ దళాల పరిమళం తన మది తోటవాకిట వచ్చి, గుబాళింప చేస్తుందంటారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ పద్యము విన్న వెంటనే అయాచితం కుసుమ కోమల సమన్వితమైన హృదయం ఎటువంటిదో అవగతం అవుతుంది. తనను నిద్దుర లేపే పద్యమే తదనంతరం పాఠకుల హృదయాలకు చేరి వారిని ముగ్ధులను చేస్తుందని సగర్వంగా ప్రకటిస్తారు. ఇది కూడా ఒక కవికి, రచయితకు ఉండవలసిన ఆత్మవిశ్వాసం. తెలుగు భాష ఔన్నత్యమును, వైశిష్టమును గుర్తెరిగిన అయాచితం వారు, మాతృభాష గొప్పతనమును కళ్ళకు కట్టినట్టు చూయించే ఈ పద్యమును ఒకసారి చూడాలి.

**వెలుగుల జిల్గులన్ విరియు వెల్లడిజేయును సర్వ భావముల్**
**లలితములైన మాటల విలాసములన్ దనరంగజేయు,స**
**మ్మిళితములైన రాగముల మేలనగీతమువోలె శ్రావ్యమౌ**
**తెలుగును విస్మరించకు సుధీవిభుతన్ గనరా నటేశ్వరా!!** (11వ)

'మాతృభాషను విస్మరించడం అనేది మానవాళికి శ్రేయస్కరం కాదు' అనే సత్యాన్ని ఈ పద్యము నందు స్పష్టం చేసి,తల్లి భాష పట్ల తనకున్న గౌరవ అభిమానాలను చాటుతారు. అట్లాగే భాష యొక్క పుట్టు పూర్వోత్తరాలను తెలియజేస్తూ, భాషా స్వరూప స్వభావాలను కళ్ళకు కట్టినట్లు తెలియజేసే ఈ పద్యమును ఒకసారి గ్రహించవలసిందే.

**భాష సరస్వతీ మయము,భాషయె బ్రహ్మము, నిత్యసత్యమున్**
**భాషయె, భావనల్ నిలుపు భాగ్యము, భాషయె జీవమయ్యెడిన్**
**భాషను గౌరవింపవలె, భాషను నేర్వగ బూనుకోవలెన్**
**భాషలుదాల్చి మానవులు భామయులౌదురురా! నటేశ్వరా!! (13)**

అంటూ..భాషను అవహేళన చేసి, భాషను చిన్నచూపు చూస్తున్న కొందరు మనుషులకు కనువిప్పు కలిగించే విధంగా ఈ శతకమునందలి 14వ పద్యమును కూడా చూడవచ్చు. శ్రీకరమైన మాట గుణశేఖరమై వెలుగొందుచుండు నని విశ్వసించే రచయిత, శుభమైన, జనసమ్మతమైన మాటలు (9వ.పద్యం) సంధ్య వేళ, కమనీయ కాంతిమయములై ప్రభాతవేల దినకరుని వెలుగులవలె అనునిత్యం భాసిల్లుచూ, ఆనంద ఆహ్లాదములను మనసుకు కలిగించడమే కాకుండా, హృదయానికి హత్తుకుంటాయని అయాచితం చెబుతారు. అలాగే మానవుడు ఎలా జీవించినా అది పల్లె అయినా పట్టణమైన ఎల్లప్పుడూ చల్లదనమును సమకూర్చేవి, మానవాళికి వేరుచేసి జీవితముకు సుగమం చేసేవి చెట్లే కదా! అటువంటి చెట్లను చల్లగా చూడడమే కాదు, వనములను అడవులను సమూలంగా నాశనం చేయడమే వలన మానవాళి మనుగడ అసాధ్యమననే విషయాన్ని కూడా పరోక్షంగా శతకం నందలి ఏడవ పద్యం సూచిస్తుంది.

గానకళా ప్రపూర్ణులైన కళారవులకు కమ్మని గానమాధుర్యమే ప్రీతికరమని, కళలచే మనుజుడు నిత్యం ఆనందోత్సాహాలతో గడుపుతాడని, శతకమునందలి ఎనిమిదవ పద్యంలో తెలియపరుస్తూ, మంచి కావ్యముల యొక్క పఠనం ఎంత గొప్పదో ఈ క్రింది పద్యం నందు తెలియపరుస్తారు రచయిత.

**కావ్యములన్ పఠింపక వికాసమువచ్చునె మాతృభాషలో?**
**కావ్యములేకదా సృజన కాంతులనిచ్చు కవీంద్రకోటికిన్?**
**దీవ్యదనంతభావనల దీపములై విలసిల్లు కావ్యముల్**
**శ్రావ్యత వానిమూలమయి రంజిలజేయునురా! నటేశ్వరా!!** (24)

సత్కావ్యపఠనం మాతృభాషలో ఒక చైతన్య వాతావరణము ఏర్పాటు చేస్తుందని అనడమే కాకుండా, కావ్యములు కవిలోని సృజన కాంతులను తెలియపరుస్తాయి. మనిషిలోని అనంత భావనలకు ప్రతీకలై ప్రతిరూపాలై వెలుగు దివ్వెల వలె పాప తిమిరములను నాశనం చేస్తాయి. శ్రావ్యమైన భావజాలాన్ని సత్ప్రవర్తనను కలుగజేసి మనిషిని నిరంతరం పురోగమనములో పయనించే విధంగా దోహదపడతాయని అయాచితం వారు ప్రకటిస్తారు.

తన మనసుకు నచ్చిన చక్కటి వేదిక, అమృతతుల్యములైన పలుకులను పలికే స్నేహితులు, వినేందుకు ప్రేమతో ముందుకు వచ్చే ఆత్మీయులు, సన్నిహితులు, వినయ వివేకములకు ప్రతిరూపాలైన రసహృదయులు ఇంతమంది తన చుట్టూ ఉన్న తర్వాత, మంచి కవిత్వం వికసించకుండా ఎలా ఉంటుంది? అంటారు నటేశ్వరుల వారు. ఈ పద్యం వినగానే అల్లసాని పెద్దన గారి 'నిరుపహతీ స్థలంబు రమణీ ప్రియ దూతిక తెచ్చియిచ్చు'.... అనే పద్యం మనకు స్ఫురించక మానదు. చిన్నప్పటినుండి అపారమైన గురుభక్తి తత్పరతను కలిగినటువంటి నటేశ్వరులవారు, ఆ గురువు యొక్క గొప్పతనమును వివరిస్తూ చెప్పిన ఈ పద్యాన్ని చూడవచ్చు.

ఈ విధంగా మొత్తం 108 మధ్య రత్నములతో అలరారుతు, నటరాజైన ఆ పరమేశ్వరుణ్ణి కొనియాడబడుతూ, ఆత్మ ప్రబోధాత్మక మైన సద్భావనలతో రసహృదయుల మనసును రంజింప చేయడమే కాకుండా, ఎల్లరకు వర్తింపజేసేటువంటి భావనారాశి ఈ శతకము నందు కొదవలేదనేది పరమ సత్యం. ఈ నటేశ్వరా! శతకం, శతక సాహిత్య చరిత్రకు ఒక మకుటాయమానంగా వెలుగొందుతుంది అనడంలో రవ్వంత కూడా సందేహం లేదు. వర్తమాన సాహిత్య లోకానికి ఎంతో ఉపయోగకరమైన ఈ శతకరాజమును ప్రతి ఒక్కరూ చదవవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి మరెన్నో సత్కృతులుగా భాసిల్లే కావ్య రచనలు గురుతుల్యులు బ్రహ్మశ్రీ డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారి కలం నుండి రావాలని కోరుతూ, వారి పాదపద్మములకు శత సహస్ర నమస్సులు.

❖ ❖ ❖ ❖ ❖


**మూసీ**

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సంIIలు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**


## స్వ'కృతి'



**హంస వింశతి విజ్ఞాన సర్వస్వము**
డా. గుంజి వెంకటరత్నం, 9951907390
వెల : 500/-
**ప్రతులకు :** ఎమెస్కో బుక్స్ ప్రై. లిమిటెడ్,
1-2-7, బానూ కాలనీ, గగన్‌మహల్ రోడ్,
హైదరాబాద్ - 500 029.




**అందమే ఆనందం (కథలు)**
డా. వరిగొండ సత్య సురేఖ
వెల : 120/-
**ప్రతులకు :** రచయిత్రి, కేరాఫ్ సన్‌రే ఇండియా,
47-15-4, ఫస్ట్ ఫ్లోర్, గుర్‌బాంగ కాంప్లెక్స్,
ద్వారకానగర్, విశాఖ పట్నం.
ఫోన్ : 9849248495



**కదలిక (సాహిత్య వ్యాసాలు)**
కందుకూరి అంజయ్య
వెల : 150/-
**ప్రతులకు :** కందుకూరి సుహాసిని, 10-4-311,
సుభాష్ నగర్, రోడ్ నెం. 8,
కరీంనగర్ - 505001.
ఫోన్ : 94902 22201



**నేను - నా ఆకాశ దర్శన్ (ఆకాశవాణి మరియు దూరదర్శన్ సంస్థల్లో అనుభవాలు)**
- డా. పాలకుర్తి మధుసూదన రావు,
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 11-13-1329, రోడ్ నెం. 4-బి, 'ఇందిరా నిలయం', మార్గదర్శి కాలనీ, హైదరాబాదు - 500 035.
ఫోన్ : 9618881420



**"అనగనగా ... మా బడి పిల్లల" కథలు**
- సంపా. మాడుగుల రాములు
వెల : 200/-
**ప్రతులకు :** మాడుగుల రాములు,
ఇం.నెం. 6 - 6 - 279,
శర్మ నగర్, కరీంనగర్.
ఫోన్ : 9701189242

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

| | | |
|---|---|---|
| 1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి | రూ. | 2875 - 00 |
| 2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము | రూ. | 1200 - 00 |
| 3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు | రూ. | 350 - 00 |
| 4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు | రూ. | 100 - 00 |
| 5. శాసన సంపుటి | రూ. | 150 - 00 |
| 6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. | | 100 - 00 |
| 7. షబ్నవీస్ శతజయంతి సంచిక | రూ. | 100 - 00 |
| 8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు | | 90 - 00 |
| 9. త్రిపురాంతక దేవాలయ శాసనములు | రూ. | 75 - 00 |
| 10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర | రూ. | 75 - 00 |
| 11. దేవాలయ వాస్తుశిల్పము | రూ. | 50 - 00 |
| 12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక | రూ. | 50 - 00 |
| 13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక | రూ. | 75 - 00 |
| 14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక | రూ. | 100 -00 |
| 15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక | రూ. | 100 - 00 |
| 16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు | రూ. | 175 - 00 |

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,**
**హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**


# మనసు పయనం

కొన్ని భావాలు
శీర్షికల దగ్గరే ఆగిపోతాయి,
రాయడానికి ఏమీ లేక కాదు
ఆకాశమంతా హృదయాన్ని
గుప్పిట్లో బంధించలేం కదా!



కొన్ని మాటలు
పెదవుల దగ్గరే ఆగిపోతాయి,
చెప్పడానికి ఏమి లేక కాదు
మనసులో దాగున్నవి
మాటల్లో ఇమడ్చలేం కదా!

కొన్ని కలయికలు
చూపుల దగ్గరే ఆగిపోతాయి,
దగ్గరవడం ఇష్టం లేక కాదు
దూరాన్ని తగ్గించే దగ్గరను
కొలత పెట్టలేం కదా!



కొన్ని బంధాలు
దూరంగానే ఉంటాయి,
వెళ్ళడానికి దారి లేక కాదు
మనసు పయనాన్ని
లెక్కలేసి పట్టలేం కదా!



కొన్ని అనుభవాలు
కాలం వెంబడి నడక సాగిస్తూ
జ్ఞాపకాలై నిలిచుంటాయి!

ఏది, ఎప్పుడు, ఎందుకని
ఎవరిని అడిగినా శూన్యమే,
మనసు పయనం మన చేతిలో లేదు
కాలం చూపే దారిదీపం అది!


పుట్టి గిరిధర్, 9494962080

# స్వప్నం ??

నిన్నటి నిశా సభలో...?
నిఖిల రత్నాన్ని చూశాను
నా హృదయ కడలిలో
దాచానో లేదో...!
ఉదయపు అరుణ
కాంతులలో మెరుస్తూ
నన్ను మైమరిపింప చేస్తూ
ఆమె ప్రతిబింబమే
నా జాడను తెలియజేస్తుంది.



గాఢమైన సుషుప్తి లో
నిగూఢంగా విహరిస్తూ
నా దిశను నలు దశలుగా
ప్రసరింప చేస్తు తన ఉనికికై
ఉబలాటపడుతున్నది



ఊహకే ఊపిరి పోసిన వయ్యారి
నా తలపున చేరి
కనుసైగా చేసి భవిష్యత్తుని
కవ్వింపజేస్తున్నది

ఉజ్వల మయంతో
సాగిన స్వప్నం లోని
కలలారాణి ప్రత్యక్షమై
కనికరించునో..!
జ్ఞాపకమైపోవునో.!
నేటి రోజుకై పరితపించాలి.



సాహిత్య మణి, 97041 18352

## ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**7416 106 106**
www.ferty9.com

**మీరు తీసుకునే**
**ప్రతి నిర్ణయానికి**
**మా ప్రేమ, సేవ**
**అంకిత భావం మీకు**
**తోడుగా ఉంటుంది.**

**IUI** **IVF** **ICSI** **IMSI** **HSG**



**ఫర్టీ 9** హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్